
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 151

బుధవారం 15-2-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరో విజయమే లక్ష్యంగా..
నేడు వెస్టిండీస్‌తో తలపడనున్న భారత మహిళల జట్టు - 12లో



సెన్సెక్స్ లాభం 600 పాయింట్లు
రెండు రోజుల నష్టాలకు చెక్.. 17,900 పైకి నిఫ్టీ - 13లో



బీబీసీపై ఐటీ 'సర్వే'

పన్ను ఎగవేత ఆరోపణలపై బీబీసీ కార్యాలయాల్లో ఆదాయ పన్నుశాఖ 'సర్వే' జరిపింది. ఇవి దాడులు కావని, పన్ను విధానాలకు సంబంధించిన సర్వే అని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

వివరాలు 6లో ▸



అదానీపై దాచేదేమీ లేదు

అదానీ విషయంలో తాము దాచేది, భయపడేది ఏమీ లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై తానేమీ మాట్లాడలేనన్నారు.

వివరాలు 6లో ▸

UPSC

ఏబీవీపై చర్యలు తీసుకోండి

- రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించండి.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- ఆయనపై రెండు అభియోగాలు నిరూపితం
- కుమారుడికి అడ్డగోలు ప్రయోజనం కలిగించేందుకే ఆ కాంట్రాక్టు
- అఖిల భారత సర్వీసు నిబంధనలనూ ఉల్లంఘించారు
- సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు తీరుపై నిగ్గుతేల్చిన యూపీఎస్సీ

10లో

లింగమనేని రమేష్ నిలువునా ముంచాడు



- విద్యాసంస్థల విస్తరణకు భూములు అప్పగిస్తానని లింగమనేని సంప్రదించారు
- పలు దఫాలుగా ఆయనకు రూ.310 కోట్లు ఇచ్చాను
- ఇప్పటిదాకా భూములు రిజిస్ట్రేషన్ చేయలేదు.. నగదూ ఇవ్వడం లేదు
- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు

10లో

సురక్షిత 'యాత్ర'

పర్యాటకులు, భక్తుల భద్రతకు 20 టూరిస్ట్ పోలీసు స్టేషన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 20 పర్యాటక స్థలాలు, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో ఏర్పాటు
- స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా కియోస్కులు.. వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- సంస్కరణలతో పోలీసు వ్యవస్థ బలోపేతం
- గ్రామ, వార్డు సచివాలయాలతో క్షేత్రస్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థ
- తొలిసారిగా జీరో ఎఫ్ఐఆర్ విధానం
- పోలీసులు ప్రజల స్నేహితులనే భావన కల్పిస్తున్నాం



సాక్షి, అమరావతి: ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు వ్యవస్థలో పలు సంస్కరణలు తెస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థను అందుబాటులోకి తేవడంతోపాటు రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. సంస్కరణల్లో భాగంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యాటకులు, యాత్రికుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసు స్టేషన్లను తాజాగా అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో

మిగతా 2వ పేజీలో ▶

బాకీలంటూ.. తప్పుడు బాకాలు

- అప్పులపై నిస్సిగ్గుగా ఈనాడు అవే అబద్ధాలు
- కార్పొరేషన్ అప్పు ప్రభుత్వ అప్పు ఎలా అవుతుంది?
- సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు



- విభజన నాటికి అప్పులు రూ.1,13,797 కోట్లు.. బాబు దిగిపోయే నాటికి రూ.2,71,797.56 కోట్లు
- బాబు హయాంలో ఆర్థిక ఇబ్బందులు లేకున్నా అప్పులు 2.38 రెట్లు పెరిగాయి
- కోవిడ్‌తో ఆర్థిక ఇబ్బందులున్నా రూ.1.92 లక్షల కోట్లను పేదలకు అందించి ఆదుకున్న జగన్ సర్కార్

2లో

'ఎయిర్ ఇండియా'కు 470 కొత్త విమానాలు



టాటా గ్రూప్ సారథ్యంలోని ఎయిర్ ఇండియా సంస్థ దేశ విదేశాల్లో తన కార్యకలాపాలను మరింత విస్తరింపజేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ నుంచి 250, అమెరికాలోని బోయింగ్ నుంచి 220 విమానాలను కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఆయా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. కొత్త విమానాల కోసం ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇవ్వడం గత 17 ఏళ్లలో ఇదే మొదటిసారి. కాగా, ఈ ఒప్పందాలపై ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్ హర్షం వ్యక్తం చేశారు.

- వివరాలు 6లో





నంబర్ వన్ వర్సిటీగా తీర్చిదిద్దుతా

- వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి వీసీ అయిన తొలి దళిత వ్యక్తిని నేనే
- దళిత జాతికి దక్కిన గౌరవం ఇది
- కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచుతా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నూతన వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ



- వివరాలు 5లో

'ఈనాడు' వ్యాజ్యాలు కొట్టివేత

- ప్రభుత్వ జీవోల అమలు నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ
- ఏబీసీని నిరోధించాలన్న అభ్యర్థన కూడా తిరస్కృతి
- అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసిన న్యాయస్థానం
- ఫలానా పత్రికే కొనాలని ప్రభుత్వం ఉత్తర్వులివ్వలేదు
- ఈనాడు ఆరోపణల ఆధారంగా సాక్షి కోసమే ఆ ఉత్తర్వులిచ్చారన్న నిర్ణయానికి రాలేం

3లో

అమెరికా అధ్యక్ష బరిలో నిక్కీ హేలీ!



భారతీయ మూలాలున్న మహిళా నాయకురాలు, దక్షిణ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ వచ్చే ఏడాది జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్నారు.

- వివరాలు 6లో

బాల్యం.. శిథిలం



తుర్కియే, సిరియాలో సంభవించిన భారీ భూకంపం ఎందరో చిన్నారుల్ని అనాథల్ని చేసింది. వీరిలో చాలా మంది రోజుల పసికందులే. ఇప్పటికే అంతర్యుద్ధంతో అల్లాడిపోతున్న సిరియా పిల్లల మీద భూకంపం పిడుగుపాటులా మారింది.

- వివరాలు 6లో

ఎంత చదివినా అర్థం కావట్లేదని చిర్రెత్తుకొస్తోందా?

మీ కలల కొలువు ఉన్నట్టుండి ఊడిందేమిటని పిచ్చెక్కుతోందా?

ఆఫీస్‌లో గొడ్డులా చాకిరీ చేసినా బాస్ ఏమాత్రం పట్టించుకోవట్లేదని మనసు రగులుతోందా?

ప్రేయసి హ్యాండ్ ఇచ్చిందని తెగ ఫీలవుతున్నారా?

▶ అయితే వెంటనే టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, గాజు గ్లాసులు, ట్యూబ్‌లైట్ల వంటి వస్తువులను విరగ్గొట్టండి!! ఏమిటీ పిచ్చి సలహా అనుకుంటున్నారా? ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్న ట్రెండ్ ఇదే మరి.. అదేమిటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవండి.

కోపం తగ్గించే రేజ్‌రూమ్!

కోపాన్ని చల్లార్చుకొనేందుకు నయా ట్రెండ్ ఇదే | ఆగ్రహావేశాల నుంచి సాంత్వనకు యువత సరికొత్త మార్గం | భారత్‌లోనూ 'చితక్కొట్టే గదులు'.. హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: మనలో ఎవరికైనా ఏదో ఒక సందర్భంలో ఏదైనా విషయంపై పట్టలేని ఆగ్రహావేశాలు, కసి, కోపం వంటివి కలిగే సందర్భాలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు ఎవరికీ చెప్పుకోలేక, ఏం చేయాలో అర్థంకాక చాలా మంది కుమిలిపోయే పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. అయితే ఇలాంటి కోపం, ఫ్రస్ట్రేషన్‌ను తీర్చుకొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చిన గదులే రేజ్ రూమ్స్. వీటిని రేజ్ రూమ్స్, బ్రేక్ రూమ్స్, యాంగర్ రూమ్స్, డిస్ట్రక్షన్ రూమ్స్, స్మాష్ రూమ్స్... ఇలా రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. ఇలాంటి గదులు ఆవేశంతో రగిలిపోతున్న వారికి సాంత్వన చేకూర్చి శాంతపరుస్తున్నాయి.

అసలేమిటీ రేజ్ రూమ్‌లు...?

కోపం, కసి, ఫ్రస్ట్రేషన్ వంటి వాటితో బాగా ఇబ్బంది పడుతున్న వారిలో కొందరుఏదైనా పగులగొట్టడమో, ధ్వంసం చేయడమో చేస్తే ప్రశాంతత వస్తుందని అనుకోవడం పరిపాటి. ఎలాంటి వస్తువులను ధ్వంసం చేయడం ద్వారా స్థిమిత పడతామని భావిస్తారో అలాంటి వాటిని ఒక గదిలో ఉంచి ధ్వంసం చేయించడమే ఈ రేజ్ రూమ్‌ల ఏర్పాటు ఉద్దేశం. ఈ జాబితాలో హాళ్లలోని వస్తువులు, వంటగది వస్తువుల నమూనాలు, ఫర్నిచర్, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌లు, ఫోన్లు మొదలైనవి ఉంటాయి.

ఎప్పుడు మొదలైందీ ట్రెండ్..

2008 ప్రారంభంలో జపాన్, అమెరికాలోని టెక్సాస్‌లలో ఇది మొదలైంది. ముఖ్యంగా జపాన్‌లో 2008లో ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడటంతో ప్రజల్లో పెరిగిన ఒత్తిళ్లు, ఫ్రస్ట్రేషన్‌ను తగ్గించేందుకు ఈ పద్ధతిని కనుగొన్నారు. అమెరికా, జపాన్‌తోపాటు సెర్బియా, యూకే, అర్జెంటీనా వంటి దేశాలలో వందలాది రేజ్‌రూమ్‌లు ఇప్పటికే ఏర్పాటయ్యాయి.

మన దేశంలోనూ షురూ...

2017లో ఢిల్లీ శివార్లలోని గుర్‌గ్రామ్‌లో 'బ్రేక్‌రూమ్' పేరుతో ప్రారంభం. అదే ఏడాది మధ్యప్రదేశ్ ఇండోర్‌లో 'భడ్దాస్'–యాంగర్ రూమ్ అండ్ కేఫ్ ఏర్పాటైంది. తాజాగా ఈ నెలలోనే బెంగళూరులోని బసవన్నగుడిలో రేజ్‌రూమ్‌ను ఐఐటీ మద్రాస్ పట్టభద్రుడు అనన్యశెట్టి ప్రారంభించాడు. 2022 అక్టోబర్ హైదరాబాద్‌లో తొలి రేజ్‌రూమ్‌కు 25 ఏళ్ల సూరజ్ పూసర్ల శ్రీకారం చుట్టాడు.

పాడైపోయిన లేదా పనికిరాని వస్తువులను సేకరించి రేజ్ రూమ్‌లో ఉంచుతారు. తమ కోపాన్ని తీర్చుకోవాలనుకొనే వ్యక్తులు ఈ గదిలోకి వెళ్లి వారి ఆవేశం చల్లారే దాకా

గదిలో ఏముంటాయి?

వస్తువులను చితక్కొట్టొచ్చన్నమాట. అయితే ఇదేమీ ఊరికే కాదండోయ్... వస్తువులను విరగ్గొట్టడమో లేదా పగలగొట్టడమో చేయాలంటే డబ్బు ముట్టజెప్పాల్సిందే.

ఇవీ ప్యాకేజీలు...

ఉదాహరణకు హైదరాబాద్‌లోని రేజ్ రూమ్‌లో 'క్వికీ'ప్యాకేజీ కింద రూ.1,300 చెల్లిస్తే గాజు సీసాలు పెట్టే ఒక ఫైబర్ బుట్ట (బాటిల్ క్రేట్), ఓ కంప్యూటర్ కీ బోర్డు, మౌస్, స్పీకర్లు ధ్వంసం చేయొచ్చు. అలాగే 'రఫ్ డే'కి రూ.1,500 కడితే రెండు క్రేట్లలో 15 బాటిళ్లు, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు విరగ్గొట్టొచ్చు. అదే 'రేజ్ మోడ్'కు అయితే రూ. 2,800 చెల్లించి ఓ మైక్రోవేవ్ ఓవెన్, వాషింగ్ మెషీన్, టీవీ సెట్, రిఫ్రిజిరేటర్, ప్రింటర్, ల్యాప్‌టాప్‌లను విరగ్గొట్టొచ్చు. ఇవేకాకుండా పంచింగ్ బ్యాగ్, బాక్సింగ్ ఉపకరణాలు, గురిచేసి కొట్టే డార్ట్‌లు ఇంకా రేజ్ బాల్స్ ఉన్నాయి. ఈ ప్యాకేజీలు ఉపయోగించుకొనే వారికి ఇండస్ట్రియల్ సూట్, హెల్మెట్, గ్లాస్, షూస్ వంటివి ఇస్తారు. ఒక్కొక్కరూ లేదా ఏడుగురు సభ్యులతో కూడిన బృందం 20 నిమిషాలపాటు ఆ గదిలో ఉండి వస్తువులను ధ్వంసం చేయొచ్చు.

పనికి రానివే..

పనికి రాని వస్తువులు, పాడైన వస్తువులను తుక్కు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి రేజ్ రూమ్‌లో ఉంచుతాం. కోపంతో ఉన్న వారు విరగ్గొట్టిన వివిధ వస్తువులను రీసైక్లింగ్ కేంద్రాలకుతరలిస్తాం.

-నిర్వాహకులు

తాత్కాలిక ఉపయోగమే...

కోపంతో ఉన్న వారికి సాంత్వన కల్పనకు, ప్రతికూల భావనల నుంచి బయటపడేందుకు ఆయా వస్తువుల ధ్వంసం ద్వారా ఓ 'థెరపీ'మాదిరిగా ఉపయోగపడొచ్చు. కానీ ఇది తాత్కాలికంగానే ఉపయోగపడుతుంది. దీన్ని సరైన పద్ధతిలో నిర్వహించలేకపోతే దీర్ఘకాలిక ప్రభావాలు పడొచ్చు.

–ఆశిష్ సెహగల్, యాంగర్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ (గురుగ్రామ్)

తర్వాతి పరిణామాల సంగతేంటి?

డిస్ట్రాక్షన్ థెరపీ స్ఫూర్తితో రేజ్ రూమ్స్ విధానాన్ని రూపొందించారు. అయితే దీనివల్ల తర్వాతి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై ఎవరూ ధ్యాస పెట్టినట్టు కనిపించట్లేదు. ఏదైనా ఉద్రేకం, ఒత్తిళ్లలో ఉన్నప్పుడు మెల్లగా నీటిని తాగడం,20 నుంచి ఒకటి వరకు అంకెలను వెనక నుంచి లెక్కించడం వంటి చర్యల ద్వారా ఆ పరిస్థితిని అధిగమించొచ్చు.

–శివాని సాధు, కౌన్సెలర్ (ఢిల్లీ)


తెలంగాణ

నేటికీ కట్టెల పైనే వంట!

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఆహార తయారీకి ఇంకా కలప, పంట వ్యర్థాలపైనే ఆధారపడుతున్న ప్రజలు

- ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఇంధనాన్నే వాడుతున్న 28 కోట్ల కుటుంబాలు
- గ్యాస్, రవాణా ధరల పెరుగుదలతో మళ్లీ కలప వైపు మళ్లుతున్న భారత పల్లెలు
- ఫలితంగా వాయు కాలుష్యంతో ఏటా సంభవిస్తున్న లక్షలాది మరణాలు



ప్రపంచవ్యాప్తంగా విచ్చలవిడిగా కర్బన ఉద్గారాల విడుదల కారణంగా రోజురోజుకూ భూతాపం పెరిగి అధిక ఉష్ణోగ్రతలకు దారితీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ఎన్నో కష్టనష్టాలు ఎదురవుతున్నప్పటికీ ప్రజల ఆలోచనా తీరు మాత్రం మారడంలేదు. అధిక కర్బన ఉద్గారాల విడుదల కారకాల్లో ఒకటైన వంట చెరకు వినియోగం నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎల్‌పీజీ, సోలార్, విద్యుత్ వాడకం ఆశించిన స్థాయిలో పెరగకపోగా పాతకాలం తరహాలో కట్టెలు, పంట వ్యర్థాలు, పిడకల వినియోగం ఇంకా కొనసాగుతోంది. తద్వారా అడవుల నరికివేత కూడా ఎక్కువవుతోంది. దేశంలో ఇంకా దాదాపు 44 శాతం మంది అడవుల నుంచి కలప, పంటల వ్యర్థాలు, పిడకలను వినియోగించి ఆహారం తయారు చేసుకుంటున్నారు. ఇటుకల తయారీకి కూడా కలప, పంటల వ్యర్థాలు వినియోగిస్తున్నారు. చిన్నచిన్న పరిశ్రమలు సైతం కట్టెలనే వాడుతున్నాయి. చివరకు బయోమాస్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు సైతం పంట వ్యర్థాలు కాకుండా ఏకంగా అటవీ కలపను వినియోగిస్తున్నాయి. మరోవైపు కలపతో బొగ్గు తయారీ కూడా చేస్తున్నారు. ఫలితంగా వెలువడుతున్న వాయు కాలుష్యంతో ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారు. ప్రపంచంలో ఈ తరహా మరణాలు చైనా తరువాత భారత్‌లోనే ఎక్కువని అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తున్నాయి.



ఎల్‌పీజీ వినియోగం పెరిగినా..

దేశంలో దశాబ్దకాలంగా ఇళ్లలో ఎల్‌పీజీ వినియోగం పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 30.5 కోట్ల ఎల్‌పీజీ గృహ వినియోగదారులున్నట్లు ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. 2012లో రూ. 410 ఉన్న 14.5 కేజీల సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 1,100కు చేరుకోవడంతో వినియోగదారుల సంఖ్య పడిపోతోందని డీలర్లు చెబుతున్నారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద ఉచితంగా దాదాపు 8 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినా సిలిండర్ ధరలు మోయలేని భారంగా మారిన నేపథ్యంలో చాలావరకు రీఫిల్లింగ్‌కు రావడం లేదని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. మండల కేంద్రాల్లోనూ సిలిండర్ల పంపిణీ కేంద్రాలు తగిన స్థాయిలో అందుబాటులో లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి సిలిండర్లను తెచ్చుకోవాల్సి రావడం వల్ల సిలిండర్ ధరతోపాటు రవాణా చార్జీలు కూడా తడిసిమోపెడవుతున్నాయి. సిలిండర్ అయిపోయిన వెంటనే రీఫిల్ దొరుకుతుందన్న గ్యారంటీ గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడం వల్ల కలపతో ఆహార తయారీకి మొగ్గుతున్నారు. స్నానాలకు అవసరమైన వేడినీటి కోసం కలపనే వినియోగిస్తున్నారు. పట్టణాల్లో ఎల్‌పీజీ వినియోగం దాదాపు 88.6 శాతం ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో అది 42 శాతం మాత్రమే ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే గ్రామీణ ప్రాంతాల్లోని గృహిణులు ఇంకా అడవుల నుంచి తెచ్చిన కలప, పంట పొలాల్లోని వ్యర్థాలు, పిడకలను వాడుతున్నారు.

కలప కాలడం వల్ల వచ్చే..

కలప, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వెలువడుతున్న వాయు కాలుష్యం వల్ల దేశంలో ఏటా 3.3 లక్షల మంది మరణిస్తున్నారని 'లాన్సెట్ కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ చేంజ్'అధ్యయనం వెల్లడించింది. అదే చైనాలో 3.8 లక్షల మంది, యూరోప్‌లో 1.17 లక్షల మంది, యూఎస్‌లో 32 వేల మంది మరణిస్తున్నారని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు దాదాపు 28 కోట్ల మంది ఇంకా కలప, పంట వ్యర్థాలను వినియోగించి ఆహారాన్ని తయారు చేసుకుంటున్నారని సమాచారం. వంట చెరకు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది మరణిస్తున్నారని పలు అంతర్జాతీయ సంస్థలు తమ సర్వేల్లో పేర్కొంటున్నాయి. ఎల్‌పీజీ వినియోగిస్తున్న వారిలోనూ 12 శాతం మంది రెండో ఇంధనంగా ఈ కలపను వినియోగిస్తున్నారని గణాంకాలు పేర్కొంటున్నాయి.



బొగ్గు డిమాండ్‌ను తగ్గించాలి...

చెట్లను కొట్టేయడం వల్ల కర్బన ఉద్గారాలు పెరుగుతాయి. కొట్టేసిన చెట్టును బొగ్గుగా మార్చడానికి విద్యుత్ లేదా ఇతర రూపాల్లో ఇంధనం అవసరమవుతుంది. మళ్లీ బొగ్గును కాల్చినా అది కూడా కాలుష్యమే. ఈ రకంగా మూడు దశల్లోనూ కాలుష్యం ఉంటుంది. నల్లగొండ జిల్లాలో ఈ తరహా కలప కాల్చివేత ఎక్కువగా జరుగుతోంది. ఇదొక పాత విధానమైనా ఇంకా ఎందుకు అనుసరిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ బొగ్గును అధికంగా చిన్న తరహా పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటల్స్, దాబాల వంటి వాటిలో వాడుతున్నారు. వీటికి బొగ్గు సరఫరా పెంచితే ఇలాంటి బొగ్గు ఉపయోగించరు. అసలు బొగ్గే వద్దనుకుంటే సబ్సిడీపై విద్యుత్ ఇవ్వాలి. బాయిలర్ వంటివి ఎలక్ట్రిక్‌పై నడిచేవి అందుబాటులోకి తేవాలి. ముందుగా ఈ రకమైన బొగ్గుకు ఉన్న డిమాండ్‌ను తగ్గించాలి. చెట్లు కొట్టేయకుండా చట్టాన్ని తీసుకురావాలి.పచ్చదనానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి సంబంధించిన డిమాండ్, సప్లయ్‌ను తగ్గించడం ద్వారా అనుకున్న ప్రయోజనాలు పొందొచ్చు. ప్రస్తుతానికైతే చెట్లకు, పర్యావరణానికి నష్టం కలగజేసే వాటిపై ప్రభుత్వపరంగా ఎలాంటి నియంత్రణలు, పర్యవేక్షణలు లేవు.

– డా. దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణవేత్త, పాలసీ అనలిస్ట్

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన కర్ణాటక గురుపీఠ పీఠాధిపతి



సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కర్ణాటక కాగినెలె కనకదాసు గురుపీఠ పీఠాధిపతి జగద్గురు నిరంజనానందపురి మహాస్వామి, కర్ణాటక పురపాలక శాఖ మంత్రి ఎం.టి.బి.నాగరాజు, మాజీ మంత్రి హెచ్‌.ఎం.రేవణ్ణ, కర్ణాటక వెనుకబడిన కులాల ఫెడరేషన్‌ ప్రెసిడెంట్‌ బి.కె.రవి కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు సీఎంతో భేటీ అయ్యారు. తిరుమలలో కనకదాసు గురుపీఠం మఠం నిర్మించేందుకు ఒక ఎకరం భూమిని కేటాయించాలని సీఎం జగన్‌కు వారు విజ్ఞప్తి చేశారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. తిరుమల క్షేత్రంలో తమ కురబ సామాజిక వర్గానికి ఇప్పటి వరకు మఠం లేదని, లక్షలాదిమంది స్వామి వారి భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని పీఠాధిపతి నిరంజనానందపురి మహాస్వామి ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. అంతేకాక శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కీర్తనలు, ప్రాశస్త్యంతో తమ పీఠానికి ఉన్న సంబంధాన్ని ఆయన సీఎంతో పంచుకున్నారు. ఈ సమావేశంలో మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్‌, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌ జిల్లాలో సీఎం పర్యటన
జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్‌కు భూమిపూజ

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్‌ జగన్‌ బుధవారం (15న) వైఎస్సార్‌ జిల్లాలోని జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి ఆయన బయలుదేరుతారు. 10.50 గంటలకు జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ళపల్లె చేరుకుంటారు. 11.10 నుంచి 11.30 మధ్య జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్‌కు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి 12.45 గంటల మధ్య స్టీల్‌ ప్లాంట్‌ మౌలిక సదుపాయాలపై జరిగే సమావేశంలో పాల్గొంటారు. 1.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.40 కి పులివెందుల చేరుకుంటారు. 2 గంటల నుంచి 2.15 వరకు పులివెందుల ఎస్‌సీఎస్‌ఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో మూలి బలరామిరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. 2.40 గంటలకు పులివెందుల నుంచి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఏప్రిల్‌ 14న అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ
ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



మానేసర్‌లో విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రుల బృందం

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్‌ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏప్రిల్‌ 14న ఆవిష్కరించాలన్న సీఎం వైఎస్‌ జగన్‌ ఆశయం కార్యరూపం దాల్చుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. హరియాణాలోని మానేసర్‌లో 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్‌ మేరుగు నాగార్జున ఆధ్వర్యంలోని మంత్రుల బృందం మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించింది. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్‌, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ విగ్రహాన్ని రాబోయే అంబేడ్కర్‌ జయంతి రోజున ఆవిష్కరించాలని సీఎం జగన్‌ కృతనిశ్చయంతో ఉన్నారని, విగ్రహ నిర్మాణ పనులను మంత్రులతో పాటుగా సీఎం కూడా సమీక్షిస్తున్నారని తెలిపారు. రూ.268 కోట్లతో నిర్మించాలనుకున్న ఈ అంబేడ్కర్‌ స్మృతివనం నిర్మాణ వ్యయం మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

రాజధానిగా విశాఖపట్నం సరైన నిర్ణయమే
ఏఐఏటీఎఫ్‌ చైర్మన్‌ మణీందర్‌జీత్‌ సింగ్‌ బిట్టా




తిరుపతి అలిపిరి: ఐదేళ్ల క్రితం కంటే ఏపీలో ఇప్పుడు బాగా అభివృద్ధి కనిపిస్తోందని ఆల్‌ ఇండియా యాంటీ టెర్రరిస్ట్‌ ఫ్రంట్‌ (ఏఐఏటీఎఫ్‌) చైర్మన్‌ మణీందర్‌జీత్‌ సింగ్‌ బిట్టా చెప్పారు. మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. ఏపీకి రాజధానిగా విశాఖను నిర్ణయించడం సరియైన నిర్ణయమన్నారు. ఏపీ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్‌ జగన్‌ సుపరిపాలన అందిస్తున్నారని అభినందించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ప్రభాకరన్‌పై తమ విధానం ఏంటో స్పష్టం చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

ఆ రెండు పరీక్షల్లో అర్హత తప్పనిసరి
ఇంటర్‌ బోర్డు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఇంటర్‌ బోర్డు నిర్వహించే ఎథిక్స్‌–హ్యూమన్‌ వాల్యూస్‌, పర్యావరణ విద్య సబ్జెక్టులపై నిర్వహించే పరీక్షలలో పబ్లిక్‌ పరీక్షలు రాసే విద్యార్థులందరూ తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుందని ఇంటర్‌ బోర్డు తెలిపింది. ఈ పరీక్షలు ఈ నెల 15, 17 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయి. ప్రస్తుత విద్యాసంవత్సరపు ఇంటర్‌ విద్యార్థులు తమ పబ్లిక్‌ ఎగ్జామినేషన్‌ రిజిస్టర్డ్‌ నంబర్‌తో పరీక్షలు రాయాలని ఇంటర్‌ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు మంగళవారం తెలిపారు. ఇంతకు ముందరి పరీక్షల్లో ఫెయిలైన పాత విద్యార్థులు తమ పాత హాల్‌టికెట్‌ నంబర్‌తో పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈ పరీక్షలకు ఎలాంటి ఫీజు ఉండదన్నారు. ఈ ఎథిక్స్‌– హ్యూమన్‌ వాల్యూస్‌, పర్యావరణ విద్య సబ్జెక్టుల పరీక్షల్లో అర్హత సాధించని వారికి ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షలకు సంబంధించిన పాస్‌ సర్టిఫికెట్లు జారీ కావని చెప్పారు.

లోకేశ్‌.. టీడీపీ సింబల్‌ ఏంటో తెలుసుకో..!
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌



సాక్షి, అమరావతి: టీడీపీ నేత నారా లోకేశ్‌ భాష, బాడీ లాంగ్వేజ్‌ చూసి జనాలు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌ అన్నారు. తెలుగు రాయడం, మాట్లాడటం రాని వ్యక్తి ఏపీ రాజకీయాల్లో ఉండటం బాధాకరమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ సింబల్‌ (గుర్తు) కూడా ఏంటో లోకేశ్‌కు తెలియదని ఎద్దేవా చేశారు. లోకేశ్‌.. టీడీపీ సింబల్‌ ఇదిగో..తెలుసుకో! తెలుగు ప్రజలు అసహ్యించుకునే సింబల్‌ చూపించకు అని హితవు పలికారు. ఎన్టీఆర్‌ సింబల్‌..బాబు సింబల్‌.. లోకేశ్‌ సింబల్‌ ఇవే అంటూ ఆయన ఆనాటి ఎన్టీఆర్‌ సింబల్‌ని, చంద్రబాబు సింబల్‌ని, ఇప్పటి లోకేశ్‌ ప్రదర్శిస్తోన్న సింబల్‌ని టీవీలో ప్రదర్శించి మీడియాకు చూపించారు. లోకేశ్‌ మాటలు, చేష్టలు చూస్తుంటే, అతను స్టాన్‌ఫర్డ్‌ కాదు స్విమ్మింగ్‌పూల్‌ యూనివర్సిటీలో చదువుకున్నట్లు ఉన్నాడని ఎద్దేవా చేశారు.

సురక్షిత 'యాత్ర'

▶ మొదటి పేజీ తరువాయి

టూరిస్ట్‌ పోలీసు స్టేషన్లను మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌ వర్చువల్‌ విధానంలో ప్రారంభించారు. ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలకు గతానికి భిన్నంగా సుహృద్భావ వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలీసులు ప్రజల స్నేహితులనే భావన కలిగేలా రిసెప్షనిస్టులను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌ ఇంకా ఏమన్నారంటే...

పర్యాటకులకు సౌకర్యాలు, భద్రత

పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారి భద్రత కోసం ప్రత్యేకంగా 20 ప్రాంతాలను గుర్తించి కియోస్కులు ఏర్పాటు చేశాం. అవి స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు అనుబంధంగా 20 అదనపు పోలీస్‌ స్టేషన్లుగా పని చేస్తాయి. ప్రతి కియోస్క్‌లో సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. దీన్ని ఎస్‌ఐ లేదా ఏఎస్‌ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఆపదలో చిక్కుకునేవారు సంప్రదించేందుకు ప్రత్యేకంగా టెలిఫోన్‌ నంబరు డిస్‌ప్లే చేస్తారు. కియోస్కులలో సిబ్బందికి ప్రత్యేక టెలిఫోన్‌ నెంబరు, రేడియో సెట్‌, ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్స్‌, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాపు, వాహనాల సదుపాయం కల్పించాం. పర్యాటకులు, యాత్రికులు నిర్భయంగా గడిపేలా భరోసా కల్పిస్తూ టూరిస్ట్‌ పోలీసు స్టేషన్లు పని చేస్తాయి. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న తపనతో ఇవన్నీ చేస్తున్నాం. పోలీసుశాఖలో ఇది సువర్ణాధ్యాయం. పోలీస్‌ శాఖలో గొప్ప సంస్కరణగా నిలుస్తుంది.

టూరిస్ట్‌ పోలీస్‌ స్టేషన్లు ఇలా..

- విశాఖపట్నం జిల్లా: ఆర్కే బీచ్‌
- కాకినాడ జిల్లా: కుక్కుటేశ్వర స్వామి దేవాలయం
- తూర్పు గోదావరి జిల్లా: పుష్కర ఘాట్‌
- ఏలూరు జిల్లా: ద్వారకా తిరుమల
- కృష్ణా జిల్లా: మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, మంగినపూడి బీచ్‌
- ఎన్టీఆర్‌ జిల్లా: విజయవాడ కనకదుర్గ ఆలయం, భవానీ ద్వీపం, పవిత్ర సంగమం ఘాట్‌
- ఎస్పీఎస్‌ఆర్‌ నెల్లూరు జిల్లా: మైపాడు బీచ్‌, పెంచలకోన దేవాలయం
- కర్నూలు జిల్లా: మంత్రాలయం దేవాలయం
- నంద్యాల జిల్లా: మహానంది, అహోబిలం ఆలయం
- అన్నమయ్య జిల్లా: హార్సిలీ హిల్స్‌
- వైఎస్సార్‌ జిల్లా: గండికోట, ఒంటిమిట్ట దేవాలయం
- శ్రీసత్యసాయి జిల్లా: లేపాక్షి దేవాలయంలతోపాటు మరో రెండు పర్యాటక ప్రాంతాలు.

అక్క చెల్లెమ్మలకు తోడుగా మహిళా సిబ్బంది

టూరిస్ట్‌ పోలీస్‌ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందిలో సగం మంది మహిళలు ఉన్నారు. ఎవరైనా అక్కచెల్లెమ్మలు ఆ కియోస్కులకు వెళ్లినప్పుడు మహిళా సిబ్బంది వారికి తోడుగా నిలబడతారు. ఇవన్నీ మంచి పరిణామాలు. దిశ యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకుంటే పోలీసు సోదరుడు మీకు తోడుగా ఉన్నట్లేనని భరోసా కల్పించేందుకు కరపత్రాలు కూడా ఆ ప్రాంతంలో అందుబాటులో ఉంచుతారు. వీటన్నింటి వల్ల పర్యాటకులందరికీ మంచి జరుగుతుంది. ఈ పోలీస్‌ స్టేషన్లలో పనిచేసేవారు అంకిత భావంతో, సేవా భావంతో విధులు నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నా.



టూరిస్ట్‌ పోలీస్‌ స్టేషన్‌లను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌. చిత్రంలో మంత్రి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్‌ రెడ్డి

దిశ యాప్‌ డౌన్‌లోడ్లు 1.20 కోట్లు

దిశ యాప్‌ను ఇప్పటికే దాదాపు 1.20 కోట్ల మందికిపైగా డౌన్‌లోడ్‌ చేసుకుని రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారు. అక్క చెల్లెమ్మలు ఆపదలో ఉన్నప్పుడు ఫోన్‌ను ఐదు సార్లు షేక్‌ చేసినా.. ఓఎస్‌ బటన్‌ నొక్కినా.. పది నిమిషాల్లోనే పోలీసులు అక్కడకు చేరుకుని భద్రత కల్పిస్తారు. ఇలా ఇప్పటి వరకు సహాయం కోరిన దాదాపు 6 వేల మందికి రక్షణ కల్పించి అండగా నిలిచారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా పోలీసుశాఖలో కనిపిస్తున్న మంచి మార్పులు ఇవి.

పర్యాటకులకు పూర్తి భద్రత: హోంమంత్రి తానేటి వనిత

రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు పూర్తి భద్రత కల్పించేందుకు టూరిస్ట్‌ పోలీస్‌ స్టేషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. పర్యాటకులకు అత్యవసర సాయం అందించేందుకు టూరిస్ట్‌ పోలీస్‌ స్టేషన్ల ఏర్పాటు శుభపరిణామమన్నారు. మహిళల భద్రత కోసం దేశంలో విప్లవాత్మక రీతిలో దిశ వ్యవస్థను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో టూరిస్ట్‌ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేస్తామని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

బాకీలంటూ.. తప్పుడు బాకాలు

సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర అప్పులు, పెండింగ్‌ బిల్లులు, గ్యారెంటీ, నాన్‌ గ్యారెంటీ అప్పులపై 'ఈనాడు' పచ్చి అబద్ధాలను ప్రచురిస్తోందని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. నిపుణుల పేరుతో అంతులేని అబద్ధాలు అచ్చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎవరా నిపుణులు? పేర్లు వెల్లడించే ధైర్యం ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తూ లెక్కలను గణాంకాల సహితంగా వెల్లడిస్తోందని, కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ నివేదికలే ఇందుకు సాక్ష్యమని గుర్తు చేశారు. లేని అప్పులు, పెండింగ్‌ బిల్లులు, గ్యారెంటీ, నాన్‌ గ్యారెంటీ అప్పులు ఉన్నట్లు తప్పుడు గణాంకాలు ఎలా ప్రచురిస్తారని నిలదీశారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

- రాష్ట్ర అప్పులు రూ.4.42 లక్షల కోట్లు ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాల ఆధారంగా కేంద్ర ఆర్థిక శాఖ రాజ్యసభలో స్పష్టంగా చెప్పినప్పటికీ రూ. 9.16 లక్షల కోట్లు అంటూ ఏ గణాంకాలు, ఆధారాలు ప్రకారం ఈనాడు కథనాలను ప్రచురించింది? వాటిని పట్టుకుని చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌ ఎలా మాట్లాడతారు? బడ్జెట్‌ లోపల అప్పులతో పాటు ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చిన కార్పొరేషన్‌ అప్పుల గురించి అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజెంటేషన్‌తో సవివరంగా తెలియచేసినా ఈనాడు ఊహాగానాలతో, నిపుణులు అంచనాల పేరుతో అవాస్తవ కథనాలను ఎలా ప్రచురిస్తుంది? రాష్ట్ర అప్పులకు సంబంధించి ఎన్నిసార్లు వివరణ ఇచ్చినా అవే తప్పుడు వార్తలను పథకం ప్రకారం పదే పదే ప్రచారం చేస్తోంది.
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు రెట్టింపు అయ్యాయంటూ టీడీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పులు రెట్టింపు అయినట్లుగా ఇప్పుడు అందుకు ఏమాత్రం ఆస్కారం లేదు. రాష్ట్ర అప్పులపై టీడీపీ ఎంపీ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ ''స్టేట్‌ ఫైనాన్సెస్‌- ఏ స్టడీ ఆఫ్‌ స్టేట్‌ బడ్జెట్‌'' ఆర్బీఐ నివేదికతో స్పష్టమైన సమాధానం ఇవ్వడంతో తట్టుకోలేక దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు.
- ప్రస్తుత ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అప్పులు 62.78 శాతం మాత్రమే పెరిగాయి. అప్పులు రెట్టింపు కావాలంటే ఒక్క 2023–24లోనే రూ.1,01,150 కోట్ల మేర అప్పులు చేయాల్సి ఉంటుంది. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో 7.5 శాతానికి సమానం. కేంద్ర నిబంధనల ప్రకారం జీఎస్‌డీపీలో 3.5 శాతానికి మించి అప్పులు చేయడానికి వీలుండదు. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గత సర్కారు పాలనలో మాదిరిగా అప్పులు రెట్టింపు అయ్యేందుకు ఆస్కారమే లేదు.
- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఇప్పటి మాదిరిగా ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయకున్నా, కోవిడ్‌ లాంటి విపత్కర పరిస్థితులు లేనప్పటికీ అప్పులు మాత్రం రెట్టింపు అయ్యాయి. కోవిడ్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సమర్థంగా అధిగమించి సీఎం జగన్‌ ప్రభుత్వం రూ.1.92 లక్షల కోట్లను పేదలకు నేరుగా పారదర్శకంగా అందించి ఆదుకుంది.
- విభజన తర్వాత 2014 నాటికి రాష్ట్ర అప్పులు రూ.1,13,797 కోట్లు ఉండగా చంద్రబాబు దిగిపోయే నాటికి 2019 మే నాటికి రూ.2,71,797.56 కోట్లకు ఎగబాకాయి. టీడీపీ పాలనలో అప్పులు ఏకంగా 138.84 శాతం అంటే 2.38 రెట్లు పెరిగాయి. సగటున ఏటా అప్పుల్లో 19.02 శాతం వృద్ధి నమోదైంది.
- వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.2,71,797.56 కోట్లుగా ఉన్న అప్పులు 2022 – 23 బడ్జెట్‌ అంచనాల ప్రకారం రూ.4,42,442 కోట్లకు చేరుకున్నాయి. నాలుగేళ్లలో అప్పుల్లో 62.78 శాతం వృద్ధి నమోదైంది. అంటే సగటున 13.55 శాతమే. ఇది టీడీపీ సర్కారు సగటు 19.02 శాతంతో పోలిస్తే తక్కువే.
- గత సర్కారు ఎన్నికలకు ముందు రెండు నెలల్లో ఓట్ల కోసం భారీగా అప్పులు చేసింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా 2019 ఏప్రిల్‌ 9న ఒకే రోజు రూ.5,000 కోట్లు అప్పులు చేసింది. నాడు నోరు మెదపని టీడీపీ అనుకూల మీడియా ఇప్పుడు నిబంధనల ప్రకారం అప్పులు తీసుకుంటున్నా ఏదో ఘోరం జరిగిపోతున్నట్లు విషం చిమ్ముతున్నాయి. వీటిని పట్టుకుని విషయంపై అవగాహన లేని పవన్‌కళ్యాణ్‌ లాంటి వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.
- వాస్తవానికి టీడీపీ సర్కారు నిబంధనలకు మించి ఐదేళ్లలో రూ.48,128.70 కోట్లు ఎక్కువ అప్పులు చేసింది. దీనిపై ఈనాడు కలం కదల్లేదు ఎందుకో మరి? ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లలో నిబంధనలకు లోబడి రూ.2,696.76 కోట్లు తక్కువ అప్పులు చేసినా, ఇంత మెరుగ్గా ద్రవ్య నిర్వహణ చేస్తున్నా ప్రశంసించకపోగా బురద చల్లడం ఏమిటి?
- పెండింగ్‌ బిల్లులు ఏకంగా రూ.1.85 లక్షల కోట్లు ఉన్నట్లు ఈనాడు పచ్చి అబద్ధాలను ప్రచురించింది. వీటికి ఆధారాలున్నాయా? మొత్తం పెండింగ్‌ బిల్లుల వివరాలను వెల్లడించే ధైర్యం ఉందా? పెండింగ్‌ బిల్లులపై గత ఏడాది సెప్టెంబర్‌ 19వ తేదీన అసెంబ్లీ వేదికగా ఆర్థిక మంత్రి స్పష్టంగా చెప్పారు. టీడీపీ అధికారం నుంచి దిగిపోయే సరికి పెండింగ్‌ బిల్లులు రూ.40,172 కోట్లు ఉండగా ఇప్పుడు రూ.21,673 కోట్లు మాత్రమే ఉన్నాయని ప్రకటించారు. గత సర్కారు పెండింగ్‌ బిల్లుల గురించి ఒక్క ముక్క రాయకుండా తప్పుడు వార్తలు ఎందుకు? ఇదేనా ఈనాడు పాటించే జర్నలిజం, మీడియా విలువలు?
- రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తు లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు చేసిన అప్పులు రాష్ట్ర అప్పులు ఎలా అవుతాయి? నాన్‌ గ్యారెంటీ రుణాలు రూ.87,233 కోట్లు అంటూ ఈనాడు ప్రచురించిన కథనం అవాస్తవం. ప్రభుత్వ గ్యారెంటీ లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు చేసే రుణాలు ప్రభుత్వ అప్పుల కిందకు రావు. ఆమాత్రం కనీస అవగాహన లేకుండా కథనాలు ప్రచురించారు. ఉదాహరణకు ఎన్‌టీపీసీ తీసుకునే రుణాలు కేంద్ర ప్రభుత్వ అప్పుల కిందకు రావు. టీడీపీ హయాంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లు రూ.55,108.94 కోట్లు నాన్‌ గ్యారెంటీ రుణాలు తీసుకుంటే వాటి గురించి ఈనాడు ఎప్పుడైనా రాసిందా? నాన్‌ గ్యారెంటీ రుణాలను కేంద్రం అప్పులుగా ఎప్పుడైనా చూపించిందా?
- ప్రభుత్వ గ్యారెంటీతో వివిధ కార్పొరేషన్లు చేసిన అప్పుల్లో ఎక్కడా దాపరికం లేకుండా ద్రవ్య జవాబుదారీ బడ్జెట్‌ నిర్వహణ చట్టం (ఎఫ్‌ఆర్‌బీఎం) ప్రకారం అసెంబ్లీకి వెల్లడించాం. 2021 డిసెంబర్‌ 31 నాటికి పూచీకత్తు రుణాలు రూ.1.17,730 కోట్లు ఉన్నట్లు అసెంబ్లీకి వెల్లడించాం. 2022లో మరికొన్ని గ్యారెంటీ రుణాలు పెరిగినా రూ.1.27 లక్షల కోట్లకు మించదు. అలాంటిది రూ.1.78 లక్షల కోట్లు ఉన్నట్లు ఈనాడు ఏ ఆధారాలతో రాసింది?
- ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల మేరకే గ్యారెంటీ రుణాలున్నాయి. ఆర్బీఐ, 15వ ఆర్థిక సంఘం నిర్ధారించిన మేరకే రాష్ట్ర అప్పులున్నాయి. కంపెనీల యాక్ట్‌ కింద ఆడిట్‌ లేకుండా లెక్కలను ఎవరైనా రిలీజ్‌ చేస్తారా? ఆడిట్‌ పూర్తయ్యాక వాటిని వెల్లడిస్తారు. ఈలోగా తమ ఇష్టానుసారంగా లెక్కలు గట్టి రాసుకుంటామనే ధోరణిలో టీడీపీ అనుకూల మీడియా వ్యవహరిస్తోంది.
- నిపుణుల అంచనాల పేరుతో వాస్తవాలను వక్రీకరించి తప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. నా బ్యాంకు ఖాతాల్లో ఎన్ని డబ్బులున్నాయో నిపుణులకు ఎలా తెలుస్తుంది? ఊహాగానాలతో, ఇష్టం వచ్చిన అంకెలతో తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి.




GOVERNMENT OF INDIA
MINISTRY OF FINANCE
DEPARTMENT OF EXPENDITURE
RAJYA SABHA

Assessment of financial condition of Andhra Pradesh

ANSWER

MINISTER OF STATE FOR FINANCE
(SHRI PANKAJ CHAUDHARY)

రాజ్యసభలో మంత్రి ఇచ్చిన సమాధానం



ఆర్బీఐ గణాంకాల ప్రకారం ఏపీ ద్రవ్య లోటు



ఆర్బీఐ గణాంకాల ప్రకారం ఏపీ అప్పులు

టీడీపీ హయాంలో అప్పులు

సంవత్సరం (మార్చి నాటికి)	అప్పులు రూ.కోట్లల్లో
2014	1,13,797.00
2015	1,22,605.80
2016	1,47,935.20
2017	2,54,283.00
2018	2,29,333.80
2019 (ఏప్రిల్‌, మే)	2,71,797.56
5 ఏళ్లలో పెరిగిన అప్పుల శాతం	138.84%
సగటు వార్షిక వృద్ధి	19.02%

వైఎస్సార్‌ సీపీ పాలనలో ఇలా..

సంవత్సరం (మార్చి నాటికి)	అప్పులు రూ.కోట్లల్లో
2019 (జూన్‌ నుంచి)	2,71,797.56
2020	3,07,671.00
2021	3,53,021.00
2022	3,93,718.00
2023 (బడ్జెట్‌ అంచనాలు)	4,42,442.00
నాలుగేళ్లలో పెరిగిన అప్పుల శాతం	62.78%
సగటు వార్షిక వృద్ధి	13.55%

టీడీపీ హయాంలో అనుమతికి మించి అడ్డగోలు అప్పులు ఇలా

ఆర్థిక ఏడాది	జీఎస్‌డీపీ	ద్రవ్యలోటు	శాతం	రుణపరిమితి శాతం	రుణపరిమితి	చేసిన రుణం	పరిమితికి మించి రుణం
2014-15	5,24,975.64	31,747.00	6.05	3.00	15,749.27	15,997.73	48,128.70
2015-16	6,04,228.62	21,863.00	3.62	3.00	18,126.86	3,736.14	
2016-17	6,84,415.87	30,909.00	4.52	3.00	20,532.48	10,376.52	
2017-18	7,86,135.42	32,373.00	4.12	3.00	23,584.06	8,788.94	
2018-19	8,73,721.11	35,441.00	4.06	3.00	26,211.63	9,229.37	
వైఎస్సార్‌ సీపీ పాలనలో అనుమతికి లోబడే చేసిన అప్పుల వివరాలు							
2019-20	966,099.05	39,684.00	4.11	3.00	28,982.97	10,701.03	-2,696.76
2020-21	10, 14,373.79	54,369.00	5.36	5.00	50,718.69	3,650.31	
2021-22	12,01,735. 52	37,030.00	3.08	4.50	54,078.10	17,048.10	

టీడీపీ హయాంలో ద్రవ్యలోటు..

సంవత్సరం	ద్రవ్యలోటు	అన్ని రాష్ట్రాల ద్రవ్యలోటు	ఏపీద్రవ్యలోటు	సగటు ద్రవ్యలోటు
2014-15	31,747.00	327,627.00	9.69%	7.06%
2015-16	21,863.00	419,974.00	5.21%	
2016-17	30,909.00	535,903.00	5.77%	
2017-18	32,373.00	410,494.00	7.89%	
2018-19	35,441.00	462,770.00	7.66%	
వైఎస్సార్‌ సీపీ పాలనలో ద్రవ్యలోటు				
2019-20	39,684.00	524,710.00	7.56%	5.76%
2020-21	54,369.00	931,651.60	5.84%	
2021-22	37,030.00	818,584.00	4.52%	

వేసవి పంట కోసం సన్నాహాలు

13 జిల్లాల్లో సాగుపై దృష్టి

సాక్షి, అమరావతి: రబీ పంట చివరి దశకు చేరుకోవడంతో వేసవి పంట సాగుపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. ఇందుకోసం రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 100 శాతం సబ్సిడీపై వైఎస్సార్‌ ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో సరఫరా చేసేందుకు మినీకిట్స్‌ను సిద్ధం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కోస్తాంధ్రలో మూడో పంటగా పెద్ద ఎత్తున అపరాలు సాగు చేసే వారు. డెల్టా ప్రాంతంలో మూడోపంట సాగు చేయని రైతులుండే వారే కాదు. వేసవిలో కాలువ పనులు సకాలంలో పూర్తి కాకపోవడం, శివారు భూములకు నీరు చేరకపోవడం, ఆగస్టు నెలాఖరు వరకు ఖరీఫ్‌ ఊడ్పులు, డిసెంబర్‌ వరకు కోతలు, ఏప్రిల్‌ నెలాఖరు వరకు రబీ కోతలు కొనసాగడంతో వేసవి పంట సాగుకు రైతులు దూరమయ్యారు.

ఏటా మూడో పంటసాగయ్యేలా..

మూడున్నరేళ్లుగా సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తూ భూగర్భజలాలు ఎగసి పడుతున్నాయి. మూడేళ్లుగా గోదావరి డెల్టా కింద రెండో పంటకు నీరివ్వడమే కాదు పదేళ్ల తర్వాత తొలకరి పంటకు ముందస్తుగానే సాగునీరు విడుదల చేయగలిగారు. ఫలితంగా 2021-22 సీజన్‌లో 15వేల ఎకరాల్లో మాత్రమే వేసవి పంట సాగవగా, 2022-23 సీజన్‌లో లక్ష ఎకరాల్లో పంట సాగు చేశారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించడం, భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించడమే లక్ష్యంతో మూడో పంట సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం ఆర్బీకే స్థాయిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అపరాలు, చిరుధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా యాక్షన్‌ ప్లాన్‌ రూపొందిస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తన సరఫరా..

గిరిజన ప్రాంతాల్లో చిరుధాన్యాలు, గిరిజనేతర ప్రాంతాల్లో అపరాలు, వేరుశనగ సాగుకు ప్రాధాన్యతనిస్తున్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, తూర్పు గోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతులకు 426.60 క్వింటాళ్ల విత్తనాన్ని మినీకిట్స్‌ రూపంలో ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కనీసం 40 వేల ఎకరాలకు సరిపడా మినీ కిట్స్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆర్బీకేల్లో రైతుల వివరాలను నమోదు చేసి మార్చి రెండో వారం కల్లా విత్తనాలను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి పంట సాగును ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించామని, వేరుశనగ, అపరాలు, చిరుధాన్యాల సాగుకు సరిపడా మినీ కిట్స్‌ సిద్ధం చేస్తున్నామని వ్యవసాయ శాఖ స్పెషల్‌ కమిషనర్‌ హరికిరణ్‌ చెప్పారు.

క్లుప్తంగా...

'ఎమ్మెల్సీ' స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన

సాక్షి, అమరావతి: ఏపీలో 3 పట్టభద్రుల నియోజకవర్గాలకు జరుగుతోన్న ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఆ పార్టీ జాతీయ నాయకత్వం మంగళవారం ప్రకటించింది. ప్రకాశం–నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కడప–అనంతపూర్– కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగరూరు రాఘవేంద్ర, శ్రీకాకుళం–విజయనగరం–విశాఖ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీవీఎన్ మాధవ్ పేర్లను ప్రకటిస్తూ న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనను రాష్ట్ర పార్టీ మీడియా విభాగం మంగళవారం విడుదల చేసింది. ఈ ముగ్గురికీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఫోన్ చేసి అభినందనలు తెలిపి ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలని ఆదేశించారు.

కక్ష గట్టి.. మట్టుపెట్టాడు...

తాడేపల్లి ఎన్టీఆర్ కరకట్టపై బాలిక హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా తాడేపల్లి ఎన్టీఆర్ కరకట్ట మీద జరిగిన బాలిక హత్యకేసులో నిందితుడైన నాగబాబు ధనంజయ రాజు అలియాస్ కుక్కల రాజును పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మీడియాతో మాట్లాడుతూ నాగబాబు ధనంజయ రాజు మద్యం మత్తులో బాలిక ఎస్తేరురాణిని హత్యచేశాడని, బాలికపై అత్యాచారం చేసినట్టు ఆనవాళ్లు లేవని పోస్టుమార్టం చేసిన డాక్టర్లు నిర్ధారించారని చెప్పారు. గంజాయి విషయం కూడా కల్పితమన్నారు. ఎస్తేరురాణి తల్లి మనోరమ, హత్య చేసిన నాగబాబు ధనంజయరాజు ఎదురెదురు ఇళ్లల్లో ఉంటారని, ఎస్తేరురాణిని చెయ్యి పట్టుకుని లాగడంతో.. తల్లి మనోరమకు తెలియజేసిందని, దీంతో మనోరమ బంధువులు నాగబాబును మందలించినట్టు తెలిపారు. ఇది మనసులో పెట్టుకున్న నాగబాబు ఆదివారం రాత్రి 9.30 సమయంలో కత్తి తీసుకుని ఎస్తేరురాణి భుజం, తలపై దాడి చేశాడని, తల్లి గమనించి కేకలు వేయడంతో నాగబాబు అక్కడి నుంచి పరారయ్యాడని చెప్పారు. గాయపడిన ఎస్తేరురాణిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా సోమవారం ఉదయం 5.42 నిమిషాలకు మృతి చెందిందన్నారు. పరారీలో వున్న కుక్కలరాజును గంట వ్యవధిలో పట్టుకున్నామని, హత్యకు ఉపయోగించిన కత్తిని, ఇతర ఆధారాలను సేకరించినట్లు తెలిపారు. కుక్కల రాజుపై రౌడీషీట్ తెరవనున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ వివరించారు.



పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణం చింతలపాలెంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

గడప గడపకూ మన ప్రభుత్వం

పోషణ్ అభియాన్‌లో ఏపీ భేష్

జాతీయ స్థాయిలో 2వ స్థానం దక్కించుకున్న ఏపీ.. పెద్ద రాష్ట్రాలతో పోటీ పడి మరీ ముందుకు..

- మహారాష్ట్రకు 1, గుజరాత్‌కు 3వ స్థానం
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం పోషణ్ అభియాన్‌ను సమగ్రంగా అమలు చేయడంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ పెద్ద రాష్ట్రాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. ఇక చిన్న రాష్ట్రాల్లో సిక్కిం అత్యుత్తమ పనితీరు కనబరిచినట్లు తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతాల్లో దాద్రానగర్ హవేలీ, డామన్–డయ్యూ అగ్రస్థానంలో ఉన్నాయని పేర్కొంది. పథకాన్ని సమగ్రంగా అమలు చేయడంలో అత్యల్ప పనితీరును కనబరిచిన పెద్ద రాష్ట్రాల్లో పంజాబ్, బిహార్ ఉన్నాయని నివేదిక వెల్లడించింది. 19 పెద్ద రాష్ట్రాల్లో 12 రాష్ట్రాలు పోషణ్ అభియాన్ అమల్లో 70 శాతానికి పైగా స్కోర్‌ను సాధించినట్లు వివరించింది. దేశంలో పిల్లలు, మహిళలకు పోషకాహారం అందించడంలో పురోగతిని, కరోనా సమయంలో పథకం అమలు తీరును నీతి ఆయోగ్ నివేదిక విశ్లేషించింది.

75 శాతం పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంపు

17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 12–23 నెలల వయసు గల పిల్లల్లో 75 శాతం కంటే ఎక్కువ మంది పూర్తిగా రోగనిరోధక శక్తిని కలిగి ఉన్నారని నీతి ఆయోగ్ నివేదిక వివరించింది. అలాగే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తిగా రోగనిరోధక శక్తిని కలిగిన పిల్లలు 25 శాతం కంటే తక్కువ మంది ఉన్నారని ఎత్తిచూపింది. అలాగే బిహార్‌లో (65 శాతం గర్భిణులు, 62 శాతం బాలింతలు, 52 శాతం పిల్లలు), పంజాబ్‌లో (78 శాతం గర్భిణులు, 76 శాతం బాలింతలు, 65 శాతం పిల్లలు) రోగనిరోధక శక్తి తక్కువగా ఉందని పేర్కొంది. నివేదిక ప్రకారం.. 16 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 75 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలు (0–59 నెలలు) ఓఆర్ఎస్‌తో చికిత్స పొందుతున్నారని వివరించింది. ఐదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 శాతం మంది పిల్లలు డయేరియాకు ఓఆర్ఎస్‌తో చికిత్స పొందినట్లు తెలిపింది.

నిధుల వినియోగంలో పలు రాష్ట్రాలు వెనుకంజ..

పోషణ్ అభియాన్ కింద కేంద్రం ఇచ్చే మొత్తం నిధులను వినియోగించడంలో పలు రాష్ట్రాలు వెనుకపడ్డాయని నివేదిక పేర్కొంది. 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ నిధులను ఖర్చు చేశారని నివేదిక వెల్లడించింది. పోషణ్ అభియాన్ కోసం విడుదల చేసిన నిధులు పూర్తిగా ఖర్చయ్యేలా చూడాలని సూచించింది. తగినంతగా ఆరోగ్య సదుపాయాలు, సామగ్రి ఉండేలా చూడాల్సి ఉందని పేర్కొంది. అలాగే సమీకృత శిశు అభివృద్ధి పథకం, ఆరోగ్య కార్యక్రమాలను బలోపేతం చేయాలని నిర్దేశించింది. కన్వర్జెన్స్ యాక్షన్ ప్లాన్‌లను (సీఏపీ) అమలు చేయాలని సూచించింది. కార్యక్రమాల అమలుకు గృహ ఆధారిత కౌన్సెలింగ్‌ను బలోపేతం చేయాలని తెలిపింది.

సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు వీలు కల్పించండి

సీఎస్‌కు వేర్వేరుగా ఉద్యోగ సంఘాల వినతిపత్రాలు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు వెంటనే అవకాశం కల్పించాలంటూ ఆయా ఉద్యోగ సంఘాలు వేర్వేరుగా మంగళవారం సీఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశాయి. ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు బత్తుల అంకమ్మరావు, కిషోర్‌లు సీఎస్‌ను కలిశారు. సాధారణ బదిలీలకు వీలుకాకుంటే అంతర్ జిల్లాల బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారికైనా వీలు కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల సాధారణ, అంతర్ జిల్లా బదిలీలు, గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో బాధ్యతలు అప్పగించాలంటూ సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఉద్యోగుల జేఏసీ.. సీఎస్‌కు విన్నవించింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి హృదయరాజు, ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితరులు సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు విజయవాడ ఎన్జీవో భవన్‌లో బండి శ్రీనివాసరావు అధ్యక్షతన జేఏసీ సెక్రటేరియేట్ సమావేశం జరిగింది.

మాచ్‌ఖండ్‌ను సందర్శించిన గోదావరి రివర్ బోర్డు బృందం

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని గోదావరి రివర్ బోర్డు సభ్య కార్యదర్శి అజగేషన్‌తో కూడిన బృందం మంగళవారం సందర్శించింది. జలవివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోడానికి ఈ బోర్డును ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా అజగేషన్‌తో పాటు ఎక్స్‌పర్ట్ మెంబర్ (విద్యుత్) ఆర్ఎం రంగరాజన్‌ల బృందం ముందుగా మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించింది. ప్రాజెక్టులో విద్యుత్ జనరేటర్ల వినియోగం, విద్యుత్ ఉత్పత్తిపై ప్రాజెక్టు అధికారుల నుంచి వివరాలు, ప్రాజెక్టు పరిధిలో వర్షపాతం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జోలాపుట్టు జలాశయాలను పరిశీలించారు. ప్రాజెక్టులో కల్పించాల్సిన సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని బృందం సభ్యులు తెలిపారు.



జోలాపుట్టు జలాశయాన్ని పరిశీలిస్తున్న బోర్డు సభ్యులు

పాదయాత్రతో లోకేశ్ .. జోకేశ్ అయ్యాడు

- జగన్ పులి.. లోకేశ్ పులకేశి
- ఐరన్ లెగ్ లోకేశ్ అంకుల్ సభలు కామెడీ షోలే...
- అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు, ఆయన కుటుంబమే..
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా



నగరి(చిత్తూరు జిల్లా)/పటమట(విజయవాడతూర్పు): పాదయాత్రతో టీడీపీ నాయకుడు లోకేశ్ ఏకంగా జోకేశ్‌గా మారిపోయాడని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ పులి అయితే... లోకేశ్ పులకేశి అని ఎద్దేవా చేశారు. నగరి నియోజకవర్గం పుత్తూరులో నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి రోజా మంగళవారం తీవ్రంగా స్పందించారు. ఆమె నగరి, విజయవాడలో మీడియాతో మీట్లాడారు. 'స్క్రిప్టు రాసిచ్చినా నాలుగు మాటలు సక్రమంగా మాట్లాడలేని వ్యక్తి లోకేశ్. ఆయనకు నన్ను, ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత లేదు. ఐరన్ లెగ్ లోకేశ్ అంకుల్ బహిరంగ సభలు కామెడీ షోల్లా తయారయ్యాయి. ముందురోజు రాత్రి వచ్చి మరుసటిరోజు సాయంత్రం దాకా టెంట్‌లో దాక్కోవడం.. సభలకు జనం రాక పోవడంతో సాయంత్రం ఎదురుచూడడం అనేది ప్రజలందరికీ తెలుసు. చివరికి లోకేశ్ పాదయాత్రకు స్థానికులు రాకపోతే బెంగళూరు, చెన్నై నుంచి జనాలను తెచ్చుకుంటున్నారు. అసలు అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు, లోకేశ్, వారి కుటుంబ సభ్యులే. చిత్తూరు జిల్లాలో పాలుపోసేవారు, కూరగాయలు అమ్మేవారు అలాగే ఉన్నారని.. అయితే వారి నుంచి హెరిటేజ్ పేరిట దోచుకుంటున్న చంద్రబాబు కుటుంబ సభ్యులు కోటీశ్వరులెలా అయ్యారో చెప్పాలి? కేసులు పెడితే స్టేలు తెచ్చుకుని జారుకునే వారికి మరొకరి గురించి మాట్లాడే అర్హత లేదు. నా ఆస్తులపై, నీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరుదాం. నేను రెడీ.. నువ్వు రెడీనా?... లోకేశ్ పక్కనే ఇసుక, ఎర్రచందనం దొంగలు ఉన్నారు. దమ్మూ ధైర్యం ఉంటే టీడీపీ మేనిఫెస్టో తీసుకురండి. మా మేనిఫెస్టో తెస్తా... ఎవరెన్ని హామీలు నెరవేర్చారో బహిరంగంగా తేల్చుకుందాం. జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని వస్తే పారిపోయిన వ్యక్తి లోకేశ్. ఆయన ఇప్పుడు సీఎం జగనన్నకు భయం చూపిస్తానని చెబుతుంటే అందరూ నవ్వుకుంటున్నారు. ముఖ్యమంత్రిని సంస్కారహీనంగా తిడితే జనం తిరగబడతారు. తగిన శాస్తి జరుగుతుంది. లోకేశ్ పాదయాత్రలో తొలి అడుగు పడినప్పటి నుంచే టీడీపీ పతనం ఖాయమైంది. ఆడవాళ్లను చులకనగా మాట్లాడడం తండ్రి నుంచి లోకేశ్‌కు అబ్బింది.' అని మంత్రి రోజా చెప్పారు.

నాది పాదయాత్ర కాదు దండయాత్ర

కీళపూడి బహిరంగ సభలో నారా లోకేశ్



పిచ్చాటూరు: తనది పాదయాత్ర కాదని, దండయాత్ర అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన మంగళవారం నారాయణవనం మండలం విత్తలతడుకు గ్రామం నుంచి పిచ్చాటూరు మండలంలోని కీలపూడి వరకు పాదయాత్ర చేశారు. సాయంత్రం కీళపూడి వద్ద బహిరంగ సభలో మాట్లాడారు. తాను పాదయాత్ర చేస్తుంటే పోలీసుల ద్వారా జగన్ రెడ్డి తన మైక్, స్టూల్ లాక్కొని అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు పెరిగిపోయిందన్నారు. చిత్తూరు జిల్లా సైకో వీరప్పన్ పెద్దిరెడ్డి అని విమర్శించారు. నాగలాపురం అరుణానదిలో ఇసుకను వీరప్పన్ పెద్దిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి రోజుకు 100 టిప్పర్లు తమిళనాడుకు తరలిస్తున్నారని ఆరోపించారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి సత్యవేడు, వరదయ్యపాళెంలో మట్టి, గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారన్నారు. కీళపూడి సభకు జనం నుంచి స్పందన కరువైంది.

నా సభకు వచ్చిన సైకోలు

మాటల తడబాటుతో లోకేశ్ అందరినీ నవ్విస్తున్నారు. మంగళవారం సభలో ఎన్నికల ముందు అనబోయి 'ఎన్నికల మందల' అని, వడ్డీ అనే పదాన్ని 'ఒడ్డు' అంటూ ఉచ్చరించారు. ప్రసంగం మధ్యలో ఇక్కడ ఉన్న సైకోలు అనడంతో అందరూ నివ్వెరపోయారు. వెంటనే తేరుకొని ఇక్కడ ఉన్న వైకాపా సైకోలు అని అన్నారు.

'ఈనాడు' వ్యాజ్యాలు కొట్టివేత

ప్రభుత్వ జీవోల అమలు నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

'ఏబీసీ' ఆడిట్‌ను నిరోధించాలన్న అభ్యర్థన కూడా తిరస్కృతి

సాక్షి, అమరావతి: విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏదైనా ఓ దినపత్రికను కొనుగోలు చేసుకునేందుకు సచివాలయాలు, వలంటీర్లకు నెలకు రూ.200 ఆర్థిక సాయాన్ని అందచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలును నిలిపివేయాలంటూ 'ఈనాడు' పత్రిక చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. వలంటీర్లు, సచివాలయాలు 'సాక్షి' దినపత్రికను కొంటే... ఆ కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోవద్దంటూ ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ (ఏబీసీ)ను ఆదేశించాలన్న అభ్యర్థనను సైతం తోసిపుచ్చింది. ఈ మేరకు ఈనాడు దాఖలు చేసిన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసింది. సర్క్యులేషన్ దారుణంగా పడిపోవటంతో.. ఏబీసీ ఆడిట్‌లో తన అసలు సర్క్యులేషన్ బండారం బయటపడుతుందని, ఇన్నాళ్లూ తాను రకరకాలుగా కాపాడుకుంటూ వస్తున్న నంబర్–1 స్థానం పోతుందనే భయంతో 'ఈనాడు' పత్రిక ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... నిర్దిష్టంగా ఫలానా పత్రికను మాత్రమే కొనుగోలు చేయాలంటూ వలంటీర్లను గానీ, సచివాలయాలను గానీ ప్రభుత్వం ఆదేశిస్తున్నట్లుగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని స్పష్టం చేసింది. రూ.200 ఆర్థిక సాయాన్ని వలంటీర్లకు, సచివాలయాలకు 'సాక్షి' దినపత్రికను మాత్రమే కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ఇస్తున్నారా? లేదా? అన్న విషయాన్ని లోతైన విచారణ జరిపి తేలుస్తామని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా 'ఈనాడు' చేస్తున్న ఆరోపణల ఆధారంగా... 'సాక్షి' కొనుగోళ్లను పెంచుకునేందుకే ప్రభుత్వం రూ.200 ఆర్థిక సాయం చేస్తోందన్న ప్రాథమిక నిర్ణయానికి ఈ దశలో రాలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రస్తావించిన కీలకాంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది సాక్షి – ఈనాడు మధ్య వ్యాపార సంబంధిత వివాదమని ధర్మాసనం అభిప్రాయపడింది. సాధారణంగా ఇద్దరి మధ్య జరిగే ఇలాంటి వ్యాపార యుద్ధాల్లో న్యాయస్థానాలు మధ్యంతర ఉత్తర్వుల దశలో అరుదుగా మాత్రమే జోక్యం చేసుకుంటాయని వ్యాఖ్యానించింది.

జీవోలు రాజ్యాంగ విరుద్ధమంటూ పిటిషన్

ఏదైనా పత్రిక కొనుగోలు నిమిత్తం గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయాలకు నెలకు రూ.200 ఆర్థిక సాయంతో పాటు బడ్జెట్ కేటాయింపుల జీవోలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి రద్దు చేయాలంటూ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈనాడు) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వలంటీర్లు, సచివాలయాల ద్వారా జరిగే సాక్షి దినపత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ (ఏబీసీ)ను ఆదేశించడంతో పాటు నిర్దిష్ట కాలాల్లో సాక్షి పత్రికకు ఇచ్చిన సర్క్యులేషన్ సర్టిఫికేషన్‌ను పునఃసమీక్షించేలా ఆదేశించాలంటూ ఉషోదయ డైరెక్టర్ ఐ.వెంకట్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయడం తెలిసిందే. ప్రభుత్వ జీవోల అమలును నిలిపివేయడంతో పాటు 2022 జూలై–డిసెంబర్, ఆ తరువాత కాలానికి సాక్షి సర్క్యులేషన్‌ను ఆడిట్ చేయకుండా ఏబీసీని నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ రెండు అనుబంధ వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సీజే ధర్మాసనం మొదట ఈ అనుబంధ వ్యాజ్యాలపై విచారణ జరిపింది. అటు ఈనాడు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వాదనలు విన్నది. మంగళవారం ఈ అనుబంధ వ్యాజ్యాల్లో ఉత్తర్వులు వెలువరించింది.

శాసనసభ స్వతంత్ర వ్యవస్థ

'ఈనాడుపై నిషేధం విధిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం విషయానికొస్తే శాసనసభ అన్నది స్వతంత్ర వ్యవస్థ. దాని చర్యలను ఈనాడు తన పిటిషన్‌లో సవాలు చేయలేదు. ఇక సాక్షి సర్క్యులేషన్ లెక్కల విషయానికొస్తే ఏబీసీ మాత్రమే సర్క్యులేషన్ గణాంకాలను విడుదల చేస్తుంది. వీటిని విశ్వసిస్తూ ఈనాడు తన వ్యాజ్యంలో ప్రస్తావించింది కాబట్టి ఏబీసీ గణాంకాలను తారుమారు చేయవచ్చని ఈ దశలో భావించలేం. ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ఓ పత్రిక లేదా ఇతర పత్రికల కొనుగోళ్లు పెరిగితే ఆ వివరాలను తాజాగా సర్క్యులేషన్ గణాంకాలను విడుదల చేసేందుకు ఏబీసీ ఉపయోగించుకుంటుంది. ప్రభుత్వం విడుదల చేసే నిధుల వల్ల వలంటీర్లు, సచివాలయాలు నిర్దిష్టంగా ఓ పత్రికను కొనుగోలు చేసినంత మాత్రాన సర్క్యులేషన్ గణాంకాలను విడుదల చేయకుండా ఏబీసీని ఏ రకంగానూ నిరోధించలేం. రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టంగా ఓ పత్రికను మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించిందని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను చూపలేదు' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనాడు దాఖలు చేసిన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఉత్తర్వుల్లో తాము వ్యక్తం చేసినవి కేవలం అనుబంధ వ్యాజ్యాలకు మాత్రమే పరిమితమని, ప్రధాన వ్యాజ్యాన్ని పరిష్కరించే విషయంలో ఇవి ఎలాంటి ప్రభావాన్ని చూపబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

పుల్లరిన్.. దశ తిరిగేన్

వెలికితీతకు కసరత్తు ముమ్మరం



మంగంపేట బెరైటీస్ గనులు

పలు అంతర్జాతీయ సంస్థలతో ఏపీఎండీసీ ఒప్పందం

- అన్నమయ్య జిల్లా మంగంపేటలో అత్యంత అరుదైన ఖనిజం
- ఉక్కు కంటే దృఢం.. బంగారం కంటే విలువైనది
- ప్రపంచ వ్యాప్తంగా దీనిపై ఎన్నో పరిశోధనలు
- అంతరిక్ష ప్రయోగాల్లో, నానో టెక్నాలజీలో ఇది అత్యంత కీలకం
- సైన్స్‌కు అందని ఎన్నో వ్యాధులు దీంతో మటుమాయం!

(నాగా వెంకటరెడ్డి– సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

వైఎస్సార్ జిల్లా మంగంపేటలో దాదాపు మూడు దశాబ్దాలకు సరిపోయేలా ఉన్న బెరైటీస్ నిల్వల్లో దాగి ఉన్న 'పుల్లరిన్' అనే అత్యంత అరుదైన, విలువైన ఖనిజాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇక్కడ పుల్లరిన్ ఖనిజం ఉన్నట్లు దాదాపు 20 ఏళ్ల కిందట తెలిసింది. అయితే దీన్ని వెలికితీసే పనిని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడంతో ఏపీఎండీసీ వెలికితీతకు ఉపక్రమించింది. ఇందుకోసం కేంద్రానికి చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. మంగంపేటలో పుల్లరిన్ ఉన్నట్లు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం మైన్స్ అండ్ జియాలజీ విభాగం ప్రొఫెసర్లు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీన్ని వెలికితీయడం కష్టంతో కూడుకున్న పనిగా వారు అభిప్రాయపడ్డారు. వెయ్యి కిలోల బెరైటీస్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేస్తే ఒక కిలో పుల్లరిన్‌ను వెలికి తీసే అవకాశముందని వెల్లడించారు. ఉస్మానియా వర్సిటీలో పని చేసిన అధ్యాపకులు శ్రీధర్‌మూర్తి దీనిపై లోతైన అధ్యయనం కొనసాగించారు. 1,050 నమూనాలను సేకరించి అమెరికాలోని వివిధ ప్రయోగశాలల్లో పరీక్షించడం ద్వారా నిక్షేపాల తీరుతెన్నులను గుర్తించారు. దీనిపై జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా కూడా సర్వే చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది.

ఉక్కు కంటే 250 రెట్లు దృఢం

ఉక్కు కంటే 250 రెట్లు దృఢమైనది.. బంగారం కంటే 150 రెట్లు విలువైనది.. వజ్రం, ప్లాటినం కన్నా మెరుగైనది.. 'పుల్లరిన్'. ప్రపంచంలోనే అత్యంత అరుదైన, విలువైన ఖనిజం పుల్లరిన్. అన్నమయ్య జిల్లా మంగంపేట గనుల్లో బయటపడింది. అంతరిక్ష ప్రయోగాల్లో, నానో టెక్నాలజీలో ఇది అత్యంత కీలకమని, సైన్స్‌కు లొంగని అరుదైన రోగాలకూ పరిష్కారం చూపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పుల్లరిన్‌పై జరుగుతున్న పరిశోధనలతో అంతరిక్షం, రక్షణ, సోలార్ వ్యవస్థలతో పాటు విభిన్న రంగాల్లో పెనుమార్పులు వస్తాయని నిపుణులు భావిస్తున్నారు. పుల్లరిన్‌ను కనుగొన్న అమెరికా, బ్రిటన్‌లకు చెందిన పరిశోధకులు రాబర్ట్ కర్ల్, హారోల్డ్ క్రోటో, రిచర్డ్ స్మాల్లే లకు 1996లో నోబెల్ ప్రైజ్ దక్కింది. రష్యాకు చెందిన జార్జి చక్రవర్తులు తమ ఆరోగ్య పరిరక్షణకు పుల్లరిన్ కలిగిన బ్లాక్ షెల్ ముక్కను రాత్రి వేళ నీటిలో వేసుకుని ఉదయాన్నే తాగేవారని చరిత్రకారులు చెబుతున్నారు.

సన్నటి తీగతో కారునే వేలాడదీయొచ్చు..

పుల్లరిన్ కార్బన్ సమ్మిళిత పదార్థం. ఫుట్‌బాల్‌ను పోలిన గోళ, స్తూపాకారంలో ఉంటుంది. ఇందులో బక్‌మినిస్టర్, బకీబాల్స్, నానో ట్యూబ్స్, మెగా ట్యూబ్స్ తదితర రకాలున్నాయి. ఒక్కో నానో ట్యూబ్.. ఒకటి నుంచి ఏడు నానో మీటర్ల మందంలో కంటికి కనిపించనంత సన్నగా ఉంటుంది. ఒక నానో మీటరు అంటే ఒక వెంట్రుకలో 70 వేల వంతుకు సమానం. ఆ సన్నటి తీగ ఉక్కు రాడ్‌తో సమానం. అంతటి సన్నటి తీగతో మారుతి కారును సైతం వేలాడదీయొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీని ప్రయోజనాలు అంచనాలకు అందనంతగా ఉన్నాయి. భావితరాలను శాసించే నానో టెక్నాలజీలో పుల్లరిన్ అత్యంత కీలకమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'రక్షణ వ్యవస్థ, ఫార్మా, సోలార్ ఎనర్జీ తదితర రంగాల్లో దీని వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విమానాలు, స్పేస్ షటిల్స్ రక్షణకు దీన్ని పూతగా వినియోగిస్తారు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల తయారీలోనూ ఉపయోగిస్తారు. సోలార్ పవర్ టెక్నాలజీ, ఇంధన వాహకాల తయారీ తదితరాలకు కూడా దీన్ని వినియోగిస్తున్నారు. బయో మెడిసిన్స్, కండక్టర్స్, సోలార్ సెల్స్, ఎలక్ట్రానిక్ బ్యాటరీలు, సింథటిక్ డైమండ్స్‌కు ఇది ఉపకరిస్తుంది' అని వివరించారు.


ప్రయోజనాలు ఎన్నెన్నో..

పుల్లరిన్‌తో ఫార్మా రంగంలో లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. ఎయిడ్స్, క్యాన్సర్, పార్కిన్‌సన్, లుకేమియా, న్యూరోలాజికల్ రోగాల నుంచి ఉపశమనానికి, అల్ట్రా రేడియేషన్ వల్ల దెబ్బతిన్న చర్మ కణజాలం రక్షణకు ఇది ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మంగంపేట బెరైటీస్ గనుల చుట్టుపక్కల ఉన్న షంగైట్ స్టోన్స్ నుంచి 'రష్యన్ షంగైట్ వాటర్' తరహాలో నీళ్లను మార్చవచ్చని అనుభవజ్ఞులు చెపుతున్నారు. అత్యంత ప్రమాదకర రోగాల నుంచి బయటపడటానికి, అనారోగ్యం దరిచేరకుండా ఉండటానికి పుల్లరిన్ నీటిని తీసుకుంటే చాలంటున్నారు హైదరాబాద్‌లోని వక్కంటి కోటేశ్వరరావు. మూడు వేల మందికి పైగా తాను అందజేసిన నీటిని తాగి రోగాల నుంచి ఉపశమనం పొందారని వెల్లడించారు.



తవ్వి తీసిన ఖనిజం

భారీగా ఖనిజ ఆదాయం



ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఖనిజం పుల్లరిన్. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాల మేరకు దానిని వెలికి తీసేందుకు మెరుగైన విధానాల కోసం ప్రఖ్యాత సంస్థలతో ఏపీఎండీసీ ఎంవోయూ చేసుకుంది. నానో టెక్నాలజీ, రక్షణ వ్యవస్థ, ఫార్మా, సోలార్ ఎనర్జీ తదితర అనేక రంగాలకు ఉపయుక్తమైన పుల్లరిన్ అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక గ్రాము 112 డాలర్ల ధర పలుకుతోంది. దీని ప్రకారం కిలో రూ.91 లక్షల పైచిలుకే. పుల్లరిన్ ద్వారా ఖనిజాభివృద్ధి సంస్థకు తద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుంది.

– విజి వెంకటరెడ్డి, వీసీ, ఎండీ, ఏపీఎండీసీ

లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ (పీసీపీఎన్‌డీటీ), సరోగసీ చట్టాల అమలు విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. మంగళగిరిలోని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పీసీపీఎన్‌డీటీ, సరోగసీ, ఏఆర్టీ చట్టాల అమలు రాష్ట్ర స్థాయి బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా లింగనిర్ధారణ పరీక్షలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి కృషి చేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం అని తెలిపేలా అన్ని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో వాల్‌పోస్టర్లు, బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐవీఎఫ్, సరోగసి లాంటి ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్న ఆస్పత్రుల విషయంలో అధికారులు నిఘా పెట్టాలన్నారు. అనుమతులు లేకుండా సరోగసి లాంటి చికిత్సలు అందిస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్న ఆస్పత్రుల వివరాలను సేకరించాలని చెప్పారు. అవసరమైతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న గైనకాలజిస్టుల సాయం తీసుకోవాలన్నారు. పీసీపీఎన్‌డీటీ, సరోగసీ, ఏఆర్టీ చట్టాల అమలు రాష్ట్ర స్థాయి బోర్డు సభ్యులు, పాడేరు, తాడికొండ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఉండవల్లి శ్రీదేవి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి తదితరులు పలు సూచనలు చేశారు. వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఏపీ వీవీపీ కమిషనర్, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

తెలంగాణలో 'హంగ్' రాజకీయం!

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సరికొత్త చర్చకు తెరలేపారు. ఎన్నికల్లో 'హంగ్' వస్తుందని.. ఫలితాల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ కలుస్తాయని ఢిల్లీ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. బీజేపీ ఈ కామెంట్లను రాజకీయ అస్త్రంగా వాడుకుని విమర్శలకు దిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒక్కటేనని, పోరాడుతున్నట్టుగా నాటకాలు ఆడుతున్నాయని తాము ముందు నుంచే చెప్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు కోమటిరెడ్డి వ్యాఖ్యలను ఖండించారు.

జాగ్రత్తగా చేయని ఆలోచనల కంటే మీకు మరేదీ ఎక్కువ హాని కలిగించలేదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 15

నెడుమారన్ దుమారం

శ్రీలంకలో స్వతంత్ర తమిళ రాజ్యస్థాపన లక్ష్యంగా పోరాడి మరణించిన లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం(ఎల్టీటీఈ) చీఫ్ ప్రభాకరన్ చాన్నాళ్ల తర్వాత వార్తల్లోకెక్కారు. ఆయన బతికేవున్నాడని, త్వరలో జనం ముందుకొస్తాడని తమిళ జాతీయోద్యమ నేత నెడుమారన్ సోమవారం చేసిన ప్రకటన సహజంగానే సంచలనంగా మారింది. ఆయన ప్రకటనలోని నిజానిజాల గురించి కన్నా, ఆ ప్రకటన చేయటం వెనకున్న ఉద్దేశాలపైనే తమిళనాడులో ప్రధానంగా చర్చ జరుగుతోంది. శ్రీలంక తమిళుల కడగండ్లపై ఇప్పటికీ తమిళనాట సానుభూతి ఉంది. అక్కడ తమిళులకు ఏం జరిగినా తమిళనాడులో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతాయి. శ్రీలంకలో ఎల్టీటీఈని నామరూపాల్లేకుండా చేసి పద్నాలుగేళ్లవుతోంది. అంతర్యుద్ధం ముగిశాక తమిళుల అభ్యున్నతికి అన్ని చర్యలూ తీసుకుంటామని, తమిళులు అధికంగా ఉండే ఉత్తర, తూర్పు ప్రావిన్సులకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తామని అప్పట్లో చేసిన వాగ్దానాలను లంక సర్కారు ఈనాటికీ నెరవేర్చలేదు. తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినా లంక సైన్యం విరుచుకుపడుతోంది. ఈ పరిస్థితుల్లో నెడుమారన్ చేసిన ప్రకటన అక్కడి సాధారణ తమిళులకు ఎంతో కొంత ఊరటనిస్తుంది. సౌకర్యవంతమైన జీవితాలను వదులుకుని తమ కోసం, తమ విముక్తి కోసం పోరాడటానికి అంకితమై ఆ క్రమంలో ప్రాణాలు కోల్పోయినవారిని వీరులుగా ఆరాధించటం, వారి జ్ఞాపకాలను పదిలపరుచుకోవటం, స్మరించుకోవటం అన్నిచోట్లా కనబడుతుంది. పాలక వ్యవస్థకు తిరుగుబాటు నేతలపై ఎలాంటి అభిప్రాయాలున్నా సాధారణ ప్రజానీకం దృష్టిలో వారు ఎప్పటికీ వీరులే. అలాగే దీనికి సమాంతరంగా వారి మరణాన్ని విశ్వసించని ధోరణి కూడా కనబడుతుంది. తిరుగుబాటుదార్లపై ఉండే గాఢమైన ప్రేమాభిమానాలే ఇందుకు కారణం కావొచ్చు. చరిత్రలోకి తరచి చూస్తే ఇలాంటి ఉదాహరణలెన్నో కనబడతాయి. ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 1945 ఆగస్టు 18న ఫార్మోజా(ఇప్పటి తైవాన్)లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్టు చెప్పినా అందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు దొరకలేదు. అందుకే కావొచ్చు... ఆయన పేరు మార్చుకుని అజ్ఞాతవాసం గడుపుతున్నారంటూ చాన్నాళ్లు వదంతులు ప్రచారంలో ఉండేవి.

శ్రీలంక తమిళుల్లో ప్రభాకరన్‌పై ఇప్పటికీ ఆరాధనాభావం బలంగా ఉందన్నది కాదనలేని సత్యం. ఇప్పటికీ లంక తమిళులను ద్వితీయ శ్రేణి పౌరులుగానే పరిగణిస్తున్న అక్కడి ప్రభుత్వ విధానాలు ఇందుకు దోహదపడుతున్నాయి. ఎల్టీటీఈ దూకుడు, దాని సిద్ధాంతాలూ, విధానాలనూ ఇతర సంస్థలు తీవ్రంగా విమర్శించేవి. అవి అంతిమంగా తమిళ జాతికి కీడు కలిగిస్తాయన్నది వారి ప్రధాన విమర్శ. తమిళ ఈలం కోసమే పోరాడే ఇతర సంస్థల నేతల్ని ఎల్టీటీఈ మట్టుబెట్టిన తీరు అత్యంత దారుణమైనది. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని, 1993లో అప్పటి శ్రీలంక అధ్యక్షుడు ప్రేమదాసనూ, అనేకమంది ఇతర నేతలనూ, సైనికాధికారులనూ మానవబాంబులతో దాడిచేసి హతమార్చిన చరిత్ర ఎల్టీటీఈది. ఉత్తర శ్రీలంకలోని ముల్లైతీవు ప్రాంతంలోని ఒక రహస్య స్థావరంలో తలదాచుకున్న ప్రభాకరన్‌నూ, ఆయన అనుచరులనూ సుదీర్ఘంగా సాగిన పోరాటంలో అంతమొందించామని 2009 మే 18న లంక సైన్యం ప్రకటించింది. అదే నెల 24న ఎల్టీటీఈ అంతర్జాతీయ వ్యవహారాల చీఫ్ సెల్వరాస పద్మనాథన్ కూడా దీన్ని ధ్రువీకరించారు. నిజానికి ప్రభాకరన్ సజీవంగా ఉన్నారంటూ నెడుమారన్ ప్రకటించటం ఇది మొదటిసారేమీ కాదు. 2018లో ఆయన ఈ తరహా ప్రకటనే చేశారు. సైనిక వలయాన్ని ఛేదించి ఆయన తప్పించుకున్నట్టు తన దగ్గర విశ్వసనీయ సమాచారం ఉన్నదని నెడుమారన్ అప్పట్లో చెప్పారు. మళ్లీ అయిదేళ్ల తర్వాత ఎలాంటి ఆధారాలూ చూపకుండా మరోసారి ఆమాటే చెప్పటం సందేహాలకు తావిస్తోంది. తమిళనాడులో కాంగ్రెస్ హవా నడుస్తున్నప్పుడు కామరాజ్ అనుచరుడిగా ఓ వెలుగు వెలిగిన నెడుమారన్ ఆ తర్వాత రాజకీయాలకు దూరమై శ్రీలంక తమిళుల హక్కుల కోసం పోరాడే నేతగా గుర్తింపు పొందారు. కన్నడ నటుడు రాజ్‌కుమార్‌ను వీరప్పన్ అపహరించినప్పుడు ఆయన విడుదలకు సంప్రదింపులు జరిపిన కీలక వ్యక్తుల్లో నెడుమారన్ ఒకరు. వర్తమాన తమిళ రాజకీయాల్లో శ్రీలంక తమిళుల అవస్థలు ప్రస్తావనకు రాకపోవటం, కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాజకీయ పక్షాలు నిర్లిప్తంగా ఉండటం జీర్ణించుకోలేకే నెడుమారన్ ఈ సంచలన ప్రకటన చేశారన్న అభిప్రాయం చాలామందిలో ఉంది.

ఒకప్పుడు ఎల్టీటీఈ బూచి చూపి సింహళ జాతిని ఏకం చేసిన రాజపక్సే సోదరులు నిరుడు ఉవ్వెత్తున ఎగిసిన ప్రజోద్యమంలో అధికారాన్ని కోల్పోయినప్పటి నుంచీ మళ్లీ సింహళీయుల్లో మద్దతు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభాకరన్ గురించిన వదంతిని ప్రచారంలో పెడితే భయభ్రాంతులైన జనం మళ్లీ తమవైపు చూస్తారన్నదే వారి ఆశ అంటున్నారు. అందులో నెడుమారన్ అమాయకంగా చిక్కుకున్నారా, లేక రాష్ట్ర రాజకీయాల్లో తనకు ప్రాసంగిత పెరగటానికి తోడ్పడుతుందన్న భావనతో ఉద్దేశపూర్వకంగా ఈ మాటన్నారా అన్న సందేహమూ ఉంది. ఏదేమైనా లంక యుద్ధ నేరాలపై విచారణ జరిపి నేరగాళ్లను శిక్షించటం, దుర్భర జీవితం గడుపుతున్న తమిళుల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం తక్షణావసరమని శ్రీలంక ప్రభుత్వం గుర్తించాలి. ఆ విషయంలో మన దేశంతో సహా ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి తీసుకురావాలి. నెడుమారన్ ప్రకటన ఇందుకు దోహదపడితే మంచిదే.

ఈ అధ్యక్షుడు ఓ వైరుధ్యాల పుట్ట

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల మరణించిన పాక్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌లోని వైరుధ్యాలను తేల్చడానికి చరిత్రకారులు గింజుకోవచ్చు. రెండుసార్లు పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన ఈ సైనిక నియంత అదే సమయంలో పత్రికా స్వేచ్ఛను అనుమతించారు. మితవాద ముస్లిం అయిన ముషారఫ్, లష్కర్–ఎ–తోయిబాకు అతిపెద్ద మద్దతుదారునని చెప్పేవారు. కార్గిల్ యుద్ధ నిర్మాత అయిన సైనిక అధినేతగా ఉంటూనే, కశ్మీర్ సమస్యకు పరిష్కారం విషయంలో పాక్ చరిత్రలో ఎన్నడూ లేనంత చేరువకు రాగలిగారు. ఇవి నిజంగానే చికాకు పెట్టే వైరుధ్యాలే మరి.

జనరల్ పర్వేజ్ ముషారఫ్ ఒక వైరుధ్యాల పుట్ట. ఈ వైరుధ్యాల్లో కొన్ని సంతోషకరమైనవి. కొన్ని ఇబ్బందికరమైనవి. కానీ ఆయన మాత్రం వాటికి మించిన వ్యక్తిత్వంతో ఉండేవారు. ఆయన దుస్తులు ఎంత నీటుగా ఉండేవంటే అందరినీ అవి ఆకర్షించేవి. అలాగే ఆయన పదాలతో ఆడుకునేవారు. 2002 అధ్యక్ష 'ఎన్నికల్లో' ఆయన 98 శాతం ఆధిక్యత సాధించినప్పుడు 'బిజినెస్ స్టాండర్డ్' పత్రిక అభినందించింది. దానికి ఆయన చెప్పిన సమాధానం ఆ పత్రిక రిపోర్టర్‌ను నివ్వెరపర్చింది. ''మీరు వ్యంగ్యంగా చెప్పినట్లయితే, నేను మాట్లాడేది ఏమీ ఉండదు. మీరు నిజాయితీగా ఉన్నట్లయితే, మీకు థాంక్స్ చెబుతాను.''

పాకిస్తాన్ ఆర్మీ జనరల్‌గా, ఆ తర్వాత పాక్ అధ్యక్షుడిగా వ్యవహరించిన ముషారఫ్ లోని వైరుధ్యాలను తేల్చిచెప్పడానికి చరిత్రకారులు గింజుకోవచ్చు. రెండుసార్లు పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన ఈ సైనిక నియంత అదే సమయంలో పత్రికా స్వేచ్ఛను అనుమతించారు. అలాగే ఇబ్బందికరమైన ఇంటర్వ్యూలను కూడా అంగీకరించడానికి సిద్ధంగా ఉండేవారు. ఒక గ్లాసెడు విస్కీతో ఖుషీ చేసుకుంటారని పేరొందిన ఈ మితవాద ముస్లిం తాను మిలిటెంట్ సంస్థ అయిన 'లష్కర్–ఎ–తోయిబా'కు అతిపెద్ద మద్దతుదారును అని చెప్పేవారు. కార్గిల్ యుద్ధ నిర్మాత అయిన సైనిక అధిపతిగా ఉంటూనే, కశ్మీర్ సమస్యకు పరిష్కారం కోసం పాక్ చరిత్రలో ఎన్నడూ లేనంత సామీప్యతకు ఆయన చేరుకున్నారు. ఈ దురాక్రమణదారు చేసిన రక్తపాత రహిత తిరుగుబాటును జనం ఆమోదించి స్వాగతించారు. కానీ అదే జనం దృష్టిలో హేయమైన అధ్యక్షుడిగా మారిపోయి, అభిశంసనను తప్పించడానికి ఆయనతో బలవంతంగా రాజీనామా చేయించాల్సి వచ్చింది. ఇవి నిజంగానే చికాకు పెట్టే వైరుధ్యాలే మరి.

మరో రెండు ఆహ్లాదకరమైన విషయాలను పంచుకోనివ్వండి.

నేను జనరల్ ముషారఫ్‌ను 2000 సంవత్సరం ఫిబ్రవరిలో మొదటిసారి కలిశాను. ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానం హైజాక్ అయిన కొంతకాలం తర్వాత మా సమావేశం జరిగింది. అది ఒక భారతీయ జర్నలిస్టుకు ఆయన ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ. పైగా దాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేస్తారు కనుక నేను ప్రత్యేకించి దూకుడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను.



నేను పాకిస్తాన్ జనరల్‌ను నియంత అని పిలిచాను. తన నిజాయితీ, విశ్వసనీయత పూర్తిగా అనుమానించదగినవని ఆయనతో చెప్పాను. ఆయన మామూలుగా నవ్వేశారు. అయితే ఆయన ఏ మాత్రం కలవరపడే వ్యక్తి కాదని గుర్తించడానికి నాకు ఎంతో సమయం పట్టలేదు. వాణిజ్య ప్రకటనలకు విరామం ఏర్పడిన సమయంలో, మా బంధం కొనసాగడానికి వీలుగా ఆయనతో చిన్న సంభాషణ చేయాల్సిన అవసరముందని భావించాను. దానికోసం ఆయన ధరించిన 'టై' గురించి ప్రశంసించాను. తర్వాత ఇంటర్వ్యూ తిరిగి ప్రారంభమైంది.

అర్ధగంట తర్వాత ఇంటర్వ్యూ ముగిశాక, ఆ ఇంటర్వ్యూకు సహకరించిన సిబ్బందికి జనరల్ టీ, స్నాక్స్ ఆతిథ్యం ఇచ్చారు. కెమెరామన్‌కు ఆయన సిగరెట్ ఆఫర్ చేశారు. సౌండ్ రికార్డిస్టు భుజంపై తన చేయి వేశారు. అలాగే ఎలక్ట్రీషియన్ జోక్‌కు ఫకాలున నవ్వారు. నిమిషాల్లోనే ఆయన వాతావరణాన్ని స్నేహపూర్వకంగా మార్చేశారు. ఆ కాసేపట్లోనే నాతోటి సహచరులు ఆయన పట్ల ఆత్మీయతను పెంచుకుంటున్నట్లు గ్రహించాను.

మేము వీడ్కోలు చెబుతుండగా, జనరల్ ముషారఫ్ తన టైని విప్పి, నాకు అందించారు. ''దీన్ని మీరు ధరించాలని కోరుకుంటున్నాను. దయచేసి దీన్ని మీకు ఇవ్వనివ్వండి'' అన్నారు.

''సర్, సర్, సర్'', నేను నత్తులు పలికాను. ''నేను చేసింది ఒక అమాయకపు వ్యాఖ్య. అంతకుమించి నేను మరేమీ సూచించలేదు'' అన్నాను. ''నాకు తెలుసు'', అంటూ ఆయన సమాధానమిచ్చారు. ''ఇది మీ పట్ల నా సఖ్యతకు సంకేతం మాత్రమే'' అన్నారు.

''మీకు కృతజ్ఞతలు'' అని నేను కదిలిపోయాను. తర్వాత, టైకి ఉన్న బంగారు పిన్నును, ఆయన చొక్కాకు వేలాడుతున్న బంగారు గొలుసును చూస్తూ నవ్వుతూ చెప్పాను. ''నేను గోల్డ్ చెయిన్ గురించి ప్రశంసించి ఉండాల్సింది. అప్పుడు బహుశా దాన్ని కూడా మీరు నాకు ఇచ్చి ఉండేవారు.''

అప్పుడు జనరల్ గట్టిగా నవ్వారు. ''హా. ఔర్ అగర్ ఆప్ కో జూతీ పసంద్ ఆయీ హోతీ తో వో భీ మిల్ జాతీ (అవును. ఒకవేళ మీకు బూట్లు ఇష్టమైతే అవి కూడా దొరికేవి)'' అంటూ హాస్యమాడారు.

తదుపరి సంవత్సరాల్లో నేను జనరల్‌ను చాలాసార్లు ఇంటర్వ్యూ చేశాను. ఇస్లామాబాద్‌లోనే కాదు, లండన్, దుబాయిల్లో కూడా ఇంటర్వ్యూ చేశాను. వీటిల్లో 2009లో చేసిన ఇంటర్వ్యూ నాకు బాగా గుర్తుంది. పదవీ విరమణ చేశాక, తన అధ్యక్షత గురించి, ప్రత్యేకించి కశ్మీర్‌పై తెర వెనుక జరిగిన చర్చల గురించి, జనరల్ నిజాయితీగా మాట్లాడడానికి ఇష్టపడతారా అని నేను ప్రశ్న రాసి పంపించాను. ''డియర్ కరణ్'' అంటూ ఆయన నాకు ఈమెయిల్లో సమాధానమిచ్చారు. ''ఇప్పుడు నేను ఇంటర్నెట్ వాడకం నేర్చుకుంటున్నాను. నా సాంకేతిక పరాక్రమపు మొదటి లబ్ధిదారు మీరే.''

అది నిజమే అని నేను కచ్చితంగా చెప్పలేను. అది అడగడానికి సమయం దొరకలేదు. కానీ జవాబివ్వడంలో అదొక మంచి ముఖస్తుతి విధానం. ఆ ఈమెయిల్ జవాబును నేను ఫ్రేము కట్టించాను. అది ఇప్పుడు నా స్టడీ రూములో వేలాడుతోంది.

తర్వాత కొన్ని వారాలకు లండన్‌లో ఆయనతో మరో ఇంటర్వ్యూకు అవకాశం ఏర్పడింది. అప్పుడు పాక్ జనరల్ ఓపెన్ నెక్ షర్టుతో పౌడర్ బ్లూ జాకెట్ ధరించి ఉన్నారు. రివీయెరా హోటల్లో సెలవులు గడపడానికి వచ్చిన హాలీవుడ్ నటుడిలా కనిపించారు. సూటు, టైతో కావాలనే అతిగా డ్రెస్ చేసుకున్నట్టు నాకు అనిపించింది.

''మీరు బో టైని ఎందుకు కట్టుకోలేదు?'' అని ఆయన అడిగారు. ''టై ఎలా కట్టుకోవాలో నాకు మీరు నేర్పుతారని అనుకున్నాను.''

అధికారం కోల్పోయి, చట్టం ముందు పలాయితుడుగా ఉన్నప్పుడు కూడా జనరల్ తన హాస్య ప్రవృత్తిని కోల్పోలేదు.

ఆయన చనిపోయిన వార్త రాగానే ఎక్కువగా ఆయన రాజకీయాలపై దృష్టి పడింది. అందుకే ఆయన వ్యక్తిత్వంలో ఇబ్బందికరమైన వైరుధ్యాలు కనిపించాయి. అవి నిజం కూడా. అదే సమయంలో ఆయనలోని ఆహ్లాదకరమైన విషయాలను కూడా మర్చిపోకూడదు. అవి కూడా సత్యంలో భాగమే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

విశ్వ భాష



ఆకాశం కింద, అత్యంత అందమైన భాష ప్రేమ. ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు.
– వీంగాస్, పాకిస్తాన్ యాక్టివిస్ట్

తొలి పరిచయం



'కన్నత్తిల్ ముత్తమిట్టాల్' (బుగ్గ మీద చిన్నముద్దు; తెలుగులో 'అమృత') సినిమా విడుదలై 21 ఏళ్లయింది. నేపథ్య గాయనిగా 21 ఏళ్లయింది.
– చిన్మయి శ్రీపాద, గాయని

మరిన్ని నడపాలి



ఢిల్లీ చాలా దూరం! ఆరు నెలలుగా రోడ్లన్నీ బంద్ కావడంతో, ఢిల్లీ–లేహ్ (లదాఖ్) విమాన చార్జీలు వారం నుంచీ రూ.33,000 పైబడి ఉంటున్నాయి. లేహ్‌కు రావడం కంటే లండన్ పోవడం చవక. తిరిగి రావాలనుకునే విద్యార్థులు, రోగుల పరిస్థితి ఆలోచించండి. ఇంకొన్ని విమానాలు నడపడం అంత కష్టమేమీ కాదు.
– సోనమ్ వాంగ్‌చుక్, విద్యా సంస్కర్త

సాగడమే జీవితం



పరిస్థితులు మారిపోతాయి. స్నేహితులు వదిలేస్తారు. గుర్తుంచుకోండి, మీరు వాటిని పట్టించుకోకుండా సాగిపోతారా లేక గతంలోనే ఉండిపోతారా అన్నదానితో నిమిత్తం లేకుండా జీవితం నడుస్తూ ఉంటుంది.
– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

జై నితిన్!




ఇండియా 2022 సంవత్సరంలో ప్రతి రోజూ 38 కిలో మీటర్ల హైవే నిర్మాణాలు చేసింది! ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇది అసాధారణ విజయం. మోదీ ప్రభుత్వంలో రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యేకమైనవారు.
– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అపకారికి ఉపకారము



ఆర్మేనియాను ఒంటరి చేయడం, ఆర్మేనియన్లను ఆకలికి మాడ్చడం, చల్లటి వాతావరణానికి బలి చేయడం కోసం (రిపబ్లిక్ ఆఫ్) 'అర్ట్‌సాక్'ను దిగ్బంధించింది అజర్‌బైజాన్. దీనికి టర్కీ మద్దతిస్తోంది. అయినప్పటికీ టర్కీ భూకంప బాధితులకు ఆర్మేనియా సాయం పంపింది. స్పందనగా, ఆర్మేనియాలో జరిగిన 1915 నాటి నరమేధాన్ని గుర్తించినందుకు మెక్సికోను విమర్శిస్తోంది టర్కీ.
– ఉజయ్ బులూత్, టర్కీ యాక్టివిస్ట్

తగని దాడి



మోదీ ప్రభుత్వంలో పదేపదే మీడియా స్వేచ్ఛ మీద దాడి జరుగుతోంది. ఉన్న కొద్దిపాటి విమర్శనా గొంతుకలను కలినంగా, కక్ష సాధింపుతో ఊపిరాడకుండా చేస్తున్నారు. ప్రతిపక్షాలు, మీడియా మీద దాడి చేయడానికి సంస్థలను ఉపయోగించుకుంటే ఏ ప్రజాస్వామ్యమూ మనుగడ సాగించలేదు. జనం దీన్ని ఎదుర్కొంటారు.
– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు

వ్యక్తి కేంద్రిత బడ్జెట్ కావాలి

అభిప్రాయం



కూనంనేని సాంబశివరావు

స్వాతంత్ర్యం సాధించి 76 ఏళ్లు గడిచినప్పటికీ మూస బడ్జెట్ విధానం వల్ల దేశంలో దాదాపు 80 శాతం ప్రజల జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉంది. కాలం చెల్లిన బడ్జెట్ రూపొందించే విధానాన్ని మార్చి, వ్యక్తి కేంద్రంగా, అలాగే గ్రామం యూనిట్‌గా ఉండే కొత్త తరహా బడ్జెట్‌ను రూపొందించే క్రమానికి శ్రీకారం చుట్టవలసిన అవసరం ఉంది. బడ్జెట్ అంటే జమా, ఖర్చుల పట్టికగా; వార్షిక, ఆర్థిక ప్రకటనగా, నూతన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య వ్యయానికి పార్లమెంట్ ఆమోదం పొందే ప్రక్రియగానే చూడరాదు. 2022–23 బడ్జెట్ 39.5 లక్షల కోట్లు కాగా... ప్రస్తుత 2023–24 బడ్జెట్ రూ. 45 లక్షల కోట్లుగా ప్రవేశపెట్టి గతం కంటే బడ్జెట్ వ్యయం పెంచినట్లుగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఘనంగా పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం జీడీపీ శాతం 9.2 శాతం ఉంటుందని గత బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో పేర్కొన్నారు.



కానీ ఎకనమిక్ సర్వే ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతంగా అంచనా వేయడం జరిగింది. నూతన బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలో 2023–24కు 6.5 శాతంగా జీడీపీ ఉంటుందని నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. అంటే అనుకున్నదొకటయితే... జరుగుతున్నది మరొకటన్నమాట. నిజానికి ఈ జీడీపీ లెక్కింపూ తప్పుల తడకే. సామాన్యుల, సంపన్నుల ఆదాయాలు కలిపి లెక్కవేయడం వలన జీడీపీలో ఈ మాత్రం వృద్ధి కనిపిస్తున్నది. నిజానికి సామాన్యుల ఆదాయంలో మార్పు ఏమీ లేదు. అసమానతలు అలాగే ఉన్నాయి. అందువలన అంకెలపై ఆధారపడిన బడ్జెట్ కాకుండా వ్యక్తి కేంద్రంగా బడ్జెట్ తయారుచేసి శాచ్యురేషన్ స్థాయికి ఆయా పథకాలను తీసుకొని వెళ్ళగలిగితే... ఒక నిర్దిష్ట కాలపరిధిలో పూర్తి సమానత్వం కాకపోయినా పేదరికం నుంచి దేశంగాని, ఆయా రాష్ట్రాలు గాని బయటపడే అవకాశం ఉంది.

దేశంలో అందరూ అభివృద్ధి చెందాలంటే జీరో ఆధారిత బడ్జెట్, వ్యక్తి కేంద్రిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. జీరో ఆధార బడ్జెట్‌ను గ్రామ యూనిట్‌గా, వ్యక్తి అవసరాలకు అనుగుణంగా తయారు చేయవచ్చునని అనేక మంది ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. సెక్టార్ల పరంగా కేటాయింపులు జరుపుతూనే సమాజంలోని ప్రతీ ఆఖరి వ్యక్తినీ పరిగణనలోకి తీసుకునే విధంగా గత బడ్జెట్‌లతో సంబంధం లేకుండా ప్రస్తుత వాస్తవ పరిస్థితులపై ఆధారపడి కొత్తగా జీరో పాయింట్ నుంచి తయారు చేసేది జీరో బడ్జెట్. ఈ జీరో బడ్జెట్‌లోనే నేరుగా నగదు పంపిణీ లాంటి పథకాలను అనుసరించవలసిన అవసరం ఉంటుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ లాంటి అనేక మంది ఆర్థిక వేత్తలు కూడా పలు పర్యాయాలు ప్రస్తావన చేసిన విధంగా... ప్రతీ పేదవాడికీ నగదు రూపంలో ఆర్థిక సహాయం అందితే పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రతీ రూపాయీ అర్హుడికి చేరుతుంది. ఆ విధంగా కొనుగోలు శక్తి పెరగడమే కాకుండా అసమానతలు కూడా కాలక్రమంలో తగ్గించబడతాయి.

ఈ సందర్భంగా బడ్జెట్‌కి అవసరమైన నిధుల సమీకరణ అనే సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే తప్పనిసరిగా సంపదపైన కనీసం 2 శాతం నుంచి 4 శాతం పన్నును విధించవలసిన అవసరం ఉన్నది. అలాగే కార్పొరేట్ ట్యాక్స్‌ను కార్పొరేట్లకు అనుకూలంగా తగ్గించడం వలన అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ క్రమంలో శతసహస్ర కోటీశ్వర్లు దాతృత్వం చేయవలసిన అవసరం కూడా ఉన్నది. ఇటీవల దావోస్‌లో జరిగిన ఆన్‌లైన్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశానికి తమ వద్ద పోగుపడిన సంపదపై పన్ను వేయాలంటూ 102 మంది శత కోటీశ్వరులు లేఖ రాయడం విశేషం. అలాగే వారెన్ బఫెట్, బిల్ గేట్స్ లాంటి వారు తమ సంపదలో సగానికి పైగా ఇప్పటికే తమ మాతృదేశానికి వితరణ చేయడం జరిగింది. భారతదేశంలో టాటాలు గత వందేళ్లలో దాదాపు 102 బిలియన్ డాలర్లనూ, ప్రేమ్‌జీ 21 బిలియన్ డాలర్లనూ సమాజ శ్రేయస్సుకు వితరణ చేశారు. పై విధంగా సంపన్నుల వితరణ, అధిక సంపద పన్ను, పేదలకు నేరుగా నగదు సహాయం అందించే పథకాలు లాంటివి ఉంటే... తప్పనిసరిగా దేశం బాగుపడుతుంది.

వ్యాసకర్త సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు

అది వక్రీకరణే!

ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఇటీవల సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మరాఠీ ప్రసంగం ఆద్యంతం సంస్కరణ – సమరసతను దృష్టిలో పెట్టుకొని కొనసాగింది. ప్రతి అంశాన్నీ ఏదో ఒక పద్ధతిలో విపరీతం చేయటం, పెడర్థాలు తీయటం దేశంలో ఓ బౌద్ధికపరమైన యుద్ధమని చెప్పాలి. అదే క్రమంలో మోహన్ భాగవత్ ప్రసంగాన్ని వక్రీకరించి మరోసారి హిందూ అనుకూల వాతావరణం, హిందూ సమాజ ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యతిరేక శక్తులు చెలరేగిపోయాయి. కులాలను సృష్టించింది దేవుడు కాదు, పండితులే అనీ, పూజారులు అనీ అన్నట్లు పత్రికల్లో పతాక శీర్షికలు వచ్చాయి. అనువాద సమస్య వల్లనో, అవసరార్థం వల్లనో వివాదం చేసే ప్రయత్నం మొదలైనది. కోడిగుడ్డు మీద ఈకలు పీకే చందంగా ఎవరి వ్యాఖ్యానాలు వారు చేయటం మొదలెట్టారు. అసలు వారి ప్రసంగంలో ఏం చెప్పారో ఒకసారి గమనిద్దాం. 'భగవంతుడు సర్వ వ్యాపి... భగవంతుడు సత్య రూపుడు... సత్యమే భగవంతుడు. అందరిలో, అన్నింటిలో ఆయన ఉన్నప్పుడు ఒకటి తక్కువా ఒకటి ఎక్కువ అని ఎలా చెప్పగలం? అలానే పుట్టుక వలన వచ్చే జాతి (కులం) ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అని ఎలా చెప్తాము?? సంత్ రవిదాస్‌ను ఆయన కుటుంబ సభ్యులే వెనక్కి లాగారు, కానీ ఆయన సత్య మార్గాన్నే ఎంచుకున్నారు. సత్యాన్ని గురించి శోధించారు. ఆయనకు ఈశ్వర దర్శనం అయింది. అప్పుడు ఆయన చెప్పారు 'సత్యమే శివం' అనీ... పుట్టుక కారణంగా ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనేది శాస్త్ర ప్రమాణం ఎవరైతే మాట్లాడు తున్నారో వారు సత్యాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవచ్చు లేదా సత్యాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుండవచ్చు లేదా వాళ్ళు సత్యాన్ని అర్థం చేసుకోవడంలో తికమక పడి ఉండవచ్చు. మన ధర్మం ఎప్పుడూ సమాజ అసమానతలు బోధించలేదు. ఈ విషయాన్ని సమాజానికి తెలియ చెప్పాలి. మన ధర్మం మనకి ముఖ్యంగా 3 విషయాలు ఎలా ఆచరణాత్మకంగా ఉండాలో బోధించింది. 1. సత్యం 2. ధర్మా చరణ 3. కర్తవ్యం.'



సంత్ రవిదాస్ స్మారకోపన్యాసం క్లుప్తంగా పై విధంగా ఉంది. మోహన్ భాగవత్ చెప్పిన మాటల్లో నిందాపూర్వకమో, విమర్శ ధోరణియో మనకు కన్పించదు. సమాజ సంఘటనకు కావలసిన సమన్వయ మార్గాన్ని రవిదాస్ బోధనల ద్వారా ఆయన సూచించారు. కులాల పుట్టుకకు కారణాలు చెప్పటం ఆయన ఉద్దేశంలో లేదు. ఎక్కడా చెప్పలేదు. ఎక్కడా ఊహా అపోహలకు దారి తీసే ప్రసంగం కాదు. కుల ప్రసక్తి లేని సమరసతా యుక్త సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం. శక్తిమంతం అవుతున్న హిందుత్వమే ప్రపంచ శాంతికి బాటలు వేసే విశ్వ మానవ ధర్మం. అతలాకుతలం అవుతున్న మానవ విలువలకూ, విశాల భావాలకూ హిందుత్వమే పునాది. హిందుత్వం ద్వేషాన్ని ప్రేరేపించదు. హిందువులు 'సర్వేభవంతు సుఖినః' అనే ప్రార్థిస్తారు తప్పా ఎక్కడా 'హిందూ సుఖినో భవంతు' అని ప్రార్థించరు. అనవసర వివాదాలకు హిందూ త్యాన్నీ, ఆర్‌ఎస్‌ఎస్‌నూ కేంద్ర బిందువు చేయాలనుకుంటే అది మేధాపరమైన మూర్ఖత్వం అవుతుంది తప్ప మరొకటి కాదు. కావున ప్రసంగ సారాంశాన్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరం సామాజిక దురాచారాల్ని దూరం చేసేందుకు ప్రయత్నిద్దాం.

– సాకి, సమరసతా సాహితీ వేదిక
మొబైల్ : 99493 94688

నీతులు చెప్పే వృద్ధ హంస

శ్రీకృష్ణుని అనుమతితో యుధిష్ఠిరుడు రాజసూయ యాగం తలపెట్టి పెద్దయెత్తున చేస్తున్నాడు. ఆహ్వానం అందుకొని ఎందరో రాజులు వచ్చి ఉన్నారు. వాళ్లలో శిశుపాలుడు కూడా ఉన్నాడు. ధర్మరాజు అడుగుతాడు భీష్ముణ్ణి... ఇందరిలో ఎవరికి ముందు అర్ఘ్యమిచ్చి గౌరవించాలి అని. ఆ గౌరవానికి అర్హుడు కృష్ణుడు ఒక్కడే అంటాడు భీష్ముడు. ఇది శిశుపాలుడికి రుచించదు. కృష్ణునకు గౌరవమివ్వటాన్ని వ్యతిరేకిస్తాడు.

జ్యోతిర్మయం

భీష్ముడు అతణ్ణి గట్టిగా మందలిస్తాడు. అప్పుడు శిశుపాలుడు భీష్ముణ్ణి వ్యక్తిగతంగా దూషిస్తూ ఒక కథ చెప్తాడు. ఆ కథ మహాభారతం సభా పర్వం ద్వితీయాశ్వాసంలో ఉంది.

పూర్వం సముద్రం ఒడ్డున ఒక వృద్ధ హంస ఉండేది. అక్కడి పక్షులకు అది ఎప్పుడూ ధర్మం గురించి చెబుతూ, అధర్మం వైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తూ ఉండేది. వృద్ధ హంస మాటలు ఉన్నట్లుగా, చేతలు ఉండేవి కావు. ఈ సత్యం గ్రహించలేని పక్షులు దాని మాటలు నమ్మి గౌరవిస్తూ ఉండేవి. సముద్రం మీదకు వెళ్లినప్పుడల్లా అవి వృద్ధ హంసకు రుచికరమైన ఆహారం తెచ్చి ఇచ్చేవి. ఏ మాత్రం శంక లేకుండా తమ గుడ్లను వృద్ధ హంస చుట్టుపక్కలే వదిలిపెట్టి తాము సముద్రం మీదకు వేటకు వెళ్లేవి. దుష్ట చింతనగల వృద్ధ హంస తెలివిగా ఆ గుడ్లను తినివేసేది. తమ గుడ్లు దినదినం తగ్గిపోతుండటం గమనించిన ఒక పక్షికి అనుమానం వచ్చింది. ఓ రోజు... చాటున ఉండి వృద్ధ హంస చేసే నీచ కృత్యాన్ని చూసి అనుకొన్నది – 'ఈ వృద్ధ హంస ఇతరులకు నీతులు చెప్తుంది. కానీ తను మాత్రం పాటించదు' అని. ఇక ఊరుకొని లాభం లేదనుకొని మిగతా పక్షులన్నింటికీ వృద్ధ హంస అసలు నైజం చాటి చెప్పింది. వెంటనే పక్షులన్నీ చేరి వృద్ధహంస పైబడి దానిని హతమార్చాయి.

ఈ కథ చెప్పి శిశుపాలుడు భీష్ముణ్ణి ఆ వృద్ధ హంసతో పోలుస్తాడు. భీష్ముడు అలాంటివాడు కాదనీ, ఆ పోలిక సరైనది కాదనీ అక్కడి వారిలో చాలామందికి తెలుసు. శిశుపాలుడు ఆ విధంగా భీష్ముణ్ణీ, శ్రీకృష్ణుణ్ణీ పరుష వచనాలతో నిందించటం ఆపడు. శిశుపాలుడు అట్లా నూరు తప్పులు చేసేదాకా ఓపిక పట్టి, తరువాత అతడి తలను శ్రీకృష్ణుడు తన చక్రంతో తురుముతాడు.

వృద్ధ హంస కథ వల్ల మనకు తెలియదగ్గ నీతి ఏమిటి? ఈ కాలం ఆ కాలం అని కాకుండా, ఏ కాలంలో అయినా ధర్మోపన్యాసాలు చేస్తూ జీవించేవారు కొద్దిమంది ఉంటారు. వారు పైకి హంసలా కనిపిస్తూ లోపల కొంగ బుద్ధితో ఉంటారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోగూడదు. వారి అసలు గుణం ఏమిటో వారు చేసే పనులను బట్టి తెలుసుకోవాలి.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.దశమి రా.12.55 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ రా.8.37 వరకు, తదుపరి మూల, వర్జ్యం: తె.4.11 నుండి 5.52 వరకు (తెల్లవారితే గురువారం), దుర్ముహూర్తం: ప.11.51 నుండి 12.35 వరకు, అమృతఘడియలు: ప.12.10 నుండి 1.40 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 5.57.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

మహాశివరాత్రికి 3,500 ప్రత్యేక బస్సులు

- ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి



కడప కోటిరెడ్డి సర్కిల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శైవ క్షేత్రాలకు 3,500 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా కడపలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం 650, కోటప్పకొండ 675, రామతీర్థం 103, పట్టిసీమ 102, నరసరావుపేట 90, తలకోన 95, సదాశివకోన 65, పాలతల 175, లంకమల 40, నిత్యపూజకోన 30, వెంకటాపురం 60, శ్రీకాళహస్తి, తిరుపతి 48, మల్లయ్యకొండ 45, ఇల్లూరు 43, బాలివె 68, అప్పికొండ 70, కల్యాణ పూల్వ 87, పారమ్మకొండ 39 చొప్పున మొత్తం 3,500 సర్వీసులతోపాటు ఇతర శైవక్షేత్రాలకు బస్సులను నడుపుతున్నామన్నారు. సాధారణ చార్జీలతో ఈ సర్వీసులను నడుపుతున్నామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దుర్గమ్మ సేవలో డిప్యూటీ స్పీకర్

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



ఆశీర్వచన మండపంలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీలు రఘురాజు, పి.వి.వి.సూర్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు బి.అప్పలనరసయ్య(గజపతినగరం), గొర్ల కిరణ్‌కుమార్(హెచ్చర్ల) తదితరులు మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఏసీబీకి చిక్కిన దెందులూరు ఎలక్ట్రికల్ ఏఈ



ఏసీబీకి చిక్కిన ఏఈ మల్లుల రమేష్ బాబు

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండల ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ మల్లుల రమేష్ బాబు మంగళవారం మండల విద్యుత్ శాఖ అధికారి కార్యాలయంలో ఏసీబీకి చిక్కారు. ఎలక్ట్రికల్ లైన్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ ప్రభుత్వ పనులు చేస్తున్నారు. ఆ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయడానికి శ్రీనివాస్‌ను రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఏఈ రమేష్‌బాబు వేధింపులు భరించలేని కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ సీఐ వలపన్ని దెందులూరులోని రమేష్‌బాబు కార్యాలయంలో రూ.50 వేలు తీసుకుంటుండగా ఆయన్ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఏఈని అదుపులోకి తీసుకున్నారు.

తెలుగు మహిళల రాద్ధాంతం

- లోకేశ్ చీరలు పంపారంటూ మంత్రి రోజా ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం
- పోలీసులపైనే తిరగబడ్డ టీడీపీ కార్యకర్తలు
- అదుపులోకి తీసుకొన్న పోలీసులు



చీరతో మంత్రి ఇంటివైపు పరుగులు తీస్తున్న తెలుగు మహిళలు

నగరి (చిత్తూరు జిల్లా): లోకేశ్ చీరలు పంపారంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు మహిళలు మంత్రి ఆర్కే రోజా ఇంటిలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. మంత్రి ఇంటి వద్ద, తర్వాత పోలీసు స్టేషన్‌లోనూ రాద్ధాంతం సృష్టించారు. యువగళం పాదయాత్రలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేసిన విమర్శలను మంత్రి ఆర్కే రోజా మంగళవారం తిప్పికొట్టారు. లోకేశ్‌పై ఘాటు విమర్శలు చేశారు. ఇది తట్టుకోలేని కొందరు తెలుగు మహిళలు లోకేశ్ చీరలు పంపారంటూ ఓ చీరను పట్టుకుని నగరిలోని కాకవేడు రోడ్డు నుంచి మంత్రి నివాసం ఉన్న వీధిలోకి పరిగెత్తుకెళ్లారు. విషయం తెలిసి మంత్రి నివాసం వద్దకు చేరుకున్న పోలీసులు వారిని నిలువరించారు. దీంతో తెలుగు మహిళ నేతలు అక్కడ రాద్ధాంతం సృష్టించారు. పోలీసుల పైనే తిరగబడి, చేయి చేసుకొనే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న స్థానిక టీడీపీ నాయకులు వారిని విడిచిపెట్టాలంటూ రాద్ధాంతం చేశారు. చివరకు పోలీసులు వారందరినీ బయటకు పంపేశారు.

నంబర్ వన్ వర్సిటీగా తీర్చిదిద్దుతా

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి వీసీ అయిన తొలి దళిత వ్యక్తిని నేనే





డాక్టర్ కోరుకొండ బాబ్జీ

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని నూతన వైస్ చాన్సలర్ (వీసీ) డాక్టర్ కోరుకొండ బాబ్జీ తెలిపారు. కళాశాలల్లో ప్రమాణాలను పెంచి నాణ్యమైన వైద్య విద్యను అందించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. తద్వారా సమాజానికి మెరికల్లాంటి వైద్యులను అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకుంటామన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన బాబ్జీ వర్సిటీ భవిష్యత్ ప్రణాళికలు, తదితరాలపై మంగళవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ అదృష్టం నాకే దక్కింది..

1986లో వర్సిటీ ఏర్పడ్డాక ఇప్పటివరకు దళితులకు వీసీ అవకాశం దక్కలేదు. ఇప్పుడు తొలిసారిగా ఆ అదృష్టం నాకు దక్కింది. వర్సిటీకి వీసీ అయిన తొలి దళిత వైద్యుడిని నేనే అని చెప్పుకోవడానికి ఎంతో గర్వంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాను. ఇది రాష్ట్రంలోని దళిత జాతికి దక్కిన గౌరవం.

ఆ అనుభవం ఇప్పుడు ఉపయోగపడుతుంది..

1986లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా నేను వైద్య రంగంలోకి అడుగుపెట్టాను. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేశాను. అడిషనల్ డీఎంఈ అకడమిక్, డీఎంఈగా మూడేళ్ల పాటు వ్యవహరించాను. ఈ క్రమంలో వైద్య, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలు, బోధనాస్పత్రుల కార్యకలాపాలు, పనితీరుపై అనుభవం ఉంది. ఆ అనుభవం ఇప్పుడు ఎంతో ఉపయోగపడనుంది.

పరిశోధన కార్యకలాపాలపై దృష్టి సారిస్తే..

ఇక్కడ చాలా క్లినికల్ మెటీరియల్ ఉంది. దీనితో పరిశోధన కార్యకలాపాలపై దృష్టి పెడితే భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారమవుతాం. పరిశోధనల ద్వారా మన వైద్యుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి. పోటీ ప్రపంచంలో మన వైద్య విద్యార్థులు రాణించగలరు. ఇందులో భాగంగా వర్సిటీ ద్వారా రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పరిశోధనలను మరింత ముమ్మరం చేస్తాం. ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో వచ్చే ఏడాది ఐదు వైద్య కళాశాలల అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీంతో రాష్ట్రంలో వైద్య విద్యకు అవకాశాలు మరింత పెరగనున్నాయి. వైద్య విద్యార్థులకు కళాశాలల నుంచి ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులపై విశ్వవిద్యాలయానికి ఫిర్యాదు చేయొచ్చు. ఈ దిశగా గ్రీవెన్స్ సెల్‌ను మరింత బలోపేతం చేస్తాం.

రాష్ట్రంపై బాబు అండ్ కో దుష్ప్రచారం

- 870వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్ర అభివృద్ధిపై బాబు అండ్ కో దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 870వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి రాజధాని నిర్మిస్తానని చెప్పి నిపుణుల కమిటీలను సైతం పక్కనబెట్టి, అవసరం లేకుండానే వేలాది ఎకరాల భూములు సేకరించిన చంద్రబాబు రైతులను నిండా ముంచేశాడని విమర్శించారు. అమరావతికి తాము అనుకూలమని డబ్బాలు కొట్టుకుంటున్న ఏపీ బీజేపీ నాయకులు ప్రధాని మోదీని నిలదీసి రాష్ట్రానికి రావాల్సిన విభజన హక్కులు సాధించాలని సూచించారు. రాష్ట్రంలోని కులవాదులను రెచ్చగొట్టి రాజధాని పేరుతో రాజకీయాలు చేయాలని చూసిన బాబును ప్రజలు తిప్పికొట్టారన్నారు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న లోకేశ్ యువత సమస్యలను ప్రస్తావించకుండా పొంతనలేని మాటలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ అట్టర్ ఫ్లాప్ అయ్యాడని ఎద్దేవా చేశారు. మూడు రాజధానులతోనే సమగ్రాభివృద్ధి జరుగుతుందని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా మార్చి నుంచి విశాఖ వేదికగా పరిపాలన సాగించాలని యావత్ రాష్ట్ర ప్రజలు కోరుతున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, వై.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశం చూపు..కురుక్షేత్ర వైపు

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర వ్యాఖ్య



యజ్ఞాన్ని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణలోని కురుక్షేత్ర వేదికగా చేపట్టిన లక్ష చండీ మహాయజ్ఞ ఫలాలు భారతావనికే ఉపయోగపడతాయని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. కురుక్షేత్రలో లక్ష చండీ మహా యజ్ఞం ఐదో రోజు మంగళవారం విజయవంతంగా కొనసాగింది. స్వరూపానందేంద్ర అనుగ్రహభాషణం చేస్తూ..గతంలో లక్ష మహా చండీ యజ్ఞాన్ని ఎవరూ చేపట్టలేదన్నారు. ఈ కారణంగానే జాతీయ ప్రముఖులు, హిందూత్వవాదులు యజ్ఞభూమిని సందర్శిస్తున్నారని, యావత్ భారతావని కురుక్షేత్ర వైపు చూస్తోందని చెప్పారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలు గంతీమాత ఆశ్రమాన్ని సందర్శించి శ్రీచక్ర నవావరణ అర్చనలో పాల్గొని హారతులు అందజేశారు. ఆశ్రమ ప్రాంగణంలోని కాళీమాతకు పూజలు నిర్వహించారు. యజ్ఞ నిర్వహణలో భాగంగా 6,976 పారాయణ హోమాలు నిర్వహించారు. 2,000 మందికిపైగా బ్రాహ్మణులు క్రతువులో పాల్గొన్నారు.

అరుదైన బ్రెయిన్ కణితి తొలగింపు

- జీజీహెచ్‌లో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు



మెదడులో కణితిని తొలగించిన తర్వాత రోగితో వైద్య బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అరుదైన బ్రెయిన్ కణితితో బాధపడుతున్న రోగికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వాస్పత్రి ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవి, న్యూరోసర్జన్ డాక్టర్ శేషాద్రిశంకర్ సహకారంతో పిట్యూటరీ గ్రంధి నుంచి బ్రెయిన్ కణితిని ఎండోస్కోపిక్ శస్త్ర చికిత్స నిర్వహించి తొలగించారు. రోగి వేగంగా కోలుకున్నట్లు డాక్టర్ కె.రవి తెలిపారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడంలో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లీలాప్రసాద్, డాక్టర్ వర్ధిని, ఓటీ నర్సింగ్ స్టాఫ్ ఫ్లోరెన్స్ జ్యోతి, సంధ్య, విజయలక్ష్మి, మీరా, కిషోర్, రమణ తమ వంతు భాగస్వామ్యం అందించారని పేర్కొన్నారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ఆర్‌ఎంవో డాక్టర్ యు.శోభ అభినందనలు తెలియజేశారు.

వైభవంగా ముక్కంటి ధ్వజారోహణం



శ్రీకాళహస్తి రూరల్(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం ముక్కంటి ధ్వజారోహణ వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా భక్తులు నడుమ కొడి ఉత్సవం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ధ్వజస్తంభం ఎదురుగా ఆలయ ప్రధాన అర్చకులు కలశాలు నెలకొల్పి హోమపూజలు చేపట్టారు. తదుపరి కలశాల్లోని నీటితో ధ్వజస్తంభానికి అభిషేకం చేశారు. ధ్వజస్తంభం ఎదురుగా స్వామి అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. పంచమూర్తులు అయిన దేవేరి, భక్తకన్నప్ప, వినాయకస్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, చండికేశవులకు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన చీరలను కొడితాడు సాయంతో ధ్వజస్తంభానికి వేలాడ దీశారు. స్వామి, అమ్మవారు నూతన వెండి అంబారి ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

ఆదాయం 'పండుతోంది'

కేజీ రూ.400.. పీటీ వక్క రూ.600

- పంట అధికంగా పండే.. కేరళ.. కర్ణాటకలకు ఎగుమతి
- కొబ్బరి కన్నా ఐదు రెట్లు అదనపు ఆదాయం
- గోదావరి జిల్లాల్లో.. గణనీయంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం



కొబ్బరిలో అంతర పంటగా సాగవుతున్న పోక (ఇన్‌సెట్లో) పోక గెలలు



అంబాజీపేటలో రవాణాకు సిద్ధమవుతున్న పోక గింజలు

సాక్షి అమలాపురం: ప్రధాన పంట కొబ్బరిలో అంతర పంటగా సాగవుతున్న పోక రైతులకు సిరులు కురిపిస్తున్నది. దీంతో పాటే కొబ్బరి సాగులో అంతరపంటలుగా సాగవుతున్న కోకో, అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలు సైతం అదనపు ఆదాయ వనరులవుతున్నాయి.

ఉభయ గోదావరి జిల్లాల్లో..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరిలో అంతర పంటగా అత్యధికంగా వక్క (పోక) సాగు చేస్తున్నారు. ఇక్కడ సుమారు 4,500 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఆయిల్ పామ్ తోటల్లో సైతం దీని సాగు చేపట్టారు. ఈ జిల్లాల్లో నాటు రకం మల్‌నాడు, తీర్థ హళీ, మోతీ రకాలను, హైబ్రిడ్‌లో మంగళ, సుమంగళ, శ్రీమంగళ, మోహిత్ నగర్ రకాలను సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో వక్క ధర భారీగా పెరిగింది. ప్రస్తుత మార్కెట్‌లో వక్క కేజీ రూ.400 ధర పలుకుతోంది. నాటురకం తీర్థహళీ, మోతీ రకాలను నీటిలో ఉడకబెట్టి తయారు చేసే ఎర్రరంగు వక్క (పీటీవక్క) కేజీ రూ.600 ధర పలుకుతోంది. పంట బాగా పండిన తోటల మీద ఎకరాకు రూ.ఖర్చులన్నీ పోను రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఇదే సమయంలో ప్రధాన పంట కొబ్బరి తోటల మీద ఆదాయం కేవలం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు మాత్రమే ఉండడం గమనార్హం.

కేరళ.. కర్ణాటకలకు ఎగుమతి..

దేశంలో వక్క సాగు కేరళ, కర్ణాటకలో అధికం. ఇక్కడ సుమారు 7.85 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. కానీ ఆ రాష్ట్రాలకు సైతం కోనసీమ వక్క ఎగుమతి కావడం గమనార్హం. అధిక ఆదాయం వచ్చే రబ్బరు సాగు మీద వారు దృష్టి పెట్టడంతో అక్కడ వక్కకు డిమాండ్ అధికంగా ఉండడంతో గోదావరి జిల్లాల నుంచి ఎగుమతి అవుతోంది.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ..

- సాగు ఆరంభించిన ఐదారేళ్లకు దిగుబడి వస్తోంది. ఈ కాలంలో పోక సాగుకు రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతోంది. పెట్టుబడి తక్కువ. తెగుళ్లు కూడా తక్కువ. ఇదే సమయంలో ఆదాయం బాగుంటుంది.
- అంతర పంటగా ఎకరాకు 500 వరకు మొక్కలు పెంచే అవకాశముండగా, ఏక పంటగా అయితే 700 వరకు చెట్లు వేసుకునే అవకాశముంది. ఒక చెట్టు సగటున రెండున్నర కేజీల నుంచి మూడున్నర కేజీల వరకు వలిచిన పోక దిగుబడిగా వస్తుందని అంచనా.
- పోక చెట్టు ఆధారంగా మిరియం తీగలను పాకించడం ద్వారా సమీకృత సాగుకు కొంతమంది రైతులు శ్రీకారం చుట్టారు. అంబాజీపేట మండలంలో ఇది నలుగురైదుగురు రైతులు ప్రయోగాత్మకంగా చేపట్టారు.
- పోక చెట్టు ఆకులతో తినేందుకు వీలుగా ప్లేట్‌లు, స్పూన్లు తయారు చేస్తున్నారు. ఈ పరిశ్రమలు స్థానికంగా వస్తే గోదావరి జిల్లాల్లో సాగు మరింత పెరిగే అవకాశముంది. కొబ్బరి, కోకో, ఇతర ఉద్యాన పంటలకు రాయితీ ఇస్తున్న ప్రభుత్వం ఈసాగుకు సైతం ఇస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది.


పోక ఒక్కటే అంతర పంట



మా కొబ్బరి తోటల్లో అంతర పంటగా ఉన్న కోకోను పూర్తిగా తొలగించాం. మొత్తం పోక సాగు ఆరంభించాం. పంట వేసి ఎనిమిదేళ్లు అవుతోంది. ఎకరాకు 500 చెట్లు వేశాం. ఎకరాకు 800 కేజీలకు పైబడి దిగుబడి వస్తోంది.

– గణపతిరాజు, అయినవిల్లి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

పలు విధాలుగా మేలు..



కొబ్బరి కన్నా ఐదు రెట్లు అధిక ఆదాయం వస్తోంది. పోకను అంతర పంటగా సాగు చేయడం వల్ల ప్రధాన పంట కొబ్బరి ఆదాయం మీద మేము ఆధారపడాల్సిన అవసరం తగ్గింది. ఖర్చులు పోను మాకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

– పితాని భీముడు, రైతు, అంబాజీపేట, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా



సర్వ దర్శనానికి 14 గంటలు

- నేడు పాలకమండలి సమావేశం

తిరుపతి అలిపిరి/తిరుచానూరు: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 71,434 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్న వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 14 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2.30 గంటల్లో దర్శనం అవుతోంది. కాగా, టీటీడీ పాలకమండలి సమావేశం బుధవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో జరగనుంది. ఇందులో దేవస్థానం నిర్వహణ, అభివృద్ధి వంటి పలు విషయాలపై చర్చ జరపనున్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు మంగళవారం శ్రీవారిని, తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

సిఫారసు లేఖతో అధిక ధరలకు శ్రీవారి దర్శన టికెట్ల విక్రయం

శ్రీవారి దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన దళారీపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీటీడీ వింగ్ వీజీవో గిరిధర్ తెలిపిన వివరాల మేరకు..ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. వీఐపీ టికెట్ల కోసం దళారీ నగేష్‌ను సంప్రదించాడు. దళారీ టీడీపీ ఎంపీ కేశినేని నాని సిఫార్సు లేఖను దుర్వినియోగం చేసి 2 వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను ఇప్పించాడు. 2 టికెట్లకు రూ.12 వేలు వసూలు చేశాడు. మోసపోయామని గుర్తించిన భక్తుడు టీటీడీ విజిలెన్స్ అధికారులను ఆశ్రయించగా..వారు భక్తుడితో తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మయూర వాహనంపై మల్లన్న

- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీశైలం టెంపుల్: శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు మంగళవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి హారతి ఇచ్చారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం మయూర వాహనంపై తరలివచ్చిన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం తరఫున చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేష్ , తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలత, జేఈవో వీరబ్రహ్మం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారికి రావణవాహన సేవ నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ఇద్దరిని గాయపరిచిన పోలీసులకు ఏడాది జైలు

విశాఖ లీగల్: అకారణంగా ఇద్దరు యువకులను గాయపరిచిన విశాఖ 4వ పట్టణ ఎస్ఐతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ విశాఖలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ యుగంధర్ మంగళవారం తీర్పు నిచ్చారు. బాధితుల న్యాయవాది అక్బర్ అందించిన వివరాలు మేరకు...బాధితుడు ఎ.చంద్రశేఖర్ విశాఖలోని పాత డైరీఫాం దగ్గర ఉంటున్నాడు. మరో బాధితుడు కేదార్ ద్వారకానగర్ నివాసి. 2013 అక్టోబర్ 6న రాత్రి 9.30 సమయంలో కేదార్ తన ఇంట్లో మరుసటి రోజు జరగనున్న శుభకార్యం పనుల్లో భాగంగా స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి ద్వారకానగర్ మొదటి వీధికి వచ్చాడు. ఎస్ఐ బి.బి.గణేష్, కానిస్టేబుళ్లు ఎ.గణేష్, టి.సంతోష్ కుమార్, పీవీవీ రామకృష్ణ అటువైపుగా వచ్చి బాధితులను ప్రశ్నించారు. తన ఇంట్లో శుభకార్యం పనిమీద వచ్చామని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు. అంతటితో ఆగకుండా వారిద్దరిని పోలీసు స్టేషన్‌కి తీసుకువెళ్లి రెండు రోజుల పాటు దారుణంగా హింసించి బలంగా గాయపరిచారు. పోలీసుల చర్యపై వారు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో కేదార్ తమపై జరిగిన దాడిపై కోర్టుని ఆశ్రయించాడు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితులపై (ఐపీసీ సెక్షన్‌లు 323, 324, 326) నేరం రుజువు కావడంతో ఎస్ఐ గణేష్‌కి మూడు నేరాల్లో ఏడాది వంతున జైలు శిక్ష, రూ. 26వేలు జరిమానా విధించారు. కానిస్టేబుళ్ల ముగ్గురికి ఏడాది జైలు, మొత్తం రూ.30 వేలు జరిమానా విధించారు. జరిమానా నుంచి బాధితులకు రూ.50వేలు ఇవ్వాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అన్ని శిక్షలు ఏక కాలంలో అమలు జరపాలని కూడా ఆదేశించారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన సన్మానం

- జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను సన్మానించిన జడ్జిలు, న్యాయవాదులు

తిరుపతి లీగల్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ చైర్మన్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను తిరుపతిలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయమూర్తుల విశ్రాంతి భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు, ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి శిరీష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత తదితరులు హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులకు శాలువ కప్పి, జ్ఞాపికను అందజేశారు. అలాగే తిరుపతి మండల న్యాయ సేవా అధికార సంస్థ సిబ్బంది కూడా హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించారు. తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, మాజీ ఏపీపీ నాగభూషణం తదితరులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను సన్మానించారు.

హెచ్చరిక ప్రకటన

నవీన్ మతి (Navin Mathi) అనే వ్యక్తి తప్పుడు దారిలో ఇన్వెస్టర్లను సంప్రదిస్తూ, 'ఎస్సెల్ గ్రూప్'తో సంబంధం కలిగి ఉన్నారనే నెపంతో అటువంటి సంబంధం ఏదీ లేనప్పటికీ వారితో వ్యాపార సంబంధములను ఏర్పాటు చేస్తున్నారని 'ఎస్సెల్ గ్రూప్'లో భాగమైన మా క్లయింట్ **జీ మీడియా కార్పొరేషన్ లిమిటెడ్**కు ఇటీవల తెలియవచ్చింది. 'ఎస్సెల్ గ్రూప్' మెంటార్ మరియు ఇండియన్ సొసైటీలో సుపరిచితులైన డా॥ సుభాష్ చంద్ర పేరు ప్రఖ్యాతులను ఉపయోగించుకుంటూ సదరు వ్యక్తి నవీన్ మతి (Navin Mathi) ప్రజలను తప్పుదోవ కూడా పట్టిస్తున్నారు.

అందువలన, ప్రస్తుత నోటీసు ద్వారా పైన పేర్కొన్న నవీన్ మతి (Navin Mathi) లేదా అటువంటి ఏ వ్యక్తి లేదా అతనితో సంబంధం కలిగి ఉన్న వ్యాపార సంస్థ వల్ల ఇటువంటి ఉచ్చులో మరియు తప్పుదోవలోపడరాదని, జాగ్రత్త వహించవలసిందిగా మేము ప్రజలను అర్థిస్తున్నాము మరియు హెచ్చరిస్తున్నాము. ఎటువంటి వ్యాపార సంస్థను మరియు/ లేదా కార్యకలాపాలను నిర్వహించేందుకు మరియు / లేదా ఏ రూపంలోనూ లేదా ఏ విధానంలోనూ రుణ సహాయం/ నిధులు కోరేందుకు నవీన్ మతి (Navin Mathi) లేదా ఏ ఇతర వ్యక్తికి 'ఎస్సెల్ గ్రూప్' సంస్థ అధికారం ఇవ్వలేదని సుస్పష్టం చేయడమైనది. అందువలన, అటువంటి వ్యక్తులతో ఎటువంటి వ్యాపారం లేదా ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు లేదా కుదుర్చుకునే ముందు అప్రమత్తంగా ఉండి జాగ్రత్త వహించవలసిందిగా సాధారణ ప్రజలను హెచ్చరించుటకు ప్రస్తుత నోటీసు జారీ చేయబడుతోంది మరియు అటువంటి ఏ విషయంలోనూ 'ఎస్సెల్ గ్రూప్' ఎటువంటి బాధ్యత లేదా రుణ బాధ్యతను స్వీకరించదు.

సిద్ధార్థ్ సింగ్
అడ్వకేట్
On behalf of M/s Zee Media Corporation Ltd. and 'Essel Group'

క్లుప్తంగా...

మిషిగన్ వర్సిటీలో కాల్పులు..
ముగ్గురి దుర్మరణం

మిషిగన్: అమెరికాలోని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీలో సోమవారం రాత్రి ఒక సాయుధుడు(43) జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఐదుగురు గాయపడ్డారు. దుండగుడు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో వర్సిటీలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో విద్యార్థులపైకి కాల్పులకు తెగబడ్డాడు. పోలీసులు గాలిస్తుండగా క్యాంపస్‌లోనే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. అతడి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. నల్ల జాతీయుడైన అతడు విద్యార్థి కాదని, వర్సిటీతో సంబంధమూ లేదని పోలీసులు చెప్పారు. యూనివర్సిటీలో 50 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాల్పుల ఘటన నేపథ్యంలో క్యాంపస్‌ను 48 గంటలపాటు మూసివేశారు.

సీబీఎస్‌ఈ 10, 12 పరీక్షల్లో చాట్‌జీపీటీపై నిషేధం

న్యూఢిల్లీ: 10, 12వ తరగతి బోర్డు పరీక్షల్లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌జీపీటీ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొబైల్ ఫోన్లు, చాట్‌జీపీటీ యాక్సెస్ ఉన్న పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు చెప్పారు. పరీక్షల్లో చాట్‌జీపీటీ ఉపయోగించడం అంటే అనైతిక పద్ధతులు అనుసరించినట్లేనని అన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తలను నమ్మొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఐ ఆధారంగా పనిచేసే చాట్ జీపీటీ (చాట్ జనరేటివ్ ప్రి-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్) గత ఏడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

సివిల్స్ దరఖాస్తులు సమర్పించాక...
ఉపసంహరణ కుదరదు

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసులపై ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ తదితర పోస్టుల భర్తీ కోసం నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌ల కోసం అభ్యర్థులు సమర్పించే దరఖాస్తులను ఇకపై ఉపసంహరించుకోవడం కుదరదని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) స్పష్టంచేసింది. ప్రిలిమినరీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న 10 లక్షల మందిలో దాదాపు సగం మందే ఎగ్జామ్ రాసిన నేపథ్యంలో దరఖాస్తును వెనక్కి తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు 2018లో ప్రకటించింది. అయితే ఈసారి పరీక్షలో అలాంటి అవకాశం లేదని తాజాగా విడుదలచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ మే 28న జరగనుంది.

'ఎయిరిండియా'కు
470 కొత్త విమానాలు
ఎయిర్‌బస్ నుంచి 250, బోయింగ్ నుంచి 220

విలువ రూ.6.4 లక్షల కోట్లు!
- 17 ఏళ్లలో సంస్థకు ఇవే తొలి ఆర్డర్లు
- మోదీ, బైడెన్, మేక్రాన్, రిషి హర్షం



న్యూఢిల్లీ/వాషింగ్టన్: టాటా గ్రూప్ సారథ్యంలోని ఎయిరిండియా సంస్థ దేశ విదేశాల్లో తన కార్యకలాపాలను మరింత విస్తరింపజేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ నుంచి, అమెరికాలోని బోయింగ్ నుంచి మొత్తం 470 కొత్త విమానాలను కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఆయా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. కొత్త విమానాల కోసం ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇవ్వడం గత 17 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఎయిర్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం నుంచి టాటా గ్రూప్ కొనుగోలు చేసిన తర్వాత ఇచ్చిన తొలి ఆర్డర్ కూడా ఇదే. ''40 ఎయిర్‌బస్ ఏ350 విమానాలు, 20 బోయింగ్ 787 విమానాలు, 10 బోయింగ్ 777-9 విమానాలు, 210 ఎయిర్‌బస్ ఏ320/321 నియో విమానాలు, 190 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కొంటున్నాం'' అని ఎయిర్ ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. మొదటి విమానం ఈ ఏడాది ఆఖర్లో సర్వీసులో చేరుతుందని పేర్కొంది. 2025 జూలై నుంచి విమానాలు తమకు అందుతాయని తెలియజేసింది. లీజుకు తీసుకున్న 11 బీ777, 25 ఏ320 విమానాల డెలివరీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేసింది. రెండు ఒప్పందాల విలువ ఏకంగా 80 బిలియన్ డాలర్లు (రూ.6.4 లక్షల కోట్లు) అని అంచనా!

సుదీర్ఘ ప్రయాణాలకు వైడ్-బాడీ విమానాలు

ఎయిర్‌బస్ నుంచి 250 విమానాలను కొనడానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశామని 'టాటా సన్స్' చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మంగళవారం చెప్పారు. ఎయిర్‌బస్ నుంచి 210 నారో-బాడీ విమానాలు, 40 వైడ్-బాడీ విమానాలు కొంటున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ తదితరులు వర్చువల్‌గా పాల్గొన్న కార్యక్రమంలో చంద్రశేఖరన్ మాట్లాడారు. ఎక్కువ సమయం(అల్ట్రా-లాంగ్ హాల్) సాగే ప్రయాణాల కోసం వైడ్-బాడీ విమానాలు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. 16 గంటలకు పైగా ప్రయాణించే విమానాన్ని అల్ట్రా-లాంగ్ హాల్ ఫ్లైట్ అంటారు. భారత ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న ఎయిరిండియాను 2022లో టాటా గ్రూప్ దక్కించుకోవడం తెలిసిందే. ఎయిర్ ఇండియా చివరిసారిగా 2005లో విమానాల కోసం ఆర్డర్ ఇచ్చింది. అప్పట్లో బోయింగ్ సంస్థ నుంచి 68, ఎయిర్‌బస్ నుంచి 43 విమానాలను కొనుగోలు చేసింది. 2005లో ఈ డీల్ విలువ 10.8 బిలియన్ డాలర్లు.

ఒప్పందాల పట్ల ప్రధాని మోదీ హర్షం

ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఎయిరిండియా ఒప్పందాలపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇవి మైలురాయి లాంటి ఒప్పందాలన్నారు. భారత్‌లో విమానయాన రంగం వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. 15 ఏళ్లలో 2,000కు పైగా విమానాలు అవసరమని చెప్పారు. మన పౌర విమానయాన రంగం దేశ అభివృద్ధిలో అంతర్భాగమని వ్యాఖ్యానించారు. దేశంలో గత ఎనిమిదేళ్లలో ఎయిర్‌పోర్టుల సంఖ్య 74 నుంచి 147కు చేరిందని గుర్తుచేశారు. 'ఉడాన్' పథకం కింద మారుమూల ప్రాంతాలను సైతం విమానాల ద్వారా అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు. విమానయాన రంగంలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించబోతోందన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఉక్రెయిన్-రష్యా సమస్యను పరిష్కరించే సత్తా మోదీ నాయకత్వంలోని భారత్‌కుందని ప్రశంసించారు. భారత జి-20 సారథ్యం విజయవంతం కావడానికి సహకరిస్తున్నామని చెప్పారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో మోదీ మంగళవారం ఫోన్‌లో మాట్లాడారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఎయిరిండియా-బోయింగ్ ఒప్పందంతోపాటు పలు అంశాలపై నేతలు చర్చించుకున్నారని వెల్లడించింది.

చరిత్రాత్మక ఒప్పందం: జో బైడెన్

34 బిలియన్ డాలర్లతో బోయింగ్ నుంచి 220 విమానాల కొనుగోలుకు ఎయిరిండియా ఒప్పందాన్ని చరిత్రాత్మకంగా బైడెన్ అభివర్ణించారు. ''అవసరాన్ని బట్టి మరో 70 విమానాలు కొనేలా ఒప్పందం కుదిరింది. అలా మొత్తం ఒప్పందం విలువ 45.9 బిలియన్ డాలర్లు. ప్రధాని మోదీతో కలిసి పనిచేస్తున్నాం'' అన్నారు. వైట్‌హౌస్ ప్రకటన మేరకు బోయింగ్‌తో ఒప్పందంలో 50 బోయింగ్ 737మ్యాక్స్, 20 బోయింగ్ 787 ఫ్లైట్లు ఉన్నాయి. ఎయిరిండియా ఇచ్చిన ఆర్డర్ బోయింగ్ చరిత్రలో డాలర్ విలువలో మూడో అతిపెద్ద సేల్, విమానాల సంఖ్యలో రెండో అతి పెద్దది!

కీలక ఘట్టం: రిషి

లండన్: ఎయిరిండియాకు 250 కొత్త విమానాలు విక్రయించడానికి 'ఎయిర్‌బస్-రోల్స్ రాయిస్' ఒప్పందానికి రావడంపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ హర్షం వెలిబుచ్చారు. బ్రిటన్ ఏరోస్పేస్ రంగంలో ఇదో కీలక ఘట్టమన్నారు. ''భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. బ్రిటన్‌లో విమానయాన రంగ అభివృద్ధికి ఆకాశమే హద్దు అనేందుకు ఈ ఒప్పందమే తార్కాణం'' అన్నారు. ఈ ఒప్పందంతో బ్రిటన్లోని వేల్స్, డెర్బీషైర్‌లో కొత్త ఉద్యోగాలు వస్తాయని, ఎగుమతులకు, ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహం లభిస్తుందని యూకే ప్రభుత్వం వెల్లడించింది. ఎయిరిండియా కొనుగోలు చేసే 250 విమానాల తయారీ ప్రక్రియ చాలావరకు యూకేలోనే పూర్తి కానున్నట్లు తెలియజేసింది.

బీబీసీపై ఐటీ సర్వే

ఢిల్లీ, ముంబై ఆఫీసుల్లో సోదాలు
- లాభాలను మళ్లించింది, నోటీసులకు స్పందించలేదు: అధికారులు
- తీవ్రంగా ఖండించిన విపక్షాలు
- కచ్చితంగా బెదిరింపు చర్యే: కాంగ్రెస్
- వేధింపుల్లో భాగమే: ఎడిటర్స్ గిల్డ్
- భారత్‌పై బీబీసీ విషం: బీజేపీ



ఢిల్లీలో ఐటీ సోదాలు జరిగిన బీబీసీ ఆఫీస్

న్యూఢిల్లీ: బీబీసీ-మోదీ డాక్యుమెంటరీ వివాదం కొత్త మలుపు తిరిగింది. పన్ను ఎగవేత ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఢిల్లీ, ముంబైల్లోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ మంగళవారం 'సర్వే' జరిపింది! ఇవి దాడులు కావని, బీబీసీ సబ్సిడరీ కంపెనీలకు చెందిన అంతర్జాతీయ పన్ను విధానాలు తదితరాలకు సంబంధించిన సర్వే మాత్రమేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ''ఈ అవకతవకలపై బీబీసీకి గతంలోనే నోటీసులిచ్చినా బేఖాతరు చేసింది. పైగా భారీగా లాభాలను దారి మళ్లించింది'' అని ఆరోపించాయి. ఐటీ అధికారులు ఉదయం 11 గంటల సమయంలో ఢిల్లీలో కస్తూర్బా గాంధీ మార్గ్, ముంబైలోని శాంతాక్రుజ్ ప్రాంతంలో ఉన్న బీబీసీ కార్యాలయాలకు చేరుకున్నారు. సర్వే పూర్తయ్యేదాకా బీబీసీ సిబ్బందిని కార్యాలయ ఆవరణ వీడేందుకు అనుమతించలేదు. వారినుంచి సెల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నట్టు అనంతరం బీబీసీ ట్వీట్ చేసింది. గుజరాత్‌లో గోద్రా అనంతర అల్లర్లకు అప్పట్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న మోదీయే నేరుగా బాధ్యుడంటూ జనవరిలో బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ పెను వివాదానికి దారి తీయడం, దాన్ని కేంద్రం నిషేధించడం తెలిసిందే.

మండిపడ్డ విపక్షాలు

బీబీసీ కార్యాలయాల్లో ఐటీ సర్వేలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. మోదీ ప్రభుత్వం నిత్యం పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ఇది కచ్చితంగా బెదిరింపు చర్యేనని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. వినాశకాలం దాపురించినప్పుడు ఇలాంటి విపరీత బుద్ధులే పుడతాయంటూ ధ్వజమెత్తారు. కేంద్రం తీరు నియంతృత్వానికి పరాకాష్ట అని సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ దుయ్యబట్టాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు 'ప్రేమికుల రోజు సర్వే'లకు దిగాయంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఎద్దేవా చేశారు. ''ఇదే ఊపులో ఐటీ, సెబీ, ఈడీ తదితరాలన్నీ కలసి కేంద్రానికి అత్యంత ప్రియుడైన మిస్టర్ ఎ సంస్థలపైనా ఇలాంటి సర్వేలు చేస్తే ఎలా ఉంటుంది!'' అని అదానీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. బీబీసీ ఆఫీసుల్లో ఐటీ సర్వేలతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా పేర్కొంది. పాలక వర్గం పట్ల విమర్శనాత్మకంగా ఉండే మీడియా సంస్థలను వేధించే ధోరణికి ఇది కొనసాగింపని ఒక ప్రకటనలో విమర్శించింది.

నిశితంగా గమనిస్తున్నాం: బ్రిటన్

తాజా పరిణామాలు బ్రిటన్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సర్వేకు బీబీసీ డాక్యుమెంటరీతో సంబంధముందన్న భావన బ్రిటన్ ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అధికారికంగా స్పందించకపోయినా, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు అవి పేర్కొన్నాయి. ఇవి కచ్చితంగా కక్షసాధింపు ధోరణితో కూడిన వేధింపు చర్యలేనని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లీడింగ్ ఆథర్ డాక్టర్ ముకులికా బెనర్జీతో పాటు బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల సంస్థ సౌత్ ఏషియా సాలిడారిటీ గ్రూప్ కూడా విమర్శించింది. వీటిని తక్షణం ఆపాలని డిమాండ్ చేసింది. అయితే, వార్తా సంస్థ ముసుగులో సామ్రాజ్యవాదులతో చేతులు కలిపిన బీబీసీ భారత్‌లో కచ్చితంగా ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని గ్లోబల్ హిందూ ఫెడరేషన్ చైర్‌పర్సన్ సతీశ్ శర్మ ఆరోపించారు.

బీబీసీ, కాంగ్రెస్ కుమ్మక్కు: బీజేపీ

మీడియా ముసుగులో భారత్‌పై బీబీసీ నిత్యం విషం కక్కుతోందని బీజేపీ ధ్వజమెత్తింది. దాన్ని అత్యంత అవినీతిమయమైన సంస్థగా అభివర్ణించింది. బీబీసీ తప్పుడు ప్రచారం, కాంగ్రెస్ అజెండా చెట్టాపట్టాలుగా సాగుతున్నాయని ఆరోపించింది. దర్యాప్తు సంస్థలను తమ పని చేసుకోనివ్వాలని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. బీబీసీని నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ కూడా నిషేధించారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం పట్ల బీబీసీ వార్తా సంస్థకు ఏ మాత్రం గౌరవం లేదంటూ మండిపడ్డారు.

అమెరికా అధ్యక్ష రేసులో నిక్కీ హేలీ



వాషింగ్టన్: అమెరికాలో భారతీయ మూలాలున్న మహిళా నాయకురాలు, దక్షిణ కరోలినా మాజీ గవర్నర్, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ వచ్చే ఏడాది జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్నారు. 51 ఏళ్ల నిక్కీ మంగళవారం ఒక వీడియో సందేశంలో ఈ ప్రకటన చేశారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి సొంత పార్టీ నేత, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాల్ చేసిన తొలి వ్యక్తిగా నిలిచారు. 'ప్రెసిడెంట్ ఎన్నికల బరిలో అడుగుపెట్టా. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం, సరిహద్దు రక్షణ, దేశాన్ని మరింత శక్తివంతం చేయడం, సమున్నత స్థానంలో నిలపడం కోసం నవ్య నాయకత్వం సారథ్యం వహించాల్సిన సమయమొచ్చింది. వలస వచ్చిన భారత కుటుంబం నుంచి వచ్చిన కూతురుగా గర్వపడతాను. నలుపు కాదు. తెలుపు కాదు. నేనింకా భిన్నం' అని నిక్కీ వ్యాఖ్యానించారు. ట్రంప్ విధానాలను ఆయన హయాంలోనే తప్పుబట్టిన నిక్కీ.. ట్రంప్‌కు సరైన యువ ప్రత్యామ్నాయంగా తనను తాను అభివర్ణించుకున్నారు. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్, దేశ మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, మైక్ పాంపియో, టిమ్ స్కాట్ తదితర రిపబ్లికన్ నేతలూ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడే అవకాశముంది. బాబీ జిందాల్ (2016), ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ (2020) తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిత్వం కోసం పోటీపడిన మూడో భారతీయ అమెరికన్‌గా నిక్కీ నిలిచారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎన్నిక ప్రక్రియ 2024 జనవరిలో మొదలవుతుంది.

పంజాబ్ నుంచి వలసవచ్చి..

పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి 1960ల్లో కెనడా వలస వచ్చిన సిక్కు దంపతులు అజిత్ సింగ్ రణ్‌ధావాలా, రాజ్ కౌర్ రణ్‌ధావాలాలకు జన్మించిన నిక్కీ పూర్తి పేరు నిమ్రతా నిక్కీ రణ్‌ధావాలా. వారి కుటుంబం కెనడాకు అక్కడి నుంచి అమెరికా వెళ్లింది. 2011 జనవరిలో 39 ఏళ్లకే గవర్నర్ పదవి చేపట్టి అమెరికాలో ఆ పదవి చేపట్టిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిక్కీ చరిత్ర సృష్టించారు. దక్షిణ కరోలినా తొలి మహిళా గవర్నర్‌గా, రెండు సార్లు ఆమె బాధ్యతలు కొనసాగించి రికార్డు నెలకొల్పారు. దాదాపు రెండేళ్లపాటు ఐరాసలో అమెరికా రాయబారిగా ఉన్నారు.

అదానీపై దాచేదేమీ లేదు
భయపడాల్సిన పనీ లేదు: అమిత్ షా

అగర్తల (త్రిపుర): పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఆస్తులకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదిక రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తొలిసారిగా పెదవి విప్పారు. అదానీ అంశంలో తాము భయపడుతున్నది కానీ, దాస్తున్నది కానీ ఏమీ లేదన్నారు. అయితే ఈ వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉండడంతో కేంద్ర మంత్రిగా తానిప్పుడేమీ మాట్లాడకూడదని మంగళవారం ఏఎన్ఐ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో అన్నారు. బీజేపీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తోందన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణల్ని కొట్టిపారేశారు. కాంగ్రెస్ హయాంలోనే రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుందని ఎవరైనా భావిస్తే కోర్టులను ఆశ్రయించాలన్నారు. విపక్షాలు ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. మోదీపై కుట్రలు జరిగిన ప్రతీసారి ఆయన మరింత బలం పుంజుకుని ప్రజాదరణ పొందుతున్నారన్నారు

మరి భయమెందుకు?: కాంగ్రెస్

అదానీ ఉదంతంలో దాయటానికేమీ లేకుంటే కేంద్రం ఎందుకు భయపడుతోందని, జేపీసీ విచారణకు ఆదేశించకుండా ఎందుకు పారిపోతోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ అవకతవకలు కేంద్రాన్నే వేలెత్తి చూపుతున్నాయని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు.

హత్యచేసి ఫ్రిజ్‌లో దాచేసి..
ప్రేమికుల దినోత్సవం రోజే ఢిల్లీలో వెలుగుచూసిన దారుణం



న్యూఢిల్లీ: తనను ప్రేమించి మరో యువతిని ఎందుకు పెళ్లాడుతున్నావని నిలదీసినందుకు ప్రాణంతీశాడో దుర్మార్గుడు. చంపేసి ఊళ్లోని తన ధాబాలో ఉన్న రిఫ్రిజిరేటర్‌లో దాచాడు! రెండు, మూడు రోజుల క్రితం జరిగిన ఈ హత్యోదంతం ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) రోజే వెలుగు చూడటం గమనార్హం. ఢిల్లీ పోలీసులు మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం నైరుతి ఢిల్లీలోని మిత్రోన్ గ్రామానికి చెందిన సాహిల్ గెహ్లాట్ గత కొన్ని సంవత్సరాలుగా నిక్కీ యాదవ్ అనే యువతితో సహజీవనంలో ఉన్నాడు. 2018 జనవరిలో ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వీరికి పరిచయం ఏర్పడి అది ప్రేమకు, తర్వాత సహజీవనానికి దారితీసింది. అప్పటి నుంచి సొంతూళ్లలో ఇంట్లో వాళ్లకు తెలీకుండా ఢిల్లీలో సహజీవనం చేస్తున్నారు. అయితే ఇటీవల గెహ్లాట్ తల్లిదండ్రులు అతడికి వేరే అమ్మాయితో వివాహం నిశ్చయించారు. విషయం తెల్సుకున్న నిక్కీ అతడిని నిలదీసింది. మరొకరిని పెళ్లాడితే వేరే కేసులో ఇరికిస్తానని బెదిరించింది. వీరిద్దరినీ ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి గెహ్లాట్ కారులో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన గెహ్లాట్ కారులో మొబైల్ ఫోన్ డేటా కేబుల్‌తో అమ్మాయిని గొంతు నులిమి చంపేసి తన ధాబాలోని రిఫ్రిజిరేటర్‌లో దాచి అదే రోజు వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. నిందితుడు గెహ్లాట్‌ను ఢిల్లీ దగ్గర్లోని కయిర్ గ్రామంలో అరెస్ట్‌చేశామని పోలీస్ స్పెషల్ కమిషనర్ చెప్పారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు.

ఏరో షోలో అమెరికా బాంబర్ జెట్ బీ1బీ



బెంగళూరు: బెంగళూరులో ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా గగనతలంలో ప్రత్యేక అతిథి వచ్చి చక్కర్లు కొట్టింది. అమెరికాకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానం బీ-1బీ లాన్సర్ బాంబర్ జెట్ మంగళవారం బెంగళూరు శివారులోని యెలహంక ఎయిర్‌బేస్ వినువీధులో వీక్షకులకు కనువిందు చేసింది. అమెరికా సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించడంలో వాయుసేనకు వెన్నుముకగా నిలుస్తున్నందుకు గుర్తుగా దీనిని 'ది బోన్' అని పిలుస్తారు. 'ఇరు దేశాల వైమానిక దళాల అద్భుత అంతర్గత సంయుక్త నిర్వహణ వ్యవస్థకు బీ-1బీ బాంబర్ సానుకూలతను మరింత పెంచింది' అని అమెరికా ఎయిర్‌ఫోర్స్ మేజర్ జనరల్ జూలియన్ చీటర్ వ్యాఖ్యానించారు. 'భారత్, అమెరికా రక్షణ భాగస్వామ్యం మరింతగా బలోపేతమవుతోంది. సంయుక్తంగా పనిచేస్తే రెండు దేశాల సైన్యాలు ఇంకా శక్తివంతమవుతాయి' అని ఢిల్లీలో అమెరికా ఎంబసీలో ఆ దేశ రియర్ అడ్మిరల్ మైఖేల్ బేకర్ అన్నారు. కాగా, సోమవారం అమెరికా ఐదోతరం సూపర్‌సోనిక్ ఎఫ్-35ఏ యుద్ధ విమానం ఈ వైమానిక ప్రదర్శనలో పాలుపంచుకున్న విషయం విదితమే. ఎఫ్35ఏ భారత్‌లో ల్యాండ్ అవడం ఇదే తొలిసారికావడం విశేషం. బీ-1బీ బాంబర్ మాత్రం 2021 ఫిబ్రవరిలోనూ ఎయిర్‌షోలో పాల్గొంది.

పుల్వామా అమర జవాన్లకు ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని మోదీ మంగళవారం నివాళులర్పించారు. 'వారి అత్యున్నత త్యాగాన్ని ఎప్పటికీ మరువలేం. వారి ధైర్య సాహసాలు అభివృద్ధి చెందిన, బలమైన దేశాన్ని నిర్మించడానికి మనల్ని ప్రేరేపిస్తాయి' అంటూ ట్వీట్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా పుల్వామా అమరులకు నివాళులర్పించారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14వ తేదీన సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు నేలకొరిగారు. ప్రతిగా భారత వైమానిక దళం పాకిస్తాన్‌లో బాలాకోట్‌లో ఉన్న ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం తెలిసిందే.

బీజేపీకి రూ.614 కోట్లు..కాంగ్రెస్‌కు రూ.94 కోట్లు
2021-22లో పార్టీలకందిన విరాళాలను వెల్లడించిన ఏడీఆర్

న్యూఢిల్లీ: 2021-22లో బీజేపీకి రూ.614 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.95 కోట్లు విరాళాల రూపంలో అందాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) నివేదిక ఈ మేరకు వెల్లడించింది. 2020-21తో పోలిస్తే పార్టీలు అందుకున్న విరాళాల మొత్తం 31.50% మేర పెరిగిందని వివరించింది. ఇదే సమయంలో బీజేపీ విరాళాల్లో రూ.28.71%, కాంగ్రెస్ విరాళాల్లో 28.09% పెరుగుదల కనిపించిందని పేర్కొంది.

బాల్యం శిథిలం

తుర్కియే, సిరియాలో 70 లక్షలకు పైగా పిల్లలపై ప్రభావం • యునిసెఫ్ అంచనాలు

అమ్మ పొత్తిళ్లలో హాయిగా పడుకోవాల్సిన అభం శుభం తెలియని పసికందులు అందరినీ కోల్పోయి అనాథలుగా మారుతున్నారు. ఎందుకీ విపత్తు ముంచుకొచ్చిందో తెలీక నిలువ నీడ లేక ఎందుకు రోడ్లపైకొచ్చామో అర్థం కాక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తుర్కియే, సిరియాల్లో సంభవించిన భారీ భూకంపం ఎందరో చిన్నారుల్ని అనాథల్ని చేసింది. వీరిలో చాలా మంది రోజుల పసికందులే. ఇప్పటికే అంతర్యుద్ధంతో అల్లాడిపోతున్న సిరియాలో భూకంపం పిల్లల నెత్తిన పిడుగుపాటులా మారింది. ప్రకృతి వైపరీత్యాలు, అధికార కాంక్షతో మానవులు చేస్తున్న యుద్ధాలు చిన్నారులకు ఎలా శాపంగా మారుతున్నాయి..?

\- సాక్షి, నేషనల్ డెస్క్



తుర్కియే భూకంపంలో శిథిలాల మధ్యే ఒక పసిపాప భూమ్మీదకొచ్చింది. బిడ్డకి జన్మనిచ్చిన ఆ తల్లి ప్రాణాలు కోల్పోవడంతో పుడుతూనే అనాథగా మారింది. అయా (అరబిక్ భాషలో మిరాకిల్) అని పేరు పెట్టి ప్రస్తుతానికి ఆస్పత్రి సిబ్బందే ఆ బిడ్డ ఆలనా పాలనా చూస్తున్నారు. ఈ రెండు దేశాల్లో సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉంటే ఎక్కువగా పిల్లలే శిథిలాల కింద నుంచి ప్రాణాలతో బయటకి వస్తున్నారు. 10 రోజుల నుంచి 14 ఏళ్ల వయసున్న వారి వరకూ ప్రతీ రోజూ ఎందరో పిల్లలు ప్రాణాలతో బయటకి వస్తున్నారు. వారంతా తల్లిదండ్రులు, బంధువుల్ని కోల్పోయి అనాథలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఈ చిన్నారులకు అండగా యునిసెఫ్ బృందం తుర్కియే చేరుకుంది. తుర్కియేలో 10 ప్రావిన్స్‌లలో 46 లక్షల మంది చిన్నారులపై ప్రభావం పడిందని యూనిసెఫ్ అధికార ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ చెప్పారు.

సిరియాలో బాలల దురవస్థ

పన్నెండేళ్లుగా అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న సిరియాలో ఇప్పటికే చిన్నారులు దారుణమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. యుద్ధ వాతావరణంలో గత పదేళ్లలో సిరియాలో 50 లక్షల మంది జన్మిస్తే వారిలో మూడో వంతు మంది మానసిక సమస్యలతో నలిగిపోతున్నారు. బాంబు దాడుల్లో ఇప్పటికే 13 వేల మంది మరణించారు. పులి మీద పుట్రలా ఈ భూకంపం ఎంత విలయాన్ని సృష్టించిందంటే 25 లక్షల మంది పిల్లల జీవితాలను అల్లకల్లోలం చేసినట్టుగా యూనిసెఫ్ అంచనా వేస్తోంది. ఇంతమందికి సరైన దారి చూపడం సవాలుగా మారనుంది.

బలిపీఠంపై బాలలు (సగటున ఏడాదికి)	
అనాథలు	17.5 కోట్లు
నిరక్షరాస్యులు	10.4 కోట్లు
శరణార్థులు	3.6 కోట్లు
బాల కార్మికులు	20 కోట్లు
యుద్ధవాతావరణంలో ఉన్న పిల్లలు	44.9 కోట్లు

పిల్లల భవిష్యత్తుకి చేయాల్సింది ఇదే.!

ప్రపంచవ్యాప్తంగా చిన్నారుల విద్య, సంక్షేమం కోసం కృషి చేసే ఐక్యరాజ్యసమితి సంస్థ యునిసెఫ్ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు జరిగే ప్రాంతాలు, కరువు, పేదరికం ఎదుర్కొనే దేశాల్లో పిల్లలకి భద్రమైన భవిష్యత్ కోసం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించింది...

- ప్రభుత్వాలు యూనివర్సల్ క్యాష్ బెనిఫిట్ స్కీమ్‌లతో పిల్లలకు ప్రతి నెలా ఆదాయం వచ్చేలా చూడాలి.
- శరణార్థులు సహా అవసరంలో ఉన్న పిల్లలందరికీ సామాజిక సాయం అందేలా చర్యలు చేపట్టాలి.
- ప్రకృతి వైపరీత్యాల ముప్పున్న ప్రాంతాలతో పాటు, ఇతర ఘర్షణాత్మక ప్రాంతాల్లో సంక్షేమ వ్యయాన్ని వీలైనంత వరకు పరిరక్షించాలి.
- పిల్లల చదువులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు బడి బాట పట్టేలా చర్యలు తీసుకోవాలి.
- మాత శిశు సంరక్షణ, పోషకాహారం అందించడం.
- బాధిత కుటుంబాలకు మూడు పూటలా కడుపు నిండేలా నిత్యావసరాలపై ధరల నియంత్రణ ప్రవేశపెట్టాలి.

చిన్నారులపై పడే ప్రభావాలు

- ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి విపత్తులతో ప్రభావానికి లోనయ్యే పిల్లల సంఖ్య సగటున ఏడాదికి 17.5 కోట్లుగా ఉంటోందని యునెస్కో గణాంకాలు చెబుతున్నాయి.
- ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలతో ఒంటరైన పిల్లలు ఎన్నో శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. కుటుంబానికి దూరంగా ఉండడం వల్ల వారిలో పెరుగుదల ఆరోగ్యంగా ఉండదు. ఇలా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారు పుట్టకొకరు చెట్టుకొకరుగా మారిన పిల్లల్లో 18% వరకు ఉంటారు.
- 50% మంది పిల్లలు మానసిక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. భూకంపం వంటి ముప్పులు సంభవించినప్పుడు గంటల తరబడి శిథిలాల మధ్య ఉండిపోవడం వల్ల ఏర్పడ్డ భయాందోళనలు వారిని చాలా కాలం వెంటాడుతాయి.
- సమాజంలో ఛీత్కారాలు దోపిడీ, దూషణలు, హింస ఎదుర్కొంటారు. బాలికలకు ట్రాఫికింగ్ ముప్పు!
- తుఫాన్లు, వరదలు, భూకంపాల వల్ల ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు.
- 2021లో ప్రకృతి వైపరీత్యాలు, ఉక్రెయిన్ వంటి యుద్ధాల కారణంగా 3.7 కోట్ల మంది పిల్లలు చెట్టుకొకరు పుట్టకొకరుగా మారారు.

న్యూజిలాండ్‌లో వరద విలయం



గేబ్రియెల్ తుపాను, భారీ వర్షాల ధాటికి న్యూజిలాండ్‌లోని నేపియర్ సిటీలో ఉధృతంగా ప్రవహిస్తున్న టుకేకురి నది. తుపాను సంబంధ ఘటనల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, రోడ్లు పాడై లక్ష మందికిపైగా జనం తిప్పలుపడుతున్నారు. దీంతో ఆ దేశం ఎమర్జెన్సీ ప్రకటించింది.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023

పళనిలో సమంత మెట్లపూజ



తమిళ సినిమా: నటి సమంత సోమవారం పళని కుమారస్వామి ఆలయంలో పూజలు చేశారు. 600 మెట్లకు కర్పూర హారతులు ఇచ్చి నడుచుకుంటూ స్వామి దర్శనికి వెళ్లారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న తాను ఇప్పుడిప్పుడే దైవకృపతో, వైద్యుల సూచనలతో మెరుగు పడుతున్నట్లు చెప్పారు. మొక్కు చెల్లించుకోవడానికి ఆలయానికి వచ్చినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

330 ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలు



మంత్రి శేఖర్‌బాబు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని 330 శివాలయాల్లో రెండురోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. వీటిలో ఐదు ఆలయాలో బ్రహ్మోత్సవాల తరహాలో ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం దేవదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు జారీ చేశారు. రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని ప్రముఖ శివాలయాల్లో 18,19 తేదీలలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అన్నిచోట్లా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, శివ పారాయణం చేపట్టనున్నామన్నారు. అలాగే మైలాపూర్ కపాళీశ్వర ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయం, పోరూర్ పట్టీశ్వరర్ ఆలయం, తిరునల్వేలి నెలయ్యప్పర్ ఆలయంల్లో మాసి శివరాత్రి ఉత్సవాలకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మాజీ మంత్రి జయకుమార్‌కు సుప్రీం కోర్టు నోటీసులు

సాక్షి, చెన్నై: మాజీ మంత్రి, అన్నాడీఎంకే నాయకుడు డి. జయకుమార్‌కు మంగళవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వివరాలు.. జయకుమార్‌పై ఆయన బంధువు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది కేసు నమోదైన విషయం తెలిసిందే. స్థలం కబ్జా కేసులో జయకుమార్ ఆయన కుమార్తె జయశ్రీ, అల్లు నవీన్‌కుమార్‌ను గతంలో అరెస్టు కూడా చేశారు. ఈ కేసులో బెయిల్ మీద వీరంతా తర్వాత బయటకు వచ్చారు. అలాగే కోర్టును ఆశ్రయించి కేసు రద్దు చేయించుకున్నారు. పోలీసులు దాఖలు చేసిన కేసును హైకోర్టు రద్దు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లింది. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై వివరణ ఇవ్వాలని జయకుమార్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. తర్వాత విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేశారు.

నెల్లై వరకే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్

- నాలుగు రోజుల పాటు పలు రైళ్ల వేళల్లో మార్పు

తిరువొత్తియూరు: డబుల్ డెక్కర్ రైలు మార్గం పనుల కారణంగా తిరువనంతపురం ఇంటర్ సిటీ రైలు బుధవారం నుంచి నెల్లై వరకే నడుపుతామని అధికారులు మంగళవారం వెల్లడించారు. కన్యాకుమారి జిల్లా కులితురై – ఇరానియల్ రైల్వే స్టేషన్ వరకు డబుల్ రైలు మార్గానికి సంబంధించిన రైలు పట్టాల పనులు బుధవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు చేపడుతామన్నారు. ఈ మేరకు కొల్లలం – కన్యాకుమారి మెమో రైలు, పునలూరు – నాగర్ కోయిల్ రైలు, కన్యాకుమారి పునలూరు సహా కొన్ని రైళ్లు రెండు రోజులకు పూర్తిగా రద్దు చేశామన్నారు. తిరుచ్చి నుంచి తిరువనంతపురం వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ 22627 మాత్రం నెల్లై వరకే నడుస్తుందన్నారు. అలాగే కన్యాకుమారి – బెంగళూరు జలకండా ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి– పూణే ఎక్స్‌ప్రెస్ రైళ్ల రూట్ మ్యాప్ కూడా మారిందని పేర్కొన్నారు.

మద్రాసు ఐఐటీలో కలకలం

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి
ఆస్పత్రి పాలైన మరో స్టూడెంట్



సాక్షి, చెన్నై: మద్రాసు ఐఐటీలో సోమవారం రాత్రి కలకలం రేగింది. ఓ విద్యార్థి ఉరి వేసుకున్న స్థితిలో అనుమానాస్పదంగా మరణించడం, మరో విద్యార్థి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించడంపై పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు.. దేశంలోని అత్యుత్తమ విద్యా సంస్థల జాబితాలో ఉండే ఐఐటీలో తరచూ విద్యార్థుల బలన్మరణాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా మహారాష్ట్రకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థి రూవన్ సన్ని అల్బర్ట్(25) సోమవారం రాత్రి మహతి హాస్టల్‌లోని తన గదిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సమాచారంతో అక్కడి విద్యార్థులలో ఆందోళన నెలకొంది. స్థానిక పోలీసులు ఆ హాస్టల్‌కు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. రెండు నెలలుగా ఈ విద్యార్థి తరగతులకు సరిగ్గా హాజరు కాక పోవడం, పరిశోధన, శిక్షణ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు తేలింది. తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు తెలుస్తోందని సహచర విద్యార్థులు పేర్కొన్నారు. అయినా పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా విచారణ జరుపుతున్నారు. కాగా ఈ కలకలం సద్దుమనిగే లోపు సమీపంలోని మరో హాస్టల్ లో కర్ణాటకకు చెందిన వీరేష్(25) ఆత్మహత్యాయత్నం చేయడం సంచలనంగా మారింది. ఇతడు అధిక మోతాదులో మాత్రులు మింగినట్లు విచారణలో వెలుగు చూసింది. అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



విద్యుత్ వాహనాలదే.. భవిష్యత్

''వాహనాలు, వాటి విడిభాగాల తయారీలో దేశంలోనే మనరాష్ట్రం అగ్రస్థానంలో దూసుకెళ్తోంది. ఈ పరంపరను భవిష్యత్‌లోనూ కొనసాగించేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇకపై ఎలక్ట్రిక్ వాహనాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నాం. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల సౌకర్యం, ఇష్టాలకు కూడా తగిన గుర్తింపు ఇచ్చేలా ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని రూపొందించాం.'' అని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు.

- ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ– 2023ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- రానున్న ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు పెట్టుబడులు
- 1.50 లక్షల మందికి ఉద్యోగాల కల్పనకు చర్యలు
- భవిష్యత్ లక్ష్యాలను వెల్లడించిన సీఎం స్టాలిన్



ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ ప్రతులను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై: భవిష్యత్ భారతం.. ఎలక్ట్రిక్ వాహనాలదే అని ముఖ్యమంత్రి స్టాలిన్ అభిప్రాయపడ్డారు. దేశానికి దిక్సూచీగా తమిళనాడు దూసుకెళ్తున్న తరుణంలో వాహనాల తయారీలో కీలక మార్పులు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. మంగళవారం ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ– 2023ని సచివాలయంలో ఆవిష్కరించిన సందర్భంగా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా పరిశ్రమలో సవాళ్లు, భిన్నమైన విధి విధానాలను పరిగణనలోకి తీసుకుని ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. తమిళనాడులో పర్యావరణ వ్యవస్థను పరిరక్షించేందుకు గాను.. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశామన్నారు. దీన్ని ఐదేళ్ల లక్ష్యంతో అమలు చేయడానికి నిర్ణయించారు. ఈ కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో రూ. 50 వేల కోట్లుపెట్టుబడులు, 1.50 లక్షల ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపట్టానున్నారు.

పాలసీలో ప్రోత్సాహకాలు ఇవే..

తమిళనాడు ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీలో భాగంగా పలు మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రకటించింది. విద్యుదీకరణ, స్మార్ట్ ప్రజా రవాణా ప్రాజెక్టులు, మొబిలిటీ స్కీమ్‌లకు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఈ రంగంలో సేవా పన్ను వాపస్, క్యాపిటల్ గ్రాంట్, టర్నోవర్ మంజూరు ఆధారిత గ్రాంట్, స్పెషల్ అడ్వాన్స్‌డ్ బ్యాటరీ కెమిస్ట్రీ తదితర ప్రోత్సాహకాలు అందించనున్నారు. అలాగే విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు, పబ్లిక్ బ్యాటరీ సంస్థలకు ప్రోత్సాహకాలు, రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు, పర్మిట్ రుసుము వంటివి మినహాయించనున్నారు. ఈ–ఆటోల రిజిస్ట్రేషన్ల విషయంలో నిబంధనలను 31.12.2025 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. వాణిజ్య అనుమతులు, విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు మూలధనంలో రాయితీ, కెపాసిటీ బిల్డింగ్, కొత్త బిల్డ్‌లు, ఇప్పటికే ఉన్న ప్లాట్లు, సెటిల్‌మెంట్లు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించనుందని పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థను పరిరక్షించేందుకు ఈ–వాహనాల పారిశ్రామిక పార్కులు, విక్రేత పర్యావరణం ఏర్పాటు, అభివృద్ధి, ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వెహికల్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడం, ప్రత్యేకంగా ఆటోమోటివ్ సపోర్ట్ సర్వీసెస్ విభాగం నెలకొల్పడం, చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై, సేలం, తిరునల్వేలి వంటి నగరాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టారు. ఇందు కోసం ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో వివిధ విభాగాల కార్యదర్శులు సభ్యులుగా ఎలక్ట్రిక్ వెహికల్ డైరెక్టివ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాగా కొత్త వెహికల్ పాలసీ ఎలక్ట్రిక్ వాహన రంగంలో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలకు ఎంతో ఉపయోగకరమని, వాటిని ఆయా సంస్థల నిర్వాహకులు వినియోగించుకోవాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇన్వెస్టర్లకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్

అమరుల త్యాగాలు మరువలేనివి..



అమర వీరుల స్మారక మందిరం, స్థూపాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరిస్తున్న సీఎం

అనంతరం చెన్నై గిండిలోని గాంధీ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమరయోధులు వీర పాండియ కట్టబొమ్మన్, మరుదు పాండియర్లు, చిదంబరనార్ తదితరులకు విగ్రహాలను సీఎం మంగళవారం ఆవిష్కరించారు. తమిళాభివృద్ధి, సమాచార శాఖల నేతృత్వంలో రూ. 95 లక్షల వ్యయంతో వీటిని ప్రతిష్ఠించినట్లు వెల్లడించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తమిళనాడులో పోరాటాలు సాగించిన అమరులను స్మరించుకునే విధంగా, వారి త్యాగాలను గుర్తు చేస్తూ ఈ విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, వెల్ల కోయిల్ స్వామినాథన్, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుప్పూర్ జిల్లా పెరుంగమనల్లూరులో రూ.1.47 కోట్లతో నిర్మించిన అమర వీరుల స్తూపాన్ని, స్మారక మందిరాన్ని సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.

ప్రతీకార రాజకీయాలతో సాధించేదేమీ లేదు..

- ప్రధాని మోదీ పార్లమెంట్ ప్రసంగంపై మండిపడిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: మీలో ఒకడిని కార్యక్రమంలో భాగంగా సీఎం స్టాలిన్ ట్విట్టర్ ద్వారా తనకు వచ్చిన ప్రశ్నలకు మంగళవారం సమాధానం ఇచ్చారు. ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్ గేమింగ్ విషయంగా వచ్చిన ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవిని ఉద్దేశించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని, అసెంబ్లీని గవర్నర్ అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆన్‌లైన్ రమ్మీ నిషేధ చట్టం అమలుకు ఆమోదం తెలిపేందుకు మరెన్ని ప్రాణాలు బలి తీసుకోబోతున్నారు..? అని ప్రశ్నించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పనితీరును విమర్శిస్తూ మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రతి పక్షాలను బెదిరించేందుకే ఈ సంస్థ ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వేదికగా చేసిన ప్రసంగంపై సీఎం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంధించిన ఒక్క ప్రశ్నకు కూడా ప్రధాని సమాధానం ఇవ్వక పోవడం శోచనీయమని విమర్శించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థల ద్వారా బెదిరింపులు పాల్పడుతున్న మోదీకి త్వరలో గుణపాఠం చెప్పే రోజులు రానున్నాయని అభిప్రాయపడ్డారు. దర్యాప్తు సంస్థల వల్లే ప్రతిపక్షాలు ఏకమయ్యాయని ప్రధాని పేర్కొనడం దారుణమన్నారు. ఈ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా ప్రతీకార రాజకీయాలకు కేంద్రం పాల్పడుతోందనే విషయాన్ని ప్రధాని అంగీకరించట్లయ్యిందని ఆరోపించారు. స్వార్థ, ప్రతీకార రాజకీయాలతో సాధించేదేమీ లేదని, ఇలాంటివి ప్రజాస్వామ్యానికి మంచివి కాదని స్టాలిన్ హితవుపలికారు.

కేసు నమోదైనా.. విచారణ ఆపొద్దు!

- భూ నకిలీ పత్రాల వ్యవహారంపై హైకోర్టు కీలక ఆదేశాలు
- జిల్లా రిజిస్ట్రార్ పిలిచినప్పుడు వెళ్లాల్సిందేనని పిటిషనర్‌కు సూచన

సాక్షి, చెన్నై: భూముల అక్రమాలకు సంబంధించిన విచారణ కోర్టుల్లో సాగుతున్నా.. నకిలీ పత్రాలకు సంబంధించిన దర్యాప్తును మాత్రం ఆపొద్దని జిల్లా రిజిస్ట్రార్‌లను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లోని బాధితులు జిల్లా రిజిస్ట్రార్‌లకు ఫిర్యాదు చేసి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కూడా కోరవచ్చని న్యాయమూర్తి సురేష్‌కుమార్ బెంచ్ స్పష్టం చేసింది. వివరాలు.. చెంగల్పట్టులో గత ఎనిమిదేళ్లలో 9 నకిలీ పత్రాలను సృష్టించి కొందరు స్థలాలను కబ్జా చేశారని పేర్కొంటూ నటేషన్ అనే వ్యక్తి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా హరినాథ్ అనే వ్యక్తికి జిల్లా రిజిస్ట్రార్ నోటీసులు పంపించారు. దీనిని వ్యతిరేకిస్తూ హరినాథ్ కోర్టును ఆశ్రయించారు. అలాగే ఈ స్థల వ్యవహారాలకు సంబంధించిన కేసు కింది కోర్టుల్లోనూ విచారణ దశలో ఉందని పేర్కొన్నారు. ఈ కారణంగా రిజిస్ట్రార్ చేపట్టిన దర్యాప్తు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో నకిలీ పత్రాలపై విచారణకు త్వరితగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నటేషన్ కోర్టు తలుపు తట్టారు. ఈ పిటిషన్ల విచారణ మంగళవారం న్యాయయూర్తి సురేష్‌కుమార్ బెంచ్ ముందుకు వచ్చింది. నటేషన్ దాఖలు చేసిన ఈ స్థల వివాదం కేసు మరో కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తాజాగా హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఇలాంటి వివాదాలకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతున్నా... క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసే అధికారం అధికారం జిల్లా రిజిస్ట్రార్లకు ఉందని స్పష్టం చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి విచారణకు రావాల్సిందేనని, రిజిస్ట్రార్ నోటీసులు ఇవ్వడంలో తప్పులేదని తేల్చింది. జిల్లా రిజిస్ట్రార్ పిలిచినప్పుడు వెళ్లి వివరణ ఇవ్వాలని పిటిషనర్ హరినాథ్‌కు సూచించారు. రెండు వారాల్లోగా ఈ తతంగం పూర్తి కావాలని స్పష్టం చేసింది.



హైకోర్టు

ఏటీఎంల భద్రతపై డీజీపీ సమీక్ష

- పోలీసు స్టేషన్లకు అలారం అనుసంధానం
- అదనంగా రహస్య కెమెరాల ఏర్పాటు చేయాలి
- బ్యాంకర్లకు డీజీపీ ఆదేశాలు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ శైలేంద్రబాబు

సాక్షి, చెన్నై: ఏటీఎం సెంటర్లలోని అలారాన్ని ఆయా ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లతో అనుసంధానించాలని బ్యాంక్ అధికారులకు డీజీపీ శైలేంద్రబాబు ఆదేశించారు. తిరువణ్ణామలైలో ఒకే రోజు రాత్రి నాలుగు ఏటీఎంలలో జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించిన విచారణ పోలీసులకు సవాల్‌గా మారింది. చడీ చప్పుడు కాకుండా కొత్త మార్గాన్ని, సాంకేతికతను అనుసరించి ఒకే ముఠా రాత్రికి రాత్రే రూ.75 లక్షలు అపహరించి ఉండాయించడం బ్యాంక్ అధికారులను కలవరంలో పడేసింది. ఈ కేసు విచారణకు పొరుగు రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల పోలీసుల సాయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన జరిగిన రోజున ఆ మార్గంలో ఆగి ఉన్న ఓ కారు కేరళకు చెందినదిగా తేలడంతో విచారణ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏటీఎంల భద్రతపై ప్రశ్నలు తలెత్తాయి. దీంతో ఆయా బ్యాంక్‌లకు చెందిన 51 మంది అధికారులతో డీజీపీ శైలేంద్రబాబు సోమవారం పొద్దుపోయే వరకు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏటీఎంలు, బ్యాంక్‌ల భద్రతపై సమీక్షించారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ లేకపోవడంపై ఆయా బ్యాంకర్ల వద్ద డీజీపీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇకపై ఏటీఎంలలోని అలారాన్ని ఆయా ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లకు అనుసంధానించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రస్తుత పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే, ఏటీఎంలలో రహస్యంగా మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఫేషియల్ రికగ్నేషన్ సాఫ్ట్‌వేర్‌తో కూడిన కెమెరాలను అమర్చాలని, ఏదైనా ఏటీఎం పనిచేయకున్నా, సాంకేతిక సమస్య తలెత్తినా, తక్షణం ఆయా ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని డీజీపీ ఆదేశించారు.

కి'లేడీ'

- 15 మందిని పెళ్లి చేసుకున్న మహిళ
- నగలు, నగదుతో పరార్

అన్నానగర్: కడలూరు జిల్లా బన్‌రూటి సమీపంలోని వాణియంపాళయం గ్రామానికి చెందిన అరుల్‌రాజ్ (25) చెరుకు కార్మికుడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువతిని ప్రేమించి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. మొదట్లో వీరి జీవితం సాఫీగా సాగింది. అరుల్‌రాజ్ చెరుకు నరికే పనుల కోసం పలు ప్రాంతాలకు వెళ్లేవాడు.. ఆ సమయంలో ఆ మహిళ తన బంధువుల వద్దకు వెళుతున్నానంటూ చెప్పి వెళ్లిపోయేది. ఈక్రమంలో 3 నెలల క్రితం అరుల్‌రాజ్ తన చెల్లెలు పెళ్లి కోసం 7 సవర్ల నగలు, రూ.90 వేల నగదు ఇంట్లో ఉంచాడు. ఈ డబ్బును తీసుకుని అరుల్‌రాజ్ భార్య వెళ్లిపోయింది. ఎన్ని రోజులకూ రాకపోవడంతో గతంలో ఆమె చిరునామాకు వెళ్లి ఆరాతీశాడు. అయితే అది నకిలీ అడ్రస్ అని తేలింది. ఆమె ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్ కూడా వేరొకరిదని తేలింది. దీంతో అరుల్‌రాజ్ బన్‌రూటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అరుల్‌రాజ్‌ను వివాహం చేసుకున్న మహిళ వేలూరు, కోయంబత్తూరు, తిరువణ్ణామలై, ఈరోడ్‌కు చెందిన 15మంది యువకులను వివాహం చేసుకుని మోసగించినట్లు తేలింది.

ప్రేమికుల సందడి

- ఘనంగా వాలంటైన్స్ డే



సాక్షి, చెన్నై: ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పార్కులు, బీచ్‌లు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్‌లలో ప్రేమ జంటలు సందడి చేశాయి. చెన్నైలో మెరీనా, గాంధీ , పట్టినంబాక్కం, బీసెంట్‌నగర్ బీచ్‌లు, గిండీలో చిల్డ్రన్స్ పార్కు, వండలూర్ జూతో సహా ప్రముఖ పర్యాటక కేంద్రాలలో పలువురు అనేక రకాలుగా తమ ప్రేమను తెలియజేశారు. అలాగే వినోద కేంద్రాలు, బీచ్‌లలో కానుకలను సమర్పించుకున్నారు. ఇక రాష్ట్రంలో ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉన్న ఊటీ, కొడైకెనాల్‌కు భారీ ఎత్తున లవర్స్ చేసుకుని వేడుకలు చేసుకున్నారు. అలాగే పెద్దఎత్తున ప్రేమ వివాహాలు కూడా జరిగాయి. ఇక లవర్స్‌డే సందర్భంగా రోజా పువ్వులు, బొకేల విక్రయాలు జోరుగా సాగాయి. గతంలో కంటే ఈ సారి రెట్టింపు ధర పలికాయి.



బీచ్‌లో ప్రేమ జంటల విహారం

పలుచోట్ల నిరసనలు..

ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ హిందూ మున్నని తదితర సంఘాల నేతృత్వంలో రాష్ట్రంలో అక్కడక్క నిరసనలు జరిగాయి. చెన్నైలోని మహిళల కళాశాలల వద్ద తమ ధర్నా చేసేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయా కళాశాలల వద్ద పోలీసులు గట్టి భద్రత కల్పించారు. చివరకు ఆయా ప్రాంతాలలో ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా, తల్లిదండ్రులు, కుటుంబాన్ని, దేశాన్ని ప్రేమించాలని పిలుపు నిస్తూ కరప్రతాలను నిరసనకారులు పంపిణీ చేశారు. కారైక్కుడితో పాటు పలు చోట్ల కుక్కలకు, మేకలకు, పిల్లలుకు పెళ్లిలు చేసి తమ నిరసనను తెలియజేశారు.



ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా హిందూ మున్నని నేతల నిరసన

రియల్టర్లపై ఐటీ గురి

- నాలుగు సంస్థల్లో సోదాలు
- పలు రికార్డులు స్వాధీనం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో నాలుగు రియల్ ఎస్టేట్ సంస్థలకు సంబంధించిన కార్యాలయాల్లో మంగళవారం ఐటీ సోదాలు పెద్దఎత్తున జరిగాయి. వివరాలు.. దేశవ్యాప్తంగా పలు రియల్ ఎస్టేట్, నిర్మాణా సంస్థలు భారీగాపన్ను ఎగవేస్తున్నారనే సమాచారంతో ఐటీ అధికారులు మంగళవారం కన్నెర్ర చేశారు. పలు రాష్ట్రాల్లో జరిగిన సోదాల్లో భాగంగా చెన్నై అన్నానగర్ కేంద్రంగా ఉన్న అశోక్ రెసిడెన్సీ, దక్షిణ చెన్నై పరిధిలోని అంబాల్ రేడియన్స్, పనయూరులోని ఆదిత్యా రాం గ్రూప్‌ల చెందిన కార్యాలయాలు, నిర్వాహకుల నివాసాలపై ఐటీ గురి పెట్టింది. చెన్నైతో పాటు చెంగల్పట్టు, కాంచీపురం, వేలూరు తదితర ప్రాంతాల్లో ఆయా సంస్థలకు చెందిన కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. కొన్ని చోట్ల పొద్దు పోయే వరకు సోదాలు జరిగాయి. ఈ సమయంలో ఆయా కార్యాలయాల్లోని ముఖ్య నిర్వాహకులను మాత్రమే లోనికి అనుమతించారు. ఇక పన్ను ఎగవేతకు సంబంధించిన అనేక రికార్డులు, పత్రాలు, విదేశీ పెట్టుబడులు, అనేక చోట్ల స్థలాలకు సంబంధించిన దస్తావేజులను సీజ్ చేశారు.



చెన్నైలో ఐటీ సోదాలు జరిగిన ఓ సంస్థ కార్యాలయం

క్లుప్తంగా

ప్రేమికుల రోజుకు వ్యతిరేకంగా..



వేలూరు కోటలో పోలీసుల బందోబస్తు

వేలూరు: ప్రేమికుల రోజును వ్యతిరేకిస్తూ హిందూ మున్నని నాయకులు వేలూరు కోట మైదానంలోని పార్కులోకి పూలమాలలు, తాళి బొట్లతో వచ్చారు. పార్కులోని ప్రేమికులు వీరిని చూసి పరుగులు తీశారు. అమిర్థి పార్కులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కోట మైదానం, చిన్న పిల్లల పార్కు వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జంటలుగా వచ్చే ప్రేమికులను పోలీసులు విచారణ జరిపారు. దీంతో ప్రేమికులు కోట లోనికి రావడానికి బయపడ్డారు. కాగా మంగళవారం ప్రేమికుల రోజు కావడంతో మార్కెట్‌లోని రోజా పూలకు భలే గిరాకి ఏర్పడింది. రోజా పూలు విక్రయించే దుకాణాలన్నీ యువకులతో కిక్కిరిసింది. దీన్ని ఆసరాగా తీసుకుని అధిక ధరలకు విక్రయించారు.

19వ శతాబ్దానికి చెందిన శాసనం గుర్తింపు



స్వాధీనం చేసుకున్న శిలాశాసనం

అన్నానగర్: కన్నివాడి సమీపంలో 19వ శతాబ్దానికి చెందిన శాసనాన్ని గుర్తించారు. మదురై పాండ్యనాడు కల్చరల్ సెంటర్ నిర్వాహకులకు కన్నివాడిలో పురాతన శాసనం ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో ఈ కేంద్రంలోని పరిశోధకులు లక్ష్మణమూర్తి, అరిస్టాటిల్ మంగళవారం కన్నివాడికి వచ్చారు. చుట్టుపక్కల శిలాశాసనంపై ఆరా తీశారు. ఆ శాసనం కన్నివాడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెరుమాళ్ ఆలయ సముదాయంలో ఉన్నట్లు వెల్లడైంది. ఆ తర్వాత అక్కడికి వెళ్లిన పరిశోధకులు శిలాశాసనాన్ని సందర్శించి అధ్యయనం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయ కాపలాదారునికి ఇచ్చిన కానుకగా శాసనం ఉందని పేర్కొన్నారు. కన్నివాడిలో పెద్దది కలికో ఆలయానికి కాపలాగా కుమార నరసింహ అప్పయ్యను నియమించినట్లు శాసనం తెలుపుతుంది. అందుకు అయ్యే ఖర్చులను కూడా కొప్పమ్మ సమకూర్చిందని పేర్కొన్నారు. ఇందులో చెక్కబడిన అక్షరాలను బట్టి ఇది 19వ శతాబ్దానికి చెందిన శాసనమని స్పష్టమవుతుందన్నారు.

మార్చి 26న సినీ నిర్మాతల మండలి ఎన్నికలు

- ఎన్నికల అధికారిగా మాజీ న్యాయమూర్తి వెంకటరామన్



తమిళ సినిమా: తమిళ సినీ నిర్మాతల మండలి ఎన్నికలకు నగారా మోగింది. ప్రస్తుత కార్యవర్గ కాల పరిమితి ముగియడంతో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్చి 26వ తేదీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండలి కార్యవర్గం మంగళవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది. గత నెల 21వ తేదీ కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానం మేరకు మార్చి 26న ఆదివారం ఎన్నికలను నిర్వహించడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకు మాజీ న్యాయమూర్తి కె.వెంకటరామన్‌ను ఎన్నికల అధికారిగా నియమించినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా, ఎన్నికల వేదికను త్వరలోనే వెల్లడించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ నెల 23వ తేదీ 11 గంటల నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోటీలో నిలిచే సభ్యులకు దరఖాస్తులను మండలి కార్యాలయంలో అందించడం జరుగుతుందని, సభ్యులు రూ.100 చెల్లించి దరఖాస్తులను పొందవచ్చు అని తెలిపింది. అదే విధంగా 27 తేదీ ఉదయం 11 గంటల నుంచి మార్చి 2వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పూర్తి చేసిన దరఖాస్తులను మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాల్సి ఉంటుంది. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీలోగా దరఖాస్తులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం 6 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్ల తుది జాబితా ప్రకటించనున్నారు. మార్చి 26వ తేదీ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఎన్నికల్లో అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సహాయ కార్యదర్శి, 26 మంది కార్యవర్గ సభ్యులు పదవులకు పోటీ జరుగుతుంది. అధ్యక్ష పదవికి పోటీ చేసేవారు రూ. లక్ష, ఇతర పదవులకు రూ.50 వేలు, కార్యవర్గ సభ్యులు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

ఐటీ దాడులు



వేలూరు అంబాలాల్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు

వేలూరు: నగరంలోని అంబాలాల్ రియల్ ఎస్టేట్ కార్యాలయంపై ఐటీ అధికారులు దాడులు చేశారు. ఈ సంస్థకు వేలూరు జిల్లా వ్యాప్తంగా సబ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వేలూరు పాత బైపాస్ రోడ్డులోని ప్రధాన కార్యాలయాన్ని గుడియాత్తంకు చెందిన జౌరీలాల్ జైన్ నడుపుతున్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం ఈ కార్యాలయానికి ఎనిమిది కార్లలో సుమారు 50 మందికిపైగా ఐటీ అధికారులు వచ్చారు. కార్యాలయం లోనికి వెళ్లి తలుపులు మూసివేసి తనిఖీలు చేశారు. అలాగే వేలూరు, గుడియాత్తం, కాట్పాడిలోని కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. యజమాని జౌరీలాల్ జైన్ కుటుంబ సభ్యుల వద్ద విచారణ చేశారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కాట్పాడి సమీపంలోని బీడి పరిశ్రమ, రంగాలయ రాయల్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లోని మూడు కంపెనీలకు సొంతమైన కార్యాలయాలు, యజమానుల బంధువుల ఇళ్లలో ఆదాయపు పన్ను అధికారులు దాడులు జరపడం జిల్లాలో సంచలనం రేపింది.

కజకిస్తాన్ యువతితో వివాహం



ప్రభాకరన్, ఆల్బినాన్ వివాహ వేడుక

తిరువొత్తియూరు: కజకిస్తాన్ దేశానికి చెందిన యువతిని తంజావూరు యువకుడు ప్రేమించి తమిళ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నాడు. వివరాలు.. తంజావూరు జిల్లా పట్టుకోట్టైకి చెందిన ప్రభాకరన్ (33) పదేళ్లుగా కజకిస్తాన్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని వద్ద యోగా నేర్చుకోవడానికి వచ్చిన ఆ దేశానికి చెందిన ఆల్బినాన్ (31) మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో ఇద్దరూ వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఇరు కుటుంబాలు పచ్చ జెండా ఊపడంతో స్వస్థలం మడుక్కూరైకి యువతితో చేరుకున్నాడు. మంగళవారం తమిళ సంప్రదాయం ప్రకారం వధువు మెడలో తాళి కట్టాడు. బంధువులు, గ్రామ ప్రజలు వాళ్లను ఆశీర్వదించారు. దీనిపై ఆల్బినాన్ మాట్లాడుతూ..తమిళ ప్రజల జీవన విధానం తనకు నచ్చిందని.. తమిళ భాషను నేర్చుకుంటున్నానని తెలిపింది. తమిళ యువతిగా మారుతానని చెప్పారు.

కుటుంబ మేళాలకు అపూర్వ ఆదరణ

సాక్షి, చెన్నై: చెన్నైలోని కొత్త సెంట్రల్ ప్లాజాను సాంస్కృతిక హాట్ స్పాట్‌గా మార్చడం, టౌన్‌షిప్‌లలో ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా నగర వీధుల్లో కుటుంబ మేళాకు అపూర్వ ఆదరణ వచ్చినట్టు ఎస్‌పీఆర్ ఇండియా ప్రకటించింది. తొలి ప్రయత్నంగా చెన్నై వీధుల్లో రెండు రోజుల పాటు ఫ్యామిలీ మేళా పేరిట ఒక ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పినట్లు వివరించారు. 125 స్టాల్స్, ఆటలు, పాటలు, పోటీలు, వినోద భరిత కార్యక్రమాలను ప్రజలకు ఉచితంగా అందించామని తెలిపారు. ఈ మేళాను 16500 మంది సందర్శించి ఆదరించారని పేర్కొన్నారు.

ఎన్‌ఈసీతో ఏవీఐటీ విద్యా ఒప్పందం

సాక్షి, చెన్నై: టెక్ ఆశావహులు, విద్యార్థులలో నైపుణ్యాల మెరుగు, సమగ్ర విద్యా కార్యక్రమం లక్ష్యంగా ఆరుపడై వీడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఏవీఐటీ)- ఎన్‌ఈసీ కార్పొరేషన్ ఇండియా మధ్య మంగళవారం విద్యా ఒప్పందం జరిగింది. ఏవీఐటీ ప్రిన్సిపల్ జి. సెల్వకుమార్, ఎన్‌ఈసీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ జీఎం దీపక్ ఝా ఈ ఒప్పందాల గురించి స్థానికంగా వివరించారు. 2023 కేంద్ర బడ్జెట్లో ప్రకటన మేరకు ఉమ్మడి విద్యా కార్యక్రమాలే కాకుండా విద్యార్థులకు పూర్తిస్థాయిలో సాంకేతికత, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ తదితర అంశాలతో పాటు భవిష్యత్ టెక్ ఆశావహులకు మరింత నైపుణ్యం పెంపొందించేందుకు ఈ ఒప్పందాలు వీలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు ఎదురయ్యే అన్ని రకాల సమస్యలకు పరిష్కారాలను రూపొందించే విధంగా ఈ ప్రయాణం ఉంటుందన్నారు.

క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



హైటెక్ థెరపీ బేను ప్రారంభిస్తున్న మంత్రి స్వామినాథన్

కొరుక్కుపేట: క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని రాష్ట్ర సమాచార ప్రచార శాఖ మంత్రి సామినాథన్ అన్నారు. తరమణి అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఏపీజే అబ్దుల్ కలాం థెరపీ బేని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పెరుగుతున్న క్యాన్సర్ కేసులకు అనుగుణంగా అపోలో హాస్పిటల్స్ చికిత్స అందించడంలో ముందంజలో ఉందన్నారు. వైద్య రంగానికి చెన్నై వేదికగా నిలుస్తోందన్నారు. అపోలో ఆస్పత్రి ఆపరేషన్స్ గ్రూప్ ఆంకాలజీ డైరెక్టర్ హర్షద్ రెడ్డి మాట్లాడుతూ..ప్రపంచ స్థాయి చికిత్సను అందించడమే ధ్యేయంగా పెట్టుకున్నామని తెలిపారు. థెరపీ బేతో కేన్సర్‌ను మరింత సమర్థవంతంగా నిర్ధారించే వీలుందన్నారు. ఆస్పత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరీష్ త్రివేది, మెడికల్ డైరెక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

చెన్నై నుంచి వేలూరుకు కాలేయం

- రెండు గంటల్లో తీసుకొచ్చిన సిబ్బంది
- ఆపరేషన్ విజయవంతం



కాలేయం ఉన్న బాక్సును నారాయణి ఆస్పత్రికి తీసుకొస్తున్న సిబ్బంది

వేలూరు: వేలూరు నారాయణి ఆస్పత్రి వైద్య బృందం చెన్నై నుంచి రెండు గంటల్లో కాలేయాన్ని తీసుకొచ్చి సేలం వ్యక్తికి ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. బ్రెయిన్‌డెడ్ అయిన చెన్నైకి చెందిన రబీ నుంచి లివర్ డోనేషన్‌ను చెన్నై రామచంద్ర ఆస్పత్రి నుంచి అంబులెన్స్ ద్వారా 2 గంటల వ్యవధిలో వేలూరు నారాయణి ఆస్పత్రికి తీసుకొచ్చారు. సేలంకు చెందిన పళనిస్వామి(48)కి కాలేయాన్ని మార్పి రికార్డు సాధించారు. అవయవ మార్పిడి ఆపరేషన్‌కు సుమారు 8 గంటల సమయం పట్టిందని ఆరుగురితో కూడిన వైద్య బృందం పాల్గొన్నట్లు నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ తెలిపారు. ఆస్పత్రిలో మొదటి కాలేయ మార్పిడి ఆపరేషన్ అన్నారు. కాలేయ మార్పిడి ఆపరేషన్ చేయడానికి రూ. 25 లక్షలు ఖర్చు అయినట్లు.. అయితే నారాయణి ట్రస్ట్ ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. ఇదే తరహాలో మరో నలుగురికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు బంగారు గుడి పీఠాధిపతి శక్తిఅమ్మ చర్యలు తీసుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో గుండె ఆపరేషన్‌లు కూడా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రైడర్‌లకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పోలీస్ కమిషనర్ శంకర్ జివాల్

కొరుక్కుపేట: ట్రాఫిక్ నిబంధనలను పాటించడంతో పాటు హెల్మెట్ ధరిస్తున్న రైడర్‌లకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. నగరంలో హెల్మెట్ ధరించడంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మొత్తం 5,600 సర్టిఫికెట్లు అందించే కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంకర్ జీవాల్ శ్రీకారం చుట్టారు. మంగళవారం సిటీ పోలీస్ ఆఫీస్ జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో 100 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 జనవరి 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ వరకు హెల్మెట్ ధరించని వారిపై 10,08,528 కేసులను నమోదు చేశామన్నారు. 508 మరణాలు సంభవించాయని వెల్లడించారు. అందుకే అందరూ హెల్మెట్ ధరించాలని కోరారు.

కోలీవుడ్ టాక్స్




నినైవెల్లా నీయడా చిత్రంలో ఓ దృశ్యం

నినైవెల్లా నీయడా మోషన్ పోస్టర్ విడుదల

తమిళ సినిమా: ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్న 1417వ చిత్రం నినైవెల్లా నీయడా. రేఖా థియేటర్స్ పతాకంపై రాయల్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆదిరాజన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈయన ఇంతకుముందు సిలంది, రణతంత్ర, అరువా సండై వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. హీరో హీరోయిన్లుగా ప్రజన్, మనిషా యాదవ్, నవనటి సినామిక నటిస్తున్నారు. రెడిన్ కింగ్స్‌లీ, మనోబాల, మధుమిత, దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్, ముత్తురామన్, పీఎల్ తేనప్పన్, రంజన్ కుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దీనికి రాజా భట్టాచారి చాయాగ్రహణం అందిస్తున్నారు. ఈ తరం యువత ప్రేమను ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. పాఠశాలలో పాఠాలు సరిగా చదవకుండా ప్రేమ పాటలు నేర్చుకునే వాళ్లు తర్వాత ప్రేమలో చిక్కుకుని కొట్టుకుపోయే ఒకరి డైరీ చదివిన భావనకు గురవుతారు అన్నారు. మనం చదువుకున్న పాఠశాలకు మళ్లీ ఒకసారి వెళ్లి మరచిపోయిన గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటామన్నారు. కాగా ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను ప్రేమికుల రోజు సందర్భంగా మానాడు చిత్ర నిర్మాత సురేష్ కామాక్షి తన ట్విట్టర్ ద్వారా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ చిత్రం యువతీ యువకుల గుండెల్లో నిలిచిపోతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

నా సూర్యుడు నువ్వే



ప్రియుడితో శృతిహాసన్

తమిళ సినిమా: సంగీత దర్శకురాలిగా సినీరంగ ప్రవేశం చేసి ఆ తర్వాత నటిగా, గాయనిగా తన ప్రతిభను చాటుకుంటున్న నటి శృతిహాసన్. తమిళంలో ఈమె చివరిగా నటించిన చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. అయితే శృతిహాసన్‌కు తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి క్రేజ్ ఉంది. అంతకుమించి మంచి విజయాలు ఉన్నాయి. ఇటీవల చిరంజీవికి జంటగా నటించిన వాల్తేరు వీరయ్య, బాలకృష్ణ సరసన నటించిన వీరసింహారెడ్డి చిత్రాలు సూపర్‌హిట్ అయ్యాయి. ఈ రెండు ఒకేసారి విడుదలై శృతిహాసన్ కెరియర్‌లో గుర్తుండిపోయే చిత్రాలు. ప్రస్తుతం ప్రభాస్‌తో సలార్ చిత్రంలో నటిస్తున్నారు. ఇది పాన్ ఇండియా చిత్రం. ఇకపోతే శృతిహాసన్ వ్యక్తిగతంతా, ప్రేమ వ్యవహారంలో తరచు వార్తల్లో ఉంటున్నారు. సంచలన వ్యాఖ్యలు, గ్లామరస్ ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో నిలుస్తుంటారు. ఇప్పటికే ఒకటి రెండు సార్లు ప్రేమించి విఫలం అయిన శృతిహాసన్ తాజాగా శాంతను హజారిక అనే వ్యక్తితో ప్రేమలో మునిగి తేలుతున్నారు. కాగా ప్రేమికుల రోజు సందర్భంగా శృతిహాసన్ తన ప్రియుని ఉద్దేశిస్తూ ఇన్‌స్టాగామ్‌లో ఒక ట్వీట్ చేశారు. పేరుతో కలిసిన ఫొటోలు పోస్ట్ చేస్తూ 'మీరు చాలా ఉత్తములు. నా హృదయం నీతోనే ఉంది. నా ఆలోచనలో మీరే. నా సూర్యుడు మీరే. ఈ ప్రపంచంలో అదృష్టవంతురాలిని నేనే' అని పేర్కొన్నారు. ఇందుకు ఆమె ప్రియుడు శాంతను బదులుగా ట్వీట్ చేస్తూ ' నా ప్రేయసి నువ్వే. నా ప్రపంచం నువ్వే. నా సూర్యుడు నువ్వే. నా కదలి నువ్వే. నువ్వు చాలా ఉత్తమ యువతివి' అని పేర్కొన్నారు. వీరి ప్రేమ వలకబోతల ముచ్చట్లు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

అంతర్జాతీయ సంగీత కళాకారులతో..



సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్

తమిళ సినిమా: చిత్రాలు, వెబ్‌సిరీస్‌లతో దూసుకుపోతున్న సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్. తమిళం, తెలుగు, హిందీ తదితర భాషల్లో చిత్రాలు చేస్తూ పాన్ ఇండియా సంగీత దర్శకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా యాక్షన్, సస్పెన్స్ థ్రిల్లర్ కథా చిత్రాలకు కేరాఫ్‌గా మారిపోయారనే చెప్పాలి. కోలీవుడ్‌లో బిజీ సంగీత దర్శకుడు ఎవరంటే ముందుగా వినిపించేది ఈయన పేరే. కాగా విక్రమ్ వేద చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైన ఈయన తాజాగా ది నైట్ మేనేజర్ అనే హిందీ వెబ్ సిరీస్‌కు సంగీతాన్ని అందించడం విశేషం. ఇది 2016లో ఇదే పేరుతో ఆంగ్లంలో రూపొందింది. ఇప్పుడు దానికి హిందీలో రీమేక్ చేశారు. ఇందులో పొన్నియిన్ సెల్వన్ చిత్రం ఫేమ్ శోభిత దూళిపాల, బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, ఆదిత్య రాయ్ కపూర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ప్రియాంక చోప్రా, ఫారుక్ నబీల్, నవీన్ సందీప్ మోడీ కలిసి నిర్మించిన వెబ్ సిరీస్ ఇది. ఈ నెల 17వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. దీనికి సంగీతాన్ని అందించడం మంచి అనుభవంగా శ్యామ్ సీఎస్ పేర్కొన్నారు. ఆయన తెలుపుతూ ఇంతకుముందే విక్రమ్ వేద చిత్రం రీమేక్ ద్వారా బాలీవుడ్‌కు పరిచయమై మంచి గుర్తింపును తెచ్చుకున్నట్లు చెప్పారు. తాజాగా ది నైట్ మేనేజర్ వెబ్ సిరీస్‌కు ఎంతో అనుభవం కలిగిన అంతర్జాతీయ సంగీత కళాకారుల సహకారంతో సంగీతాన్ని అందించినట్లు చెప్పారు. ఈ వెబ్ సిరీస్‌కి వీక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

లైకా సంస్థ తిరస్కరించిన కథే!



దాదా చిత్ర యూనిట్

తమిళ సినిమా: ఒలింపియా మూవీస్ పతాకంపై అంబేత్ కుమార్ నిర్మించిన చిత్రం దాదా. కవిన్, అపర్ణ దాస్ జంటగా నటించారు. కె.భాగ్యరాజ్, ఐశ్వర్య, గణేష్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. గణేష్ కే బాబు దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఇది. నేటితరం యువత ప్రేమ నేపథ్యంలో రూపొందింది. ఈ నెల 10వ తేదీ విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సోమవారం సాయంత్రం చెన్నైలో థాంక్స్ గివింగ్ నిర్వహించారు. కవిన్ మాట్లాడుతూ.. ఇది తన 12 ఏళ్ల కల అని పేర్కొన్నారు. చిత్ర యూనిట్ సమష్టి శ్రమకు దక్కిన విజయంగా పేర్కొన్నారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన నిర్మాత అంబేత్ కుమార్‌ను జీవితాంతం మరిచిపోనని దర్శకుడు గణేష్ కె బాబు పేర్కొన్నారు. నిర్మాత అంబేత్ కుమార్ మాట్లాడుతూ.. తాను అనుకోకుండా నిర్మాతగా మారి మనం కొత్తి పరవై, జీప్సీ చిత్రాలు చేశానన్నారు. చిన్న గ్యాప్ తీసుకుని ఇప్పుడు దాదా చిత్రం చేసినట్లు చెప్పారు. ముందు తాను వేరే కథ అనుకుని కవిన్‌ను వినమని చెప్పానన్నారు. అయితే ఆయన తన వద్ద ఒక కథ ఉంది.. మీరు విని బాగుంటే చేద్దామని చెప్పారన్నారు. అలా ఈ చిత్రం తెరరూపం దాల్చిందని చెప్పారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు, విడుదల చేసిన రెడ్ జెయింట్ మూవీస్ సంస్థకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు. విషయం ఏంటంటే ఈ చిత్ర కథను ముందు లైకా సంస్థ తిరస్కరించిందని, ఇప్పుడు అదే సంస్థ ఈ చిత్ర దర్శకుడికి అవకాశం కల్పించిందని చెప్పారు.

నేను పా.రంజిత్‌కు వ్యతిరేకిని కాను



బకాసురన్ చిత్ర యూనిట్

తమిళ సినిమా: తాను దర్శకుడు పా. రంజిత్‌కు వ్యతిరేకిని కాదని దర్శక నిర్మాత మోహన్ జి పేర్కొన్నారు. ఇంతకుముందు పళయ వన్నారపేట్టై, ద్రౌపది, రుద్రతాండవం వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను తెరకెక్కించిన ఈయన తాజాగా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం బకాసురన్. దర్శకుడు సెల్వ రాఘవన్ కథానాయకుడు. నట్టి, రాధా రవి, కే రాజన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ సంగీతాన్ని, ఫరూక్ చాయాగ్రహణం అందించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 17వ తేదీ విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం చిత్రం యూనిట్ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సెల్వ రాఘవన్ మాట్లాడుతూ.. ప్రతిభ లేకపోతే ఎవరు కథానాయకులుగా సక్సెస్ కాలేరన్నారు. మోహన్ జి కఠిన శ్రమజీవి అని, ప్రతిభావంతుడు, సినిమాపై ఎంతో మర్యాద, నమ్మకం కలిగిన మంచి దర్శకుడు అని ప్రశంసించారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన దర్శకుడు మోహన్.జీకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. చిత్ర దర్శక నిర్మాత మోహన్.జీ మాట్లాడుతూ.. బకాసురం చిత్రం చాలా మంది ప్రశంసించారని, అందుకు తనతోపాటు పనిచేసిన అందరూ కారణమని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్, చాయాగ్రహకుడు ఫరూక్ ముఖ్యమైన వారని అన్నారు. సెల్వ రాఘవన్ సైలెంట్‌గా ఉంటారని.. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడరని తెలిపారు. అయితే, ఈ చిత్రం షూటింగ్ సమయంలో తాను సెల్వరాఘవన్ చాలా విషయాల గురించి మాట్లాడుకున్నాం అని చెప్పారు. సెల్వరాఘవన్ దర్శకత్వం వహించిన కాదల్ కొండేన్ చిత్రాన్ని చూసిన తర్వాతే తనకు దర్శకుడు కావాలన్న కోరిక కలిగిందని చెప్పారు. లేకపోతే తాను ఒక వర్గానికి సంబంధించిన కథా చిత్రాలనే చేస్తానని ప్రచారం ఉందన్నారు. అందు కోసం తాను సినిమాలోకి రాలేదని స్పష్టం చేశారు. దర్శకుడు పా.రంజిత్ బడుగు వర్గాల ఇతివృత్తాలతోనూ, తాను ఓబీసీ ప్రజల కోసం చిత్రాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోందని, అయితే సినీ పరిశ్రమలో తాను ఎవరిని వ్యతిరేకులుగా భావించడం లేదని, ముఖ్యంగా దర్శకుడు పా.రంజిత్‌కు తాను వ్యతిరేకిని కాదని స్పష్టం చేశారు. బకాసురన్ అందరి చిత్రం అని దర్శక నిర్మాత మోహన్.జి పేర్కొన్నారు.

క్లుప్తంగా

బాలుడిపై కిడ్నాప్ కేసు

వేలూరు: ఓ పాఠశాల విద్యార్థిని కిడ్నాప్ చేసిన 17 సంవత్సరాల యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వేలూరు ప్రాంతానికి చెందిన 16 సంవత్సరాల విద్యార్థిని అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్–2 చదువుతోంది. సోమవారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో తల్లిదండ్రులు తన కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల యువకుడు కిడ్నాప్ చేశాడని వేలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి

అన్నానగర్: రాయకోటలో విద్యుత్ షాక్‌తో మగ ఏనుగు మృతిచెందింది. కృష్ణగిరి జిల్లాలో 4 నెలలుగా 3 ఏనుగులు కృష్ణగిరి, గురుపరపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. 2 నెలల క్రితం కృష్ణగిరి టోల్‌గేట్ వద్ద సంచరిస్తున్న ఏనుగులను అటవీశాఖ అధికారులు బాణాసంచా పేల్చి అడవిలోకి తరిమారు. ఆ తర్వాత రాయకోట ఫారెస్ట్ రిజర్వ్‌లోని ఊడెదుర్గం ఫారెస్ట్‌లో విడిది చేశాయి. ఈ క్రమంలో కృష్ణగిరి–రాయకోట రహదారిలోని వెళగలల్లి సమీపంలోని వెంకటప్పన్ కోటాయి వద్ద ఓ మగ ఏనుగు సోమవారం మృతి చెందింది. విద్యుత్ తీగ దాని శరీరానికి చుట్టుకుని ఉంది. దీంతో గ్రామస్తులు రాయకోట ఫారెస్టు కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో జిల్లా అటవీశాఖ అధికారి కార్తికేయని, అటవీశాఖ అసిస్టెంట్ కన్జర్వేటర్ రాజా మరియప్పన్, రాయకోట ఫారెస్ట్ అధికారి పార్థసారథి, ఫారెస్టర్లు శరవణన్, సెంథిల్ నాథన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏనుగు వయసు 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉంటుందని గుర్తించారు. కృష్ణగిరిలో సంచరిస్తున్న 3 ఏనుగుల్లో ఒకటని తెలిసింది. కొబ్బరి తోటలోని బావి వద్ద ఉన్న మోటారు తీగ కాలికి తగిలి మృతిచెందినట్లు అధికారులు తెలిపారు.

దోపిడీ దొంగల అరెస్ట్

అన్నానగర్: చెన్నైలో పోలీసులుగా నటిస్తూ నగల వ్యాపారుల నుంచి రూ.1.5 కోట్లు దోచుకున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లాకు చెందిన సుభార (56), రెహ్మాన్ (48) నగల వ్యాపారులు. ఆంధ్రా నుంచి రూ.1.40 కోట్లతో ఈ నెల 3వ తేదీ చెన్నై వచ్చారు. వాల్టాక్స్ రోడ్డు నుంచి ఆటోలో షావుకారుపేటకు వెళ్లారు. థౌజండ్‌లైట్స్ వీరప్పన్ స్ట్రీట్ జంక్షన్ వద్ద పోలీసులమని చెప్పి ఐదుగురు వ్యక్తులు నగల వ్యాపారుల వద్ద ఉన్న నగదును తీసుకున్నారు. పత్రాలు సమర్పించి స్టేషన్‌లో తీసుకోవాలని అక్కడి నుంచి ఉడాయించారు. అయితే వారు నకిలీ పోలీసులని తేలడంతో థౌజండ్‌లైట్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆల్బర్ట్ జాన్ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. వీరు కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు హొగెనికల్‌లో తలదాచుకున్న ఇమ్రాన్ (39)ను మంగళవారం అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు నీలగిరి, సేలం ప్రాంతాల్లో తలదాచుకున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురి నుంచి రూ.60 వేలు, కారు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ముగ్గురిని పోలీసులు చెన్నైకి తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు.

నిందితులను పట్టుకునే క్రమంలో పోలీసుల కాల్పులు

– ఇద్దరికి గాయాలు

సాక్షి, చెన్నై: కోర్టు ఆవరణలో ఓ హత్యకు సంబంధించిన ఇద్దరు నిందితులను పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో నిందితులిద్దరూ గాయపడ్డారు. వివరాలు.. కోయంబత్తూరు కోర్టు ఆవరణలో సోమవారం కీరనత్తానికి చెందిన గోకుల్(30)ను గుర్తుతెలియని యువకుల ముఠా అతి దారుణంగా హతమార్చింది. అలాగే అతడి మిత్రుడు మనోజ్‌ను కూడా గాయపరిచింది. వెళ్తూ వెళ్తూ ఈ ముఠా కత్తులతో కోర్టు ఆవరణ, ఆ పరిసర మార్గాలలో వీరంగం సృష్టిస్తూ తప్పించుకు వెళ్లారు. ఆగమేఘాలపై రంగంలోకి దిగిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. మరి కొందరు తప్పించుకెళ్లారు. ఇందులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు హంతకులు నీలగిరి జిల్లాలోకి ప్రవేశించినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ జిల్లా ఎస్పీ ప్రభాకరన్ ఆదేశాలతో మంగళవారం మధ్యాహ్నం తర్వాత పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కోతగిరి – మేట్టుపాళయం మార్గంలో సాయంత్రం సమయంలో నిందితులుగా ఉన్న జోష్వా, గౌతమ్ పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. వీరిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నం జరిగింది. చివరకు తుపాకీతో కాల్పులు జరపాల్సి వచ్చింది. గాయపడిన ఇద్దరు నిందితులు కోయంబత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: ధర్మపురి జిల్లాలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టీఎస్‌వీ నగర్‌కు చెందిన శ్రీనివాసన్ (46) సొలుపట్టి ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య తమిళ్సై, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన శ్రీనివాసన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి ఆయన్ను ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ధర్మపురి టౌన్ పోలీసులు శ్రీనివాసన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బ్యాంకులో రుణం తీసుకుని ఇల్లు కట్టినట్లు.. తిరిగి చెల్లించడానికి ఇబ్బందులు పడినట్లు తెలిసింది. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించండి

• ప్రివెంటివ్ కమిటీ దృష్టికి సమస్యలు


మాట్లాడుతున్న తిరువళ్లూరు కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్

తిరువళ్లూరు: జిల్లాలో ప్రజల అవసరాల మేరకు నూతన వైద్యశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా ఆరోగ్యం ప్రివెంటివ్ మెడిసిన్ కమిటీని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారోగ్యంపై జిల్లా స్థాయి కమిటీలను నియమించడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అవసరాలను గుర్తించి ఎమ్మెల్యే, ఎంపీ, ఆర్థిక సంఘం ద్వారా వచ్చే నిధులను వాటికి కేటాయించే అంశంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అధ్యక్షత వహించగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ అధ్యక్షులు, వార్డుమెంబర్‌లు, కౌన్సిలర్‌లు హాజరై వారి సమస్యలను కమిటీకి వివరించారు. మెజారిటీ పంచాయతీ అధ్యక్షులు తమ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కచ్చూర్‌మేడు, పళ్లిపట్టు, తిరుత్తణి, పూందమల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో అదనపు పడకలు పెంచాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 2022 నుంచి 14 యూనియన్‌లో ప్రజాప్రతినిధుల ద్వారా భవనాలు, పరికరాలు, సిబ్బంది తదితర ఆరోగ్య అవసరాలకు సంబంధించిన వినతులు స్వీకరించామని వివరించారు. ప్రాధాన్యత ప్రకారం నిధులను సర్దుబాటు చేస్తామన్నారు. రోడ్డు, రవాణా, భవనాలు, సిబ్బంది కొరతను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలో 20–30 వయస్సు లోపు ఉన్న 2.87లక్షల మంది మహిళలు, 7.19 లక్షల మంది చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేయనున్నామని తెలిపారు. 1428 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, 456 ప్రైవేటు పాఠశాలలు, 68 కళాశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలను అందజేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమానికి డీఆర్వో ఆశోకన్, సబ్‌కలెక్టర్ రిషబ్, ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ సతీష్‌రాఘవన్, డిప్యూటీ డైరెక్టర్ జవహర్‌లాల్ పాల్గొన్నారు.

ఇంజిన్ మరమ్మతులతో ఆగిన యూనిట్ రైలు


తిరువలంగాడు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు

తిరుత్తణి: తిరువలంగాడు రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం యూనిట్ రైలు ఇంజిన్ మరమ్మతుల కారణంగా ఆగిపోయింది. ఫలితంగా 40 నిమిషాల పాటు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వివరాలు.. అరక్కోణం నుంచి యూనిట్ రైలు మంగళవారం మధ్యాహ్నం చెన్నై సెంట్రల్‌కు బయల్దేరింది. తిరువలంగా వద్ద వెళ్తుండగా ఇంజిన్‌లో సాంకేతిక లోపం చోటు చేసుకోవడంతో ఇంజిన్ డ్రైవర్ అరక్కోణం జంక్షన్ రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న ఇంజినీరింగ్ వర్కర్స్ అర్ధగంట పాటు శ్రమించి ఇంజిన్‌ను సరిచేశారు. 40 నిమిషాల తర్వాత రైలు మళ్లీ చెన్నైకు బయలుదేరింది.

57 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ రేలా

సాక్షి, చెన్నై: అరుదైన వ్యాధితో బాధ పడుతున్న 57 ఏళ్ల మహిళకు చెన్నై రేలా ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఆమెకు డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ చేశారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో జరిగిన సమావేశంలో ఆసుపత్రి చైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ రేలా, డాక్టర్ శంకర్ బాలకృష్ణన్, డాక్టర్ అన్బు సెల్వం, డాక్టర్ భరణీ ధరన్ శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. నాగర్ కోయిల్‌కు చెందిన 57 ఏళ్ల మహిళ శాంతి హెన్రీకి మూడేళ్లుగా మెడ, శరీరం ఓ వైపు తరచూ ఎవరో లాగుతున్నట్లు ఉండటం, ఆహారం నమల లేని పరిస్థితి చేరడం, సరిగ్గా మాట్లాడ లేని స్థితి ఎదురు కావడంతో స్థానికంగా వైద్యులను సంప్రదించారు. మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి రావడంతో ఆమె కుమారుడు ఫైన్ హెన్రీ తల్లిని రక్షించుకునేందుకు పలు చోట్ల వైద్యులను సంప్రదించి, చివరకు రేలా ఆసుపత్రివర్గాలను ఆశ్రయించాడు. పూర్తి క్లీనికల్ పరీక్ష అనంతరం ఆమె జెనెటిక్ డిస్టోనియాతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. ఇది అరుదైన రకం వ్యాధి కావడంతో కేసును ఓ సవాల్‌గా తీసుకుని వివిధ విభాగాల వైద్యులు బృందంగా ఏర్పడి శస్త్ర చికిత్సకు సిద్ధమయ్యారు. మెదడు భాగంలో ఉన్న సమస్య కారణగా ఎదురయ్యే ఈ వ్యాధికి డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్ర చికిత్సకు కొద్ది రోజుల క్రితం చర్యలు తీసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండు రోజుల్లోనే ఆమెను డిశ్చార్జ్ చేశారు. మెడ కండరాలు లాగడం, ఒక వైపుగా వాలిపోవడం వంటి సమస్య నుంచి ప్రస్తుతం ఆమె పూర్తిగా బయట పడ్డారని తెలిపారు.

40 రోజులుగా విధులకు డుమ్మా


ఈఓ గదిలో పేరుకుపోయిన ఫైళ్లు

పళ్లిపట్టు: పొదటూరుపేట టౌన్ పంచాయతీ ఈఓ 40 రోజుల నుంచి విధులకు హాజరుకాకపోవడంతో పంచాయతీలో అభివృద్ధి కుంటుపడింది. ఫైళ్లు పేరుకుపోయాయి. కార్యనిర్వహణాధికారి ప్రకాష్, టౌన్ చైర్‌పర్సన్ మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరి కలెక్టర్ వరకు వెళ్లింది. తీవ్ర ఆవేదనకు లోనైన ఈఓ పట్టణ పంచాయతీ మెట్లెక్కకుండా ఇంటికే పరిమితమయ్యారు. ఈఓ విధులకు హాజరై 40 రోజులు కావడంతో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. రోజువారి కార్యకలాపాలు నిర్వహించేందుకు కనీస అవసరాల కోసం ఈఓ అనుమతి తప్పనిసరి. అయితే ఆయన హాజరుకాకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లింపు సైతం కష్టంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేయలేని పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లి మందలించడంతో..

• కుమార్తె ఆత్మహత్య

అన్నానగర్: చెన్నై సైదాపేటలోని మసీదు వీధికి చెందిన శంకరి (38) భర్త విడిచి వెళ్లిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తోంది. పెద్ద కూతురు శ్వేత (16) ఓ ప్రైవేటు పాఠశాలలో ప్లస్ వన్, చిన్న కుమార్తె సంధ్య ఎనిమిదో తరగతి చదువుతోంది. శ్వేత చదువు పూర్తయ్యాక సాయంత్రం వేళల్లో త్యాగరాయనగర్‌లోని డెంటిస్ట్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. కొద్ది నెలలుగా శ్వేత ఓ అబ్బాయిని ప్రేమిస్తోందని శంకరికి తెలియడంతో మందలించింది. ఈ నెల 7వ తేదీ రాత్రి శ్వేత ఆలస్యంగా ఇంటికి వచ్చింది. ఇక నుంచి పనికి వెళ్లవద్దని శ్వేతను తల్లి మందలించింది. తల్లీ కూతుళ్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మనస్తాపం చెందిన శ్వేత మంగళవారం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లి శంకరి, పక్కింటి వారి సాయంతో రక్షించి సైదాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషమించడంతో మృతి చెందింది. సైదాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకుల స్వర్గధామం సౌత్ ఆఫ్రికా


సౌత్ ఆఫ్రికా ప్రతినిధి నెలిస్వా

కొరుక్కుపేట: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు సౌత్ ఆఫ్రికా స్వర్గధామంలా నిలుస్తోందని ఆ దేశ పర్యాటక ప్రతినిధి నెలిశ్వ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అత్యధిక సంఖ్యలో భారతీయ పర్యాటకులు సౌత్ ఆఫ్రికాను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశం నుంచి వచ్చే వారిలో 72 శాతం పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, ముంబైలలో ఈ నెల 13 నుంచి 16 మధ్య రోడ్ షోలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో ఏర్పాటు చేసిన రోడ్ షోకు మంచి స్పందన లభిస్తోందని అన్నారు. పర్యాటకులకు పలు రకాలైన ఆఫర్‌లను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

బాధితులకు నగదు, నగలు అప్పగింత


హాస్యనటుడు బోండామణికి నగలను అప్పగిస్తున్న ఆవడి పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్‌రాథోడ్

తిరువళ్లూరు: ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలోని 25 చోరీ కేసుల్లో రికవరీ చేసిన బంగారు నగలు, నగదును బాధితులకు అప్పగించారు. సుమారు రూ. 40 లక్షల విలువైన బంగారు నగలు, రూ.6 లక్షల నగదును ఆవడి కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ మంగళవారం బాధితులకు అప్పగించారు. కాగా ప్రముఖ హాస్యనటుడు బోండా మణికి చెందిన బంగారు నగలు చోరీకి గురైన నేపథ్యంలో వాటిని సైతం రికవరీ చేసి అందజేశారు.

నేటి నుంచి వాహన సేవలు



స్వామి అమ్మవారు ఊరేగనున్న వివిధ వాహనాలు

• వివిధ వాహనాలపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తీశ్వరాల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నుంచి వాహనసేవలు ప్రారంభం కానున్నాయి. వివిధ వాహనాలను అధిష్టించి స్వామి అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. తొలుత బుధవారం ఉదయం స్వామి సూర్యప్రభ వాహనంపై, అమ్మవారు చప్పర వాహనంపై ఊరేగుతారు.రాత్రి భూత–శుక వాహనాలను అధిరోహిస్తారు. రానున్న సోమవారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. అలాగే వచ్చే బుధవారం కైలాసగిరి ప్రదక్షిణ ఉంటుంది. ఆదివారం స్వామి అమ్మవారికి శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిమాప్తమవుతాయి

కల్యాణ వెంకన్నకు తిరుచ్చి బహూకరణ


తిరుచ్చిని అధికారులకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి(తిరుపతి జిల్లా) : శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర సామివారికి తమిళనాడులోని తిరుచ్చికి చెందిన రామ్‌కుమార్ బాలకృష్ణన్, తిరుపతికి చెందిన గీతలక్ష్మి, శ్రీహృదయ్ అనే భక్తులు కలసి మంగళవారం రాత్రి సుమారు రూ.10లక్షల విలువ చేసే తిరుచ్చిని ఆలయానికి బహూకరించారు. ఆలయ అర్చకులు తిరుచ్చికి శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వచనం ఇప్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

18, 19 తేదీల్లో హార్స్ రైడింగ్ పోటీలు



కొరుక్కుపేట: చెన్నైలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో డాక్టర్ కేసీజీ వర్గీస్ ట్రోఫీ 3వ హార్స్ రైడింగ్ పోటీలు నిర్వహించనున్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో చాన్స్‌లర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ – ఇండియన్ ఆర్మీ, తమిళనాడు పోలీస్, ఎన్‌సీసీ, చెన్నై ఈక్విటేషన్ సెంటర్, ఈస్ట్ కోట్ ఈక్వెస్ట్రియన్, చెన్నై రైడింగ్ స్కూల్‌కు చెందిన 10 టీమ్‌లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

శేష వాహనంపై సదాశివుని కటాక్షం


మకర వాహనంపై స్వామి, అమ్మవార్లు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం రాత్రి శేష వాహనంపై, ఉదయం సోమస్కందమూర్తి కామాక్షి అమ్మవారి సమేతుడై మకర వాహనంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఆలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీసోమస్కందమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో వేదోక్తంగా అభిషేకం చేశారు. కాగా రాత్రి 8 నుంచి 10 గంటల వరకు శేష వాహన సేవ అత్యంత వైభవంగా సాగింది. మంగళవా యిద్యాలు, కళాకారుల భజన సంకీర్తన ప్రదర్శనల ముందు సాగుతుండగా వాహన సేవలు కోలాహలంగా సాగాయి. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

19న హరివరాసనం శత జయంతి ఉత్సవాలు


మాట్లాడుతున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: హరివరాసనం శత జయంతి ఉత్సవాల సందర్భంగా చెన్నై మండల ఉత్తర తమిళనాడు శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు సమాజం ప్రెసిడెంట్ వి.జయచంద్రన్ తెలిపారు. హరివరాసనం అనే పాటను వందేళ్ల క్రితం జానకీ అమ్మాళ్ పాడారని, సినీ గాయకుడు జేసుదాసు అలపించడంతో మరింత ప్రాచుర్యం పొందిందని అన్నారు. అయ్యప్ప స్వామికి సమర్పించిన ఈ పాటకు వందేళ్లయిన సందర్భంగా శత జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వేడుకలకు కేంద్రమంత్రి ఎల్ మురుగన్, మిజోరాం మాజీ గవర్నర్ కుమ్మనం రాజశేఖర్ తదితరులు హాజరుకానున్నట్లు చెప్పారు.

సర్పంచ్ తీరుపై నిరసన


తిరుత్తణిలో రాస్తారోకో చేస్తున్న యువకులు

తిరుత్తణి: తుంబికులం పంచాయతీ సర్పంచ్ తీరుకు నిరసనగా మంగళవారం యువకులు రాస్తారోకో చేపట్టారు. తిరువలంగాడు యూనియన్ తుంబికులం పంచాయతీ సర్పంచ్‌గా నిర్మల ఉన్నారు. పంచాయతీ వ్యవహారాల్లో ఆమె భర్త గోపి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నట్లు.. పంచాయతీ నిధులు పక్కదారి మళ్లించి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక యువకులు నాగలాపురం– తిరుత్తణి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. పంచాయతీలో క్రీడా మైదానం ఏర్పాటుకు కేటాయించిన రూ.90 లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు.

పన్ను మినహాయింపు ఇవ్వాలని వినతి


మేయర్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

వేలూరు: వేలూరులోని మాజీ ఖైదీల పునరావాస కేంద్రానికి కార్పొరేషన్ పన్ను మినహాయింపు ఇవ్వాలని మాజీ ఖైదీల సంక్షేమ సంఘ సభ్యులు మేయర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు విజయరాఘవులు, కార్యదర్శి జనార్ధనన్, కోశాధికారి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. వేలూరు సౌత్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జైలు శిక్ష అనుభవించి విడుదలైన ఖైదీల సంక్షేమ సంఘం కోసం కేంద్రం నడుపుతుండటంతో పాటు వారిలో మార్పు తీసుకొచ్చేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా భవనంలో వచ్చే అద్దెను పూర్తిగా ఖైదీల కుటుంబ సభ్యులకు ఖర్చు చేయడంతో పాటు వారికి తరచూ స్వయం ఉపాధిని కల్పిస్తున్నామని చెప్పారు. అయితే కార్పొరేషన్ అధికారులు భవనానికి పన్ను విధించడం సరికాదన్నారు. ఈ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ సమావేశంలో చర్చించి న్యాయం చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

నేడు ఆర్కేపేట యూనియన్ సమావేశం

పళ్లిపట్టు: ఆర్కేపేట యూనియన్ సమితి సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు బీడీఓ అరుల్ తెలిపారు. చైర్‌పర్సన్ రంజిత అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

25 సవర్ల నగలు, కిలో వెండి చోరీ

తిరువొత్తియూరు: చెంగల్పట్టు జిల్లాలో రిజర్వ్ పోలీస్ ఇంటిలో 25 సవర్ల నగలు, కిలో వెండి, నామక్కల్ జిల్లాలో జౌళి వ్యాపారి ఇంటిలో 120 సవర్ల నగలు, రూ.3 లక్షల నగదు చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. చెంగల్పట్టు జిల్లా బెతేరి సమీపంలోని అంబేడ్కర్ వీధి చెందిన అన్బలగన్ ఆవడిలో ఉన్న సీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. భార్య వేదతో కలిసి బేతేరులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో అతను కుటుంబంతో సహా బయటికి వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇంటి తలుపులు పగలగొట్టబడి ఉండడంతో లోపలికి వెళ్లి చూశాడు. 25 సవర్ల నగలు, కిలో వండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అలాగే నామక్కల్ జిల్లా కుమార పాలయం టీచర్స్ కాలనీకి చెందిన మణికంఠన్ (45) జౌళి వ్యాపారం చేస్తున్నారు. సోమవారం రాత్రి తన కుటుంబంతో సహా బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తిరిగి రాగా బీరువాలోని 120 సవర్ల నగలు. రూ. 3 లక్షల నగదు మాయం అవడంతో కుమార పాలయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

ఏ.పి.లోని నెల్లూరు టౌన్‌కు 14కి.మీ నెల్లూరు రూరల్ పెనుబర్తి గ్రామంలో 9.5 ఎకరాలు వ్యవసాయ వాణిజ్య భూమి అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 99888 56555.

TO-LET

విజయవాడ బందర్ రోడ్డుపై గవర్నర్‌పేట లో బీసెంట్‌రోడ్ దగ్గర గోల్డ్ మరియు జ్యువల్లర్ షాప్‌కి పనికివచ్చు సెల్లార్‌తో కలిపి 25,200 చదరపు అడుగులు ఉన్న టువంటి కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు ఇవ్వ బడును. ✆ 95422 86999

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించి ఏదైన ప్రతిస్పందించడం బాధ్యతగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

ఏపీ నూతన గవర్నర్‌తో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ



నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా నియమితులైన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలో జస్టిస్ నజీర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. న్యాయవ్యవస్థలో జస్టిస్ నజీర్‌కు ఉన్న అపారమైన అనుభవం ఏపీకి, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, పదవీకాలం విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నానని సామాజిక మాధ్యమాల్లో ఎంపీ విజయసాయిరెడ్డి పోస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు కూడా విజయసాయిరెడ్డి సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో స్వల్ప భూకంపం

తాళ్లూరు/ముండ్లమూరు/అద్దంకి రూరల్: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం రెండుసార్లు భూమి స్వల్పంగా కంపించింది. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం విఠలాపురం, ముండ్లమూరు మండలంలోని పోలవరం, శంకరాపురం, నూజిళ్లపల్లి, సుంకరవారిపాలెం, వేంపాడు, ముండ్లమూరు, మారెళ్ల, పూరిమెట్ల, భీమవరం గ్రామాల్లో, బాపట్ల జిల్లా అద్దంకిలోని రామ్‌నగర్ ప్రాంతంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. భూమి నుంచి పెద్ద శబ్దాలు రావడంతో ఇళ్లలో నుంచి ప్రజలు రోడ్ల పైకి వచ్చారు. గతంలోనూ ఈ ప్రాంతాల్లో పలుమార్లు స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి.

మన్యంలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మళ్లీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. పగటి సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ అర్ధరాత్రి, వేకువజామున సమయంలో 4 రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ఈ నెల 10 వరకు అరకులోయ, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో 10 నుంచి 15 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 11 నుంచి చలి పెరిగింది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12న 11.5 డిగ్రీలు, 13న 8 డిగ్రీలు, 14న 7.2 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12న 13.4 డిగ్రీలు, 13న 13.5 డిగ్రీలు, మంగళవారం 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరు మండలం మినుములూరులో మంగళవారం 11 డిగ్రీల ఉష్ణోగ్రత నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తుండగా సూర్యోదయం ఆలస్యమవుతుంది. పాడేరు, దాని సమీప ప్రాంతాల్లో అర్ధరాత్రి, వేకువజామున మాత్రం చలి తీవ్రత ఎక్కువగా ఉంది.

ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్ మచిలీపట్నం వరకు పొడిగింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులు, సరుకు రవాణాలో భారతీయ రైల్వే కీలకపాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మచిలీపట్నం వరకు పొడిగించిన ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం విజయవాడ రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను మచిలీపట్నం వరకు పొడిగించడం ద్వారా కోస్తా జిల్లాలకు, రాయలసీమకు మధ్య కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, డీఆర్‌ఎం శివేంద్రమోహన్, ఏడీఆర్‌ఎంలు శ్రీకాంత్, శ్రీనివాసరావు, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, స్టేషన్ డైరెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులను చిత్రహింసలు పెడుతున్నారు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



నందిగాం: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు తమకు ఇష్టం వచ్చిన చోట అమ్ముకునే అవకాశం ఇవ్వకుండా దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు పంపించి చిత్రహింసలకు గురి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా నందిగాంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సగం మాత్రమే అయ్యిందని, ఎక్కడ చూసినా ధాన్యంతో రైతులు వేదన పడుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు అంతా మిల్లర్ల అసోసియేషన్ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరుతో ముఖ్యమంత్రి దగా చేస్తున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యం ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూనే, మూడో తరగతి చిన్నారులు దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లాలని చెప్పడం ఏంటని ప్రశ్నించారు.

తేనెటీగలు.. సృష్టిలోనే ఓ గొప్ప సహజసిద్ధ ఇంజనీర్లు. షడ్భుజాలతో ఆరు వేల గదుల ఇళ్లను పక్కపక్కనే నిర్మించుకోగల సామర్థ్యం వీటి సొంతం. సమైక్య జీవనానికి ప్రతీకలైన మధుమక్షికలు వేలాది కిలోమీటర్ల మేర ప్రయాణించి.. పూలలోని మకరందాన్ని సేకరించుకొస్తాయి. వీటి నిరంతర శ్రమ వల్లే భూలోకంలోని చెట్లు, మొక్కలు మనగలుగుతున్నాయి. ఎన్నో పంటలు వీటివల్లే పండుతున్నాయి. ఈ చిరు ప్రాణులు జీవకోటికి చేస్తున్న మేలు ఎంతంటే.. తేనెటీగలు మొత్తం అంతరించిపోతే కేవలం 30 రోజుల్లో భూమండలంపై ప్రాణికోటి కూడా అంతరించిపోతుంది. అంతటి విశిష్టత గల తేనెటీగలకు మానవాళి వల్ల పెద్ద కష్టమే వచ్చిపడింది. 180 రకాల తేనెటీగల జాతులు అత్యంత ప్రమాదంలో చిక్కుకున్నాయని ఐక్యరాజ్య సమితి తేల్చింది. వీటిని సంరక్షించేందుకు రంగంలోకి దిగింది.

-సాక్షి, అమరావతి


బీ అలర్ట్



వందేళ్లలో 18 జాతుల తేనెటీగలు కనుమరుగు

అత్యంత ప్రమాదంలో మరో 180 జాతులు

- మితిమీరిన పురుగు మందుల వినియోగమే కారణం
- ప్రపంచంలో మూడోవంతు పంటలు పండేది వీటివల్లే
- 90 శాతానికి పైగా వృక్ష, 2.50 లక్షల పుష్పించే మొక్క జాతులు వీటితోనే వృద్ధి
- వీటిని పరిరక్షించేందుకు రంగంలోకి దిగిన ఐక్యరాజ్య సమితి



భూమండలాన్ని పచ్చగా ఉంచేందుకు మట్టి, నీరు, సూర్యరశ్మి ఎంత అవసరమో తేనెటీగలు (మధుమక్షికలు) కూడా అంతే అవసరం. నేలపై ఉన్న వృక్ష జాతులతోపాటు 90 శాతానికి పైగా పంటలు తేనెటీగల వల్లే అభివృద్ధి చెందుతున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. మానవాళి జీవితం మొత్తం ఇతర జీవులతో ముడిపడి ఉంది. వాటిలో అత్యంత ముఖ్యమైన ప్రాణి తేనెటీగ. ప్రకృతికి ఎంతో మేలు చేస్తున్న తేనెటీగలు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. కేవలం పూల మకరందంపై ఆధారపడి జీవించే తేనెటీగలు పంటలపై మితిమీరి వినియోగిస్తున్న పురుగు మందులు, కాలుష్యం కారణంగా మరణిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సైతం తేనెటీగల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రపంచవ్యాప్తంగా అమలు చేయాలని అన్ని దేశాలను కోరుతోందంటే వీటి అవసరం ప్రపంచానికి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. తేనెటీగలు జీవ వైవిధ్యంలో భాగం. మానవ మనుగడ అంతా వాటిపైనే ఆధారపడి ఉంది. పంటలు సకాలంలో పండడంలో కీలకమైన పరపరాగ సంపర్కానికి అత్యంత వేగవంతమైన వాహకాలుగా ఇవి సేవలు అందిస్తున్నాయి. ఇది నాణేనికి ఒకవైపు అయితే, ప్రజలకు అత్యంత నాణ్యమైన ఆహారమైన తేనె, రాయల్ జెల్లీ, మైనం వంటి వాటిని అందించడంతో పాటు తేనెటీగల విషాన్ని సేకరించి ఇతర ఉత్పత్తులకు వినియోగిస్తున్నారు.

పురుగు మందుల వాడకంతో..

పంటల రక్షణ కోసం పురుగు మందులను మితిమీరి వినియోగిస్తుండటంతో తేనెటీగల జాతి తగ్గిపోతోందని జీవవైవిధ్య శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా తేనెటీగలు పూల సువాసనను గుర్తించలేకపోతున్నాయని పరిశోధనల్లో తేలింది. ఈ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల జాతులు అంతరించిపోతున్నట్టు యూకే అగ్రికల్చరల్ విభాగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆ దేశంలో గత పదేళ్లలో 13 జాతులు అంతరించిపోగా.. మరో 35 జాతులు ప్రమాదంలో ఉన్నాయని గుర్తించింది. అందుకు పంటలకు వాడుతున్న నికోటినాయిడ్స్ కారణమని వెల్లడించింది. వందేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 18 జాతులు పూర్తిగా కనుమరుగైపోయాయని, మరో 180 జాతులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ కన్జర్వేషన్ క్యూరేట్ (ఐయూసీఎన్) ప్రకటించింది. యుద్ధప్రాతిపదికన తేనెటీగల సంతతిని పెంచకపోతే సమీప భవిష్యత్‌లో ప్రపంచం ఆహార కొరతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది.

రక్షణకు తక్షణ చర్యలు అవసరం

మొక్కలు, పూల పరాగ సంపర్కానికి తేనెటీగల అవసరాన్ని గుర్తించిన యూరోపియన్ యూనియన్ 2018 మేలో నియోనికోటినాయిడ్స్ అని పిలిచే మూడు రకాల పురుగుమందులపై నిషేధాన్ని విధించింది. అయితే, అంతకు ముందే 2011లో స్లోవేనియా దేశం తేనెటీగలకు హానికరమైన చాలా పురుగు మందులను నిషేధించిన తొలి దేశంగా గుర్తింపు పొందింది. కాగా, 2019 చైనాలోని కున్మింగ్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ (కాప్-15)లో 2030 నాటికి పంటలపై పురుగు మందుల వాడకాన్ని మూడింట రెండొంతులు తగ్గించాలని నిర్ణయించింది. ప్రపంచంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార ధాన్యాల కొరతను తగ్గించాలంటే తేనెటీగల సంఖ్య పెరగాలని.. ఆ ప్రాణులు బతకాలంటే రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం ఒక్కటే పరిష్కారమని ఆ సదస్సులో ప్రతినిధులు పేర్కొన్నారు. తేనెటీగల ఆవాసాలను రక్షించడానికి, ప్రభుత్వాలు, సంస్థలు, పౌర సమాజాన్ని చైతన్యం చేసి ప్రోత్సహించడానికి ఐక్యరాజ్య సమితి ఏటా మే 20న ప్రపంచ తేనెటీగల దినోత్సవం నిర్వహించాలని ప్రకటించింది.

మూడో వంతు ఆహారోత్పత్తి వీటివల్లే..

ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్ పాలసీ ప్లాట్‌ఫామ్ ఆన్ బయోడైవర్సిటీ అండ్ ఎకో సిస్టం సర్వీస్ (ఐపీబీఈఎస్) పేర్కొంటున్న ప్రకారం దాదాపు 80 మిలియన్ల సంవత్సరాలుగా తేనెటీగల ప్రపంచంలో అత్యంత పరాగ సంపర్కం చేసి నేరుగా ఆహార భద్రతకు దోహదం చేస్తున్నాయి. ఏటా 1.77 మిలియన్ మెట్రిక్ టన్నుల తేనెను మనకు అందిస్తున్నాయి. ప్రపంచంలోని ఆహార ఉత్పత్తిలో మూడోవంతు తేనెటీగల పైనే ఆధారపడి ఉందని ఐక్యరాజ్య సమితిలోని ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) ప్రకటించిందంటే వీటి ప్రాధాన్యం ఎంతో అర్థం చేసుకోవచ్చు. తుమ్మెదలు, సీతాకోక చిలుకలు, పక్షులు, కొన్ని జంతువులు, కీటకాలు పరాగ సంపర్కానికి, మొక్కల పునరుత్పత్తికి దోహదం చేస్తున్నా.. అత్యంత సాధారణ పరాగ సంపర్కాలలో తేనెటీగలు ముందున్నాయి.



ఏపీ విద్యా పథకాలు అద్భుతం

- ఢిల్లీ విద్యావేత్తల బృందం ప్రశంసలు
- ఇక్కడి మంచి విధానాలపై మా ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలు, పథకాలు, వాటిని సమగ్రంగా అమలు చేసేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థలు అద్భుతంగా ఉన్నాయని ఢిల్లీకి చెందిన విద్యావేత్తల బృందం ప్రశంసించింది. రాష్ట్ర విద్యా వ్యవస్థలో అమలవుతున్న వివిధ పథకాలు, స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఢిల్లీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 60 మంది విద్యావేత్తల బృందం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా విజయవాడలో 28 మంది సభ్యుల బృందం గత రెండు రోజులుగా కృష్ణా జిల్లాలోని పెనమలూరు, నిడమానూరు పాఠశాలలను సందర్శించింది. ఈ బృందానికి రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి ఆహ్వానం పలికారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, డిజిటల్ విద్య, జగనన్న అమ్మఒడి, మన బడి నాడు-నేడు, ద్వి భాషా పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల సహ పాఠ్య కార్యక్రమాలను బృందం పరిశీలించింది. పెనమలూరు విద్యార్థుల డ్రమ్స్, నిడమానూరులో యోగా ప్రదర్శనలను ఆసక్తితో తిలకించింది. అనంతరం రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను ఈ బృందం పరిశీలించింది. ఎస్‌సీఈఆర్‌టీ అధ్యాపక బృందంతో వివిధ బోధన విధానాల గురించి పరస్పరం అభిప్రాయాలు పంచుకుంది. ఢిల్లీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి కూడా బృందం వివరించింది. అనంతరం సమగ్ర శిక్ష కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఎస్పీడీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాల్ట్ పథకంలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థలు విద్యా శాఖతో కలిసి పనిచేస్తున్న అంశాల మీద అవగాహన కల్పించారు. మృదుల భరద్వాజ్ ఆధ్వర్యంలో పర్యటిస్తున్న ఈ బృందం రాష్ట్రంలో అమలవుతున్న పథకాల పట్ల సంతోషం వ్యక్తం చేసింది. ఇక్కడ జరుగుతున్న మంచి విధానాలపై తమ రాష్ట్ర అధికారులకు నివేదిక సమర్పిస్తామని మృదుల భరద్వాజ్ చెప్పారు.

ఏబీవీపై చర్యలు తీసుకోండి

- రెండు స్టేజ్‌ల టైమ్ స్కేల్ తగ్గించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- ఆయనపై రెండు అభియోగాలు నిరూపితం
- కుమారుడికి అడ్డగోలు ప్రయోజనం కలిగించేందుకే ఆ కాంట్రాక్టు
- అఖిల భారత సర్వీసు నిబంధనలనూ ఉల్లంఘించారు
- సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు తీరుపై నిగ్గుతేల్చిన యూపీఎస్సీ



సాక్షి, అమరావతి : నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ)పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఆయనకు రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించాలని తెలిపింది. 2024, మే 31వరకు ఇది అమలులో ఉంటుందని పేర్కొంది. ఏబీవీపై రెండు అభియోగాలు నిరూపితమయ్యాయని వెల్లడించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆయనపై మూడు అభియోగాల్లో ఒకటి పూర్తిగానూ మరొకటి పాక్షికంగానూ నిర్ధారణ అయ్యాయని యూపీఎస్సీ కేంద్ర హోంశాఖకు నివేదించింది. ఇజ్రాయెల్ కంపెనీ నుంచి నిఘా పరికరాల కొనుగోలు ద్వారా తన కుమారుడు చేతన్ సాయికృష్ణ భాగస్వామిగా ఉన్న కంపెనీకి ప్రయోజనం కలిగించేందుకు ఏబీవీ యత్నించారని.. అఖిల భారత సర్వీసు నిబంధనలకు సైతం విరుద్ధంగా వ్యవహరించారని తెలిపింది. దాంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్‌ను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలిపింది. అంతేకాక.. అఖిల భారత సర్వీసు నిబంధనలు-1969 ప్రకారం ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టంచేసింది.

కుమారుడి కంపెనీకి అడ్డగోలు కాంట్రాక్టు కోసమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా నిఘా పరికరాల కొనుగోలుకు సిద్ధపడ్డారని యూపీఎస్సీ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఇన్‌ఫ్లేమబుల్ లిమిటెడ్, ఆర్‌టీఏల్‌టీఏ కంపెనీల నుంచి ఏరో స్టాట్, యూఏవీ నిఘా పరికరాల కొనుగోలుకు ఏకపక్షంగా నిర్ణయించారు. తద్వారా భారత్‌లో ఆ కంపెనీ ప్రతినిధిగా ఉన్న ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు అయాచిత లబ్ధికి ప్రయత్నించారు. మరోవైపు.. ఏబీవీ కుమారుడు చేతన్‌సాయి ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు సీఈఓ కావడం గమనార్హం. తన ఉన్నతాధికారుల అనుమతిలేకుండా ఏబీవీ ఏకపక్షంగా వ్యవహరించారు. కనీసం కొనుగోలు కమిటీని కూడా నియమించకుండానే 2018, జూన్ 26న నిర్వహించిన సమావేశంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. పరికరాల నాణ్యత, గ్యారంటీ, నిర్వహణ కాలం మొదలైన సాంకేతిక ప్రమాణాలను తగ్గించి మరీ ఆమోదించేశారు. విధి నిర్వహణలో ఉత్సుకతతోనే ఇలా చేశానన్న ఏబీ వెంకటేశ్వరరావు వాదనను యూపీఎస్సీ తిరస్కరించింది. విధి నిర్వహణలో ఉత్సుకత వేరు, అవినీతి వేరని స్పష్టంచేసింది. కాబట్టి కుమారుడి కంపెనీకి అడ్డగోలుగా ప్రయోజనం కలిగించేందుకు ఏబీ వెంకటేశ్వరరావు యత్నించారన్న అభియోగాలను పాక్షికంగా నిర్ధారణయ్యాయని యూపీఎస్సీ నిగ్గుతేల్చింది.

సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు

అంతేకాక.. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో ఏబీ వెంకటేశ్వరరావు అఖిల భారత సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని కూడా యూపీఎస్సీ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌కు చెందిన కంపెనీల నుంచి నిఘా పరికరాలు కొనుగోలు చేస్తున్న విషయాన్ని ఆయన ప్రభుత్వానికి కూడా తెలుపనేలేదని స్పష్టంచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అఖిల భారత సర్వీసు నిబంధనలు 4(2)ఏ, 4(2)బి, 4(3)ఏ, 4(3)బిలను ఆయన ఉల్లంఘించారని వెల్లడించింది. ప్రభుత్వం తరఫున ఓ అధికారి ఏదైనా ప్రైవేటు సంస్థతో ఒప్పందం చేసుకునేటప్పుడు ఆ సంస్థలో తన కుటుంబ సభ్యులెవరూ ఉండకూడదనే నిబంధనను ఆయన ఉల్లంఘించారు. అంతేకాదు.. ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచడం కూడా క్రమశిక్షణారాహిత్యం కిందకే వస్తుంది. ఈ అంశంలో ఆయనపై అభియోగాలు నిరూపితమయ్యాయి. ఇక నిఘా పరికరాల కొనుగోలుకు ఇజ్రాయెల్ కంపెనీకి చెల్లించిన రూ.10లక్షలను ఆ కంపెనీ వెనక్కి ఇచ్చేసినందున ఏబీ వెంకటేశ్వరరావు చర్యలతో ప్రభుత్వానికి కలిగిన ఆర్థిక నష్టం భర్తీ అయ్యిందని యూపీఎస్సీ చెప్పింది.

ఆపరేషన్ చేశారు.. కడుపులో సర్జికల్ క్లాత్ మరిచారు!

- మైలవరంలో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- ఆపరేషన్ చేసి క్లాత్ తొలగించిన మరో ఆస్పత్రి వైద్యులు

మైలవరం: ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాకం మహిళ ప్రాణాల మీదకు తెచ్చింది. గర్భసంచి తొలగించేందుకు ఆపరేషన్ నిర్వహించిన వైద్యులు కడుపులోనే సర్జికల్ క్లాత్ వదిలేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన కొరివిడి శివపార్వతి తరచూ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేది. ఆమె ఆరు నెలల కిందట ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని అను హాస్పటల్‌కు వెళ్లింది. ఆమెకు వైద్యులు గర్భసంచి తొలగించాలని చెప్పి ఆపరేషన్ చేశారు. అయినా కడుపు నొప్పి తగ్గకపోవడంతో మళ్లీ పలుమార్లు అను ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. చివరికి 20 రోజుల కిందట విజయవాడలోని హరిణి ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులు స్కానింగ్ చేసి కడుపులో గుడ్డ వంటి పదార్థం ఉన్నట్టు గుర్తించారు. ఆపరేషన్ చేయగా బాధితురాలి కడుపులో సర్జికల్ క్లాత్ ఉండటంతో తొలగించారు. శివపార్వతి డిశ్చార్జి అయిన అనంతరం మంగళవారం ఈ విషయంపై మాట్లాడేందుకు మైలవరంలోని అస్పత్రికి వచ్చి ఆమె బంధువులు... వైద్యులు సరిగా స్పందించలేదని ఆందోళన చేశారు.

లింగమనేని రమేష్ నిలువునా ముంచాడు

- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు



మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత బీఎస్ రావు, పక్కన న్యాయవాదులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ విద్యాసంస్థల విస్తరణకు అవసరమైన భూములు, భవనాలను ఇస్తానని చెప్పి లింగమనేని రమేష్ తన దగ్గర నుంచి రూ.310 కోట్లు తీసుకున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు ఆరోపించారు. అయితే ఇంతవరకు భూములు, భవనాలు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలోని ఒక హోటల్‌లో మంగళవారం తన న్యాయవాదులతో కలసి బీఎస్ రావు మీడియాతో మాట్లాడారు. 2012లో విద్యా సంస్థల విస్తరణకు తనకు 300 ఎకరాల భూములు అవసరమయ్యాయన్నారు. ఈ క్రమంలో వాటిని తాను ఇస్తానని లింగమనేని రమేష్ తనను సంప్రదించాడని చెప్పారు. ఈ క్రమంలో పలుమార్లు రూ.310 కోట్ల నగదును ఆయనకు ఇచ్చానని బీఎస్ రావు తెలిపారు. భూములు, భవనాలను సేకరించి ఇవ్వలేకపోతే తానిచ్చిన మొత్తం నగదును వడ్డీతో సహా చెల్లిస్తామని లింగమనేని 2013లో తనతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే ఇప్పటివరకు ఒక ఎకరం భూమి అప్పగించలేదని వాపోయారు.

ఆ హామీని కూడా నెరవేర్చలేదు..

భూములు అప్పగించాలని తాను అనేకసార్లు అడిగితే 2015లో భూములను కొని.. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని లింగమనేని తనతో ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. అది కూడా నెరవేర్చలేదన్నారు. 2016లో స్మార్ట్ సిటీలో 100 ఎకరాల భూమిని తన విద్యాసంస్థలకు చెందిన గ్రూప్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తానని లింగమనేని చెప్పారని వెల్లడించారు. అలా చేయడంలో విఫలమైతే 18 శాతం వడ్డీతో నగదు మొత్తాన్ని చెల్లిస్తానని హామీ కూడా ఇచ్చారన్నారు. దీన్ని కూడా లింగమనేని రమేష్ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. తర్వాత జరిగిన మధ్యవర్తిత్వాలతో తనకు 15 చెక్కులను ఇచ్చారని.. వాటిని బ్యాంక్‌లో జమ చేసినప్పుడు బ్యాంకులకు స్టాప్ పేమెంట్ అని లింగమనేని సమాచారం ఇచ్చారన్నారు. దీంతో బ్యాంకులు ఆ చెక్కులను తిరస్కరించాయని తెలిపారు.

హైదరాబాద్‌లో లింగమనేనిపై కేసు..

రమేష్ మోసం చేస్తున్నారని గ్రహించి హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఆయన గ్రూప్‌లపై క్రిమినల్ కేసులు పెట్టామని బీఎస్ రావు చెప్పారు. లింగమనేని రమేష్, లింగమనేని రాజశేఖర్, లింగమనేని స్వర్ణకుమారి, లింగమనేని ప్రశాంతి, లింగమనేని సుమానా, కాకర్ల వినయ్‌లపై పోలీసులు ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారన్నారు. నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైకోర్టుల్లో కూడా కేసులు వేశామని తెలిపారు. తనకు ఇచ్చిన చెక్కుల్లో 20 శాతం నగదును చెల్లించాల్సిందిగా రమేష్ గ్రూప్‌నకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయినాతనకు నగదు ఇవ్వలేదని బీఎస్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. లింగమనేని రమేష్ గ్రూప్‌నకు చెందిన స్థిర, చరాస్తులను రెవెన్యూ యాక్టు కింద అటాచ్ చేసి తనకు ఇవ్వాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినా స్పందన లేదన్నారు. లింగమనేని రమేష్ కంపెనీలపై చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఐదు కేసులను దాఖలు చేశామని.. అవి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సుప్రీం కోర్టు కూడా 18 శాతం వడ్డీతో వాయిదాల వారీగా నగదు మొత్తం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా రమేష్ పాటించడం లేదన్నారు.

బీఎస్ రావు ఆరోపణలు అవాస్తవం: లింగమనేని రమేష్

శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత బీఎస్ రావు తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని లింగమనేని రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైతన్య విద్యా సంస్థల గ్రూప్‌నకు, తమ గ్రూప్‌నకు మధ్య ఆర్థిక, వ్యాపార వివాదాలు ఉన్నమాట నిజమేనని పేర్కొన్నారు. అయితే, ఆయనను మోసం చేశామని బీఎస్ రావు ఆరోపించడం అవాస్తవమని తెలిపారు. ఈ అంశాలన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయని, ఇప్పటివరకు ఏ న్యాయస్థానం కూడా తాము తప్పు చేసినట్లు తీర్పు ఇవ్వలేదని లింగమనేని రమేష్ పేర్కొన్నారు.

మహిళలపై దాడులకు పాల్పడేవారిని ఉపేక్షించం

- హోం మంత్రి తానేటి వనిత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళల భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని హోంమంత్రి తానేటి వనిత చెప్పారు. మహిళలపై దాడులకు పాల్పడేవారిని ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించకుండా కఠినంగా శిక్షిస్తుందని స్పష్టంచేశారు. తాడేపల్లిలో బాలికను హత్య చేసిన నిందితుడిని కేవలం గంట వ్యవధిలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆమె చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో హోంమంత్రి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లిలో బాలికను నిందితుడు వ్యక్తిగత కక్షతోనే హత్య చేశాడని పోలీసుల విచారణలో తేలిందని తెలిపారు. నిందితుడికి న్యాయస్థానంలో కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. మృతురాలి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.10లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించిందని వెల్లడించారు. తాడేపల్లిలో హత్య జరిగింది కాబట్టి సీఎం వైఎస్ జగన్ రాజీనామా చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తుండటం హాస్యాస్పదమన్నారు. గోదావరి పుష్కరాల్లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రచారార్భాటం కోసం 29మంది దుర్మరణం చెందినప్పుడు చంద్రబాబు ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ఇటీవల కందుకూరు, గుంటూరులో టీడీపీ ర్యాలీ, సభల్లో తొక్కిసలాటలు జరిగి 11మంది దుర్మరణం చెందినప్పుడు ఆయన ఏం చేశారని నిలదీశారు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లి సానుభూతి పొందాలని టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదను కాపాడుకోవాలి

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- అమరావతిలో ధ్యాన బుద్ధవనం ప్రారంభం



ధ్యాన బుద్ధవనం ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి, రోజా, నంబూరు శంకరరావు తదితరులు

అమరావతి : మన దేశానికి చెందిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత భారతీయులందరిపై ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా అమరావతిలో నిర్మించిన 'ధ్యాన బుద్ధవనం'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో చేసుకున్న విదేశీ దౌత్య ఒప్పందాల వల్ల 2014 నుంచి ఇప్పటి వరకు వివిధ దేశాల నుంచి 229 శిల్పాలను వెనక్కి తీసుకువచ్చామని తెలిపారు. లండన్ మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్పాన్ని తీసుకువచ్చి ఇక్కడి పురావస్తు శాఖ అధికారులకు అప్పగించామని వివరించారు. స్వదేశీ దర్శన్ పథకం ద్వారా ఏపీకి రూ.141 కోట్లు కేటాయించి ఐదు బౌద్ధక్షేత్రాలైన శ్రీకాకుళం జిల్లా శాలిహుండం, అనకాపల్లి వద్ద తొట్లకొండ, బొజ్జన కొండ, పల్నాడు జిల్లాలోని అమరావతి, నాగార్జున సాగర్ వద్ద ఉన్న అనుపులను బుద్ధిస్ట్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేశామని వివరించారు. దానిలో భాగంగానే రూ.15కోట్లతో ధ్యానబుద్ధవనం నిర్మించామని తెలిపారు. ఈ ఏడాది జీ-20 గ్రూప్‌నకు భారతదేశం అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో 20 సభ్య దేశాలతోపాటు ప్రత్యేక ఆహ్వానిత దేశాలతో కలుపుకొని 29 దేశాలకు చెందిన 1.5లక్షల మంది ప్రతినిధులు మన దేశాన్ని సందర్శించనున్నారని తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ 56 నగరాల్లో 250 సమావేశాలు నిర్వహించి భారతదేశ చరిత్ర, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికి కృషి చేస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ ఆరిమండ వరప్రసాదరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జాతీయ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్, ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పాల్గొన్నారు.

ఏపీ విద్యావిధానం ప్రశంసనీయం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యావిధానం చాలా బాగుందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ అభినందించారు. విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏర్పాటు చేసిన స్టాల్‌ను వారు మంగళవారం పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో పరిశోధనలు చేస్తున్నారా? ఏయే అంశాలను నేర్చుకుంటున్నారు? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్ ఉత్పత్తులను చూసి అభినందించారు. మరోవైపు విజయవాడ బందరు రోడ్డులో ఉన్న బాపు మ్యూజియాన్ని కూడా కిషన్‌రెడ్డి పరిశీలించారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు.


సత్వీందర్ సింగ్

పంజాబ్‌లో'హనీమూన్‌బ్రైడ్స్' అనే మాట వినిపిస్తూ ఉంటుంది.
అంటే పెళ్లి చేసుకున్న ఎన్.ఆర్.ఐలు
కాపురానికి తీసుకెళ్లి మూణ్ణాళ్ల ముచ్చటగా
కాపురం చేసి ఆ తర్వాత పెళ్లికూతుళ్లను పుట్టింటికి తరిమేస్తారు.
సత్వీందర్ కౌర్ కూడా అలాంటి బాధితురాలే.
కాని ఆమె ఊరికే ఉండలేదు.
లూధియానాలో ఒక సంస్థ స్థాపించి
ఎన్ఆర్ఐ బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూసింది.
న్యాయం జరగాలంటే ఏం చేయాలో కూడా చెబుతోంది.

ఎన్.ఆర్.ఐ భర్తల మోసం చెల్లదు

పంజాబ్, హరియాణాలలో ఎన్.ఆర్.ఐ భర్తలు మోసం చేసిన భార్యల సంఖ్య ప్రస్తుతం ఎంత ఉంటుందో ఊహించండి.

32,000.

పెళ్లి చేసుకుని ఉద్యోగాలు విదేశాలలో తెచ్చుకుని మాయమైన ఎన్.ఆర్.ఐలు కొందరైతే విదేశాల్లో ఉంటూ ఇక్కడకు వచ్చి పెళ్లి చేసుకొని కొన్నాళ్లు కాపురం చేసి ఆ తర్వాత ఉడాయించిన వాళ్లు కొందరు. వీరి గురించి ఆరా తీస్తూ, ఎదురు చూస్తూ, వారిని శిక్షించాలని ప్రయత్నిస్తూ పోలీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగే ఈ వివాహితులను అక్కడ 'హనీమూన్ బ్రైడ్స్' అంటూ ఉంటారు. విషాదం ఏమంటే వీరి సగటు వయసు 22 నుంచి 65 వరకూ ఉండటం. ముప్పై ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని విదేశాలకు పారిపోయిన భర్తల కోసం ఎదురు చూస్తున్న మహిళలు ఇంకా అక్కడ ఉన్నారు. వారందరికీ ఒక ఓదార్పు లూధియానాలో 'అబ్ నహీ' సంస్థను నడుపుతున్న 41 ఏళ్ల సత్వీందర్ సింగ్.


బాధిత మహిళలతో సత్వీందర్ సింగ్

స్వయంగా బాధితురాలు

లూధియానాకు చెందిన సత్వీందర్ సింగ్ టీచర్‌గా పని చేసేది. టీచర్ సంబంధమే వస్తే 2009లో వివాహం చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత భర్త విదేశాలలో ఉద్యోగం వచ్చిందని జార్జియా వెళ్లాడు. అక్కడి నుంచి ఉక్రెయిన్ వెళ్లాడు. సత్వీందర్ అత్తారింటిలోనే ఉండిపోయింది. ఐదేళ్ల తర్వాత 2015లో తిరిగి వచ్చిన భర్త ఆమెను అత్తారింటి నుంచి ఒక అద్దె ఇంటికి మార్చి ఒక నెల ఉండి మళ్లీ ఉక్రెయిన్‌కు వెళ్లిపోయాడు. త్వరలో వచ్చి తీసుకెళతాను అనే దొంగ హామీ మీద. కాని ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవడంతోటే 'ఇక నీకూ నాకూ సంబంధం లేదు' అని ఫోన్ చేసి చెప్పేశాడు. సత్వీందర్ వెంటనే అత్తామామల దగ్గరకు వెళితే వాళ్లు ముఖాన తలుపులు వేసేశారు. ఒక సంవత్సరం పాటు చేష్టలుడిగి ఉండిపోయిన సత్వీందర్ ఆ నిద్ర నుంచి మేల్కొని న్యాయం కోసం గట్టిగా పట్టుబట్టింది. భర్త మీద, అత్త మామల మీద సెక్షన్ 406, 498ల కింద కేసు పెట్టింది. కోర్టులో మెయింటెనెన్స్ కేసు వేస్తే నెలకు 10 వేలు మంజూరయ్యాయి. 2018లో భర్త పాస్‌పోర్ట్ సీజ్ అయ్యేలా చూసింది. ఇవన్నీ చిన్న విజయాలు కావు.

తనలాంటి వారి కోసం

ఆ సమయంలో కోర్టు దగ్గర, పోలీస్ స్టేషన్ దగ్గర తన లాంటి వివాహితలు మరికొంత మంది కనిపించేవారు సత్వీందర్‌కు. 'ఇంతమంది ఉన్నారా... వీరందరి కోసం ఏదైనా చేయాలి' అని 'అబ్ నహీ' సంస్థ స్థాపించింది. చిన్న చిన్న సమావేశాలు పెట్టి ఇలాంటి బాధిత మహిళలను సమీకరించడం మొదలెట్టింది. ఈమె చేస్తున్న పని ఆ నోటా ఈ నోటా తెలిసి బాధితులు రావడం మొదలెట్టారు. అయితే ఇది అంత సులభం కాదు. పారిపోయిన కుర్రాళ్ల కుటుంబాలు ఈమె చేసే నిరసన కార్యక్రమాలకు, పెడుతున్న కేసులకు ఆగ్రహించేవి. శాపనార్థాలు పెట్టేవి. తన్నబోయేవి. అయినా సత్వీందర్ జంకకుండా తన పోరాటాన్ని కొనసాగించింది. ఎన్.ఆర్.ఐ సెల్స్ ద్వారా మహిళా కమిషన్ ద్వారా బాధితులకు మద్దతు దొరికేలా చేసేది. అంతేకాదు, జాతీయ గురుద్వారా కమిటీ ద్వారా విదేశాలలో ఉన్న గురుద్వారాలకు ఇలా పారిపోయిన వరుల వివరాలు తెలుపుతూ తాకీదులు అందేలా చేసింది. అంటే అక్కడ ఉన్న వారి గురించి కనీసం అక్కడ ఉన్న పంజాబీలకు తెలిసేలా చేయగలిగింది. కొందరు భర్తలు ఏ దేశాల్లో అయితే ఉద్యోగాలు చేస్తున్నారో అక్కడి లీగల్ సెల్స్‌కు అదే పనిగా ఈ మెయిల్స్ పంపి ఫిర్యాదు చేస్తుంది. విదేశాంగ శాఖకు పదే పదే వినతి చేయడం వల్ల ఆ శాఖ కూడా రంగంలో దిగి ఇలాంటి కేసులు నమోదైన భర్తల పాస్‌పోర్ట్‌ల వివరాలను సేకరించి అవసరమైతే సీజ్ చేసే చర్యలు చేస్తోంది.

ఇప్పటికి 700 మంది

సత్వీందర్ సింగ్ ఇప్పటికి 700 మంది వివాహితలకు ఏదో ఒక మేర న్యాయం అందేలా చేసింది. అలాగే భర్తలను విడిచిపెట్టి ఉడాయించిన భార్యల బాధితులైన 40 మంది భర్తలకు కూడా న్యాయం అందడానికి పోరాడుతూ ఉంది. 'భార్యను విడిచి వెళ్లిపోయిన భర్తల కేసుల్లో ఇరుపక్షాలను కూచోబెట్టి సమస్య కనుక్కుంటే చాలా కేసులు విడిపోయే దాకా వెళ్లకుండా ఆపొచ్చు. కొన్నింటిలో మాత్రం మోసగాళ్లు ఉంటారు. వారికి శిక్ష పడేలా చేయాలి.' అంటుంది సత్వీందర్. సోషల్ మీడియా ద్వారా ఫేస్‌బుక్ ద్వారా బాధితులను గుర్తించి వారికి సహాయం అందేలా చేయడానికి ప్రయత్నిస్తోందామె. 'మన పోలీసులు దేశంలో లేకుండా పోయిన వారంటే ఏమీ చేయలేము అన్నట్టు చూస్తుంటారు. కాని అలా విదేశాలకు పారిపోయిన వారికి తప్పకుండా శిక్ష పడుతుంది అనే విధంగా చర్యలు ఉంటే ఎన్.ఆర్.ఐల ఆగడాలు ఆగుతాయి' అంటుంది సత్వీందర్.

పంజాబ్, హరియాణాలలో అయితే సత్వీందర్ ఉంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇలాంటి బాధితులు ఎందరు ఉన్నారో తెలియాల్సి ఉంది. వారి కోసం సత్వీందర్‌లాంటి వాళ్ల అవసరం తప్పక ఉంటుందని వేరే చెప్పాలా?


చిత్తా ఆరోగ్యరాణి,
ఫౌండర్, మదర్ థెరెస్సా ఫౌండేషన్,
పోరుమామిళ్ల, కడప జిల్లా

'అమ్మా!' అనే పిలుపును ఆస్వాదించని మహిళ ఉండదు.
ఆ పిలుపును ఎన్ని గొంతులతో వింటే అంత సంతోషం.
అందుకే అమ్మలేని పిల్లలకు అమ్మ అయ్యారామె.
వాళ్లకు అన్న... అక్క... అమ్మమ్మ... నానమ్మలనూ ఇచ్చారు.
అనాథలకు ఆశ్రయంతోపాటు అనుబంధాలనూ ఇస్తున్నారు.

అమ్మగా ఎదిగాను!

ఆరోగ్యరాణి సొంతూరు గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వరగాణి. ఆమె సేవకు కేంద్రం వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల. గుంటూరు నుంచి కడపకు సాగిన సేవాప్రస్థానాన్ని ఆమె సాక్షితో పంచుకున్నారు.

''మా నాన్న ఆడపిల్లల చదువు కోసం చాలా గట్టిగా నిలబడ్డారు. అదే నేను ఈ రోజు బాలికల కోసం హోమ్ నడపడానికి మూలకారణం. ఆయన కొంతకాలం టీచర్‌గా ఉద్యోగం చేసి ఊరికి దూరంగా ఉండడం ఇష్టం లేక హైదరాబాద్ నుంచి వరగాణికి వచ్చేసి వ్యవసాయంలో స్థిరపడ్డారు. బంధువులు, ఊరివాళ్లు 'ఆడపిల్లకు పెళ్లి చేయకుండా ఇంకా ఎంతకాలం చదువుకు పంపిస్తావ్' అని ఎంత ఒత్తిడి తెచ్చినా సరే ఆయన అవన్నీ పట్టించుకోకుండా నన్ను, మా మేనమామ కూతురిని కూడా బీఈడీ వరకు చదివించారు.

పోరుమామిళ్లకు పిలుపు!

టెన్త్ క్లాస్ వరకు నెల్లూరు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో చదివాను. నేను బీఈడీ పూర్తి చేసిన టైమ్‌లో మా స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ పోరుమామిళ్లలో ఉన్నారు. తెలిసిన వాళ్ల ద్వారా నా గురించి వాకబు చేశారట. మాథ్స్ టీచర్ అవసరం ఉందని పిలిపించారు. అలా 1994లో పోరుమామిళ్లలోని 'అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా' స్కూల్‌లో మాథ్స్ అసిస్టెంట్‌గా చేరాను, ఇప్పుడు అదే స్కూల్ హెడ్‌మిస్ట్రెస్‌ని. ఆ తర్వాత ఏడాది నాకు పెళ్లయింది. మా అత్తగారు కూడా ఇదే స్కూల్‌లో టీచర్‌గా చేశారట. ఆ సంగతి మా పెళ్లయిన తరవాత తెలిసింది. నాకు ఈ ఊరితో ఈ స్కూల్‌తో అనుబంధం నాకు తెలియక ముందు ఏనాడో ముడిపడి ఉందనిపిస్తుంది. ఇక హోమ్ స్థాపనకు దారి తీసిన పరిస్థితులు కూడా అలాంటివే. ముందస్తు ప్రణాళిక ఏమీ లేదు, అప్రయత్నంగా బాధ్యత తీసుకున్నాను.


హోమ్‌లో పిల్లలతో ఆరోగ్యరాణి

బాధ్యత ఇంటికి వచ్చింది!

మా బంధువుల్లో ఒక పెద్దాయన కలసపాడులో తన ఇంట్లోనే పద్దెనిమిది మంది అబ్బాయిలకు ఆశ్రయం ఇచ్చేవారు. ఆయనకు వయసు మీద పడిన తరవాత ఓ రోజు మా వారి దగ్గరకు వచ్చి ''వీళ్లంతా బాగా చదువుకుంటున్నారు. నాకు శక్తి తగ్గిపోయింది. ఈ పిల్లలను వాళ్ల ఊళ్లకు పంపించేస్తే చదువు ఆగిపోతుంది. వీళ్ల జీవితాలు మీ చేతిలో పెడుతున్నాను. చేయగలిగింది చేయండి'' అన్నారు. అలా మా ఇంటికి వచ్చిన పిల్లలందరికీ అమ్మనయ్యాను. అందరికీ వండి, నేను బాక్సు పెట్టుకుని స్కూల్‌కి వెళ్లేదాన్ని. వాళ్లలో కొంతమంది ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మా హోమ్‌కి వచ్చి ఆ రోజు భోజనం స్పాన్సర్ చేస్తుంటారు. ఇది ఇలా ఉంటే మా మామగారి పేరు మీద 2002 నుంచి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాం, ఆ తరవాత మదర్ థెరెస్సా ఫౌండేషన్ పెట్టి వరదలు, సునామీ వంటి విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలు చేస్తుండేవాళ్లం. నాకు ఎక్కడికెళ్లినా చదువు లేకుండా చిన్న వయసులోనే పెళ్లితో ఇంటి బాధ్యతలు మోస్తున్న టీనేజ్ బాలికల మీద దృష్టి ఆగిపోయేది. అలాగే అమ్మానాన్నలు లేకపోవడంతో బంధువుల ఇళ్లలో ఇంటి పనులతో రోజులు వెళ్లదీస్తున్న బాలికలు కూడా. అప్పుడు మా నాన్న ఆడపిల్ల చదువు గురించి ఎంత గట్టిగా నిలబడ్డారో కళ్ల ముందు మెదిలేది. చాలామంది ఆడపిల్లలకు తమకోసం ఆలోచించేందుకు అమ్మానాన్నలు కూడా లేరు. ఒకవేళ తల్లి లేక తండ్రి మాత్రమే ఉన్నప్పటికీ ఆ ఇంటి ఆడపిల్ల పరిస్థితి దయనీయంగానే ఉంటుంది. అలాంటి బాలికల కోసం పనిచేయాలని గట్టిగా సంకల్పం చెప్పుకున్నాను. ఆడపిల్లల విషయంలో ఆశ్రయం, చదువుతోపాటు భద్రత కూడా చాలా ముఖ్యం. సరిగ్గా నిర్వహించగలనా అనే సందేహం పీడించింది. అప్పుడు మా వారు ''భగవంతుడు అవకాశం ఇచ్చినప్పుడు సమాజానికి తిరిగి ఇవ్వాలి. అలా చేయకపోతే దేవుడికి ఏమని లెక్క చెప్పాలి? ధైర్యంగా మొదలు పెట్టు'' అన్నారు. అలా 2012లో 30 మంది మా హోమ్‌కి వచ్చారు. ఈ పదేళ్లలో ఆ నంబరు 250కి దగ్గరైంది. కరోనా తరవాత కొత్త అడ్మిషన్‌లు తీసుకోలేదు. ఇప్పుడు 52 మంది ఉన్నారు.

అనుబంధాల నిలయం!

మా పిల్లల్లో ఇద్దరు ఎంబీయే చేశారు, బీటెక్ చేసి లండన్ వెళ్లారు, చాలామంది బీటెక్ చేస్తున్నారు. కొంతమంది టీచర్ ట్రైనింగ్‌లో ఉన్నారు. మా బాధ్యతగా సమాజానికి బాధ్యతగల పౌరులను ఇస్తున్నాం. నేను కన్న పిల్లల్లో అబ్బాయి ఎంబీయే. మా చారిటీ హాస్పిటల్ చూసుకుంటున్నాడు. అమ్మాయి సివిల్స్‌కి ప్రిపేరవుతోంది. హోమ్‌లో పిల్లలకు నేను అమ్మని, మా అబ్బాయి అన్న, అమ్మాయి అక్క. ఇక మా అమ్మని అమ్మమ్మ, అత్తమ్మని నానమ్మ అని పిలుస్తారు. హోమ్ అంటే ఆశ్రయం ఇచ్చి అన్నం పెట్టడమే కాదు, బంధాలతో అనుబంధాలను అల్లుకోవాలి. మరొకరి ఆశ్రయంలో ఉన్నామనే భావన కలగకూడదు. అందుకే అందరం ఇదే హోమ్‌లో ఉంటాం'' అని చెప్పారు ఆరోగ్యరాణి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: పాలకొలను వెంకటరామిరెడ్డి, సాక్షి, బద్వేల్, కడపజిల్లా

అదర్‌సైడ్

వెండితెర బంగారం

రవీనా టాండన్ సుపరిచిత నటి.
అయితే చాలామందికి ఆమెలో తెలియని కోణం సామాజిక స్పృహ.
స్త్రీల హక్కులు, చైతన్యం, సాధికారతకు సంబంధించిన కార్యక్రమాల్లో
రవీనా టాండన్ చురుగ్గా పాల్గొంటుంది.
జీ-20కి సంబంధించిన ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ వింగ్-డబ్ల్యూ20 డెలిగేట్‌గా
రవీనాకు సామాజిక స్వరాన్ని మరోసారి వినిపించే అవకాశం లభించింది.

డైరెక్టర్ రవి టాండన్ కుమార్తెగా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన రవీనా టాండన్ భిన్నమైన పాత్రలు చేసి తనను తాను నిరూపించుకుంది. నటిగా జాతీయ అవార్డ్‌తో పాటు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది.


రవీనా టాండన్

'కాలం కంటే కాస్త ముందుగా ఆలోచించే వ్యక్తి'గా గుర్తింపు సంపాదించింది.

తన కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు 21 సంవత్సరాల వయసులో 'సింగిల్ మదర్'గా పదకొండు సంవత్సరాల పూజా, ఎనిమిది సంవత్సరాల చయ్యలను దత్తత తీసుకుంది. సింగిల్ మదర్‌గా పిల్లలను దత్తత తీసుకోవడం ఆ తరువాత ట్రెండ్‌గా మారింది.

మహారాష్ట్రలోని వసై నగరంలో కొందరి దుర్మార్గం వల్ల 30 మంది అమ్మాయిలు నిరాశ్రయులయ్యారు. అందరూ 'అయ్యో!' అనే సానుభూతికే పరిమితమైన ఆ కాలంలో రవీనా వారికి అండగా నిలబడింది.

తన ఇంట్లోనే 30 మందికి ఆశ్రయం కల్పించింది. ఆ తరువాత వసైలో సొంత ఖర్చులతో అనాథాశ్రమం కట్టించి అందులో వారికి ఆశ్రయం ఇచ్చింది. ఇక అప్పటి నుంచి సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటూనే ఉంది.

సినిమాల్లో తన నటన కంటే 30 మంది అమ్మాయిలకు ఆశ్రయం కల్పించిన విషయం గురించే రవీనాతో చాలామంది మాట్లాడుతుంటారు. ఆ సందర్భం నుంచి తాము ఎలా స్ఫూర్తి పొందిందీ చెబుతుంటారు.

మంచి పనికి లభించే గుర్తింపు అది!

స్త్రీల హక్కులు, చైతన్యం, సాధికారతకు సంబంధించి యూనిసెఫ్‌తో... క్రై, వైట్ రిబ్బన్ (సేఫ్ మదర్‌హుడ్), స్మైల్ ఫౌండేషన్... మొదలైన స్వచ్ఛందసంస్థలతో కలిసి పనిచేస్తోంది రవీనా. 'పెటా'తో పాటు హైజీన్ ఆఫ్ యంగ్ గర్ల్స్, మిషన్ సాహసి(ఆత్మరక్షణ)... మొదలైన కార్యక్రమాలకు అంబాసిడర్‌గా వ్యవహరించింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎంగేజ్‌మెంట్ వింగ్-జీ20 డెలిగేట్‌గా నియామకం అయిన రవీనా టాండన్....

'భారతీయ మహిళ ప్రతినిధిగా ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎన్నో రంగాలకు చెందిన ఎంతో మంది మహిళలు విశేష కృషి చేశారు. సామాజిక, ఆర్థిక రంగాలలో మహిళల హక్కులు, అవకాశాల గురించి చర్చించడానికి ఇదొక మంచి అవకాశం' అంటోంది.

యూత్ పల్స్

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో
ఊపందుకున్న 'మీమ్స్' ట్రెండ్ ఇప్పుడు
'మోర్ దేన్ ఏ ట్రెండ్'గా మారింది.
పాకెట్ మనీ సంపాదించుకోవడానికి
యూత్‌కు మార్గం అయింది...

మిత్రమా... ప్రతి మీమ్‌కు ఒక లెక్క ఉంది!



పాప్ కల్చర్ మూమెంట్ అనగానే యూత్‌కి సంబంధించి ఒక సినిమా రిలీజ్, క్రికెట్ ఆట, మ్యూజిక్ ప్రోగ్రామ్... ఇలా ఏవేవో గుర్తుకు వస్తాయి. అయితే మిలీనియల్స్‌కు మాత్రం మీమ్స్, వైరల్ వీడియోలే పాప్‌కల్చర్ మూమెంట్. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో మీమ్స్ ట్రెండ్ ఊపందుకుంది. టైమ్‌పాస్ కోసం చేసినా తమలోని ఒత్తిడి, అకారణ భయం, బోర్‌డమ్ దూరం కావడానికి మీమ్స్ ఉపకరించాయి.

మొన్నటివరకు ట్రెండ్‌గా ఉన్న మీమ్స్ ఇప్పుడు మోర్ దేన్ ఏ ట్రెండ్‌గా మారాయి. దీనికి కారణం సోషల్ మీడియా బ్రాండ్ మార్కెటింగ్‌లో 'మీమ్స్' భాగం కావడమే కాదు కీలకం కావడం.

'ఒక విషయాన్ని సీరియస్‌గా, బోధన చేస్తున్నట్లుగా కాకుండా సరదాగా చెబితే కస్టమర్‌లకు వేగంగా చేరువ అవుతుంది' అనే పబ్లిసిటీ సూత్రానికి మీమ్ అనేది నిలువెత్తు దర్పణంగా మారింది. బ్రాండ్‌ను ప్రమోట్ చేయడానికి మార్కెటింగ్ స్ట్రాటజీలో భాగం అయింది.

'హైంజ్' అనే అమెరికన్ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ యూత్ క్రియేటివిటీని ఉపయోగించి మీమ్స్‌ను బాగా వాడుకుంటోంది.

మీమ్స్‌లో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే బ్రాండ్‌కు సంబంధించి వోవర్ ప్రమోషన్ కనిపించదు. సహజంగా, సరదాగా ఉంటూనే బ్రాండ్ గురించి ఎలాంటి ఆడంబరం లేకుండా నిశ్శబ్దంగా ప్రచారం చేస్తాయి. ఎక్కువ సమయం తీసుకోకపోవడం మరో ప్రత్యేకత.

'మీమ్స్ అనేవి ఫ్యూచర్ ఆఫ్ సోషల్ మార్కెటింగ్. వీటిలో యూత్ కీలక పాత్ర పోషించనుంది. కాలం మారింది. చిన్న బ్రాండ్, పెద్ద బ్రాండ్ అనే తేడా లేకుండా ఇప్పుడు అన్ని బ్రాండ్లకు సోషల్ మార్కెటింగ్‌లో మీమ్స్ అనేవి తప్పనిసరి అవసరం' అంటున్నాడు మీమ్స్.కామ్ కో-ఫౌండర్ రజ్వన్.

మీమ్స్ అనేవి కేవలం సరదా కోసం మాత్రమే కాదని పాకెట్‌మనీ సంపాదించుకోవచ్చనే సత్యం బోధపడడం తో యూత్ ఇప్పుడు వాటిపై సీరియస్‌గా దృష్టి పెట్టింది. 'మీమ్ హిట్ కావడానికి గోల్డెన్ రూల్స్ ఏమిటి?' అంటూ వెదకడం ప్రారంభించింది. గోల్డెన్ రూల్స్‌లో ఒకటి...'అందరికీ నచ్చేలా ఉండాలి అని చేసే మీమ్స్ కంటే టార్గెట్ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకొని చేసేవే బాగా క్లిక్ అవుతాయి' అనేది.

బెంగళూరుకు చెందిన ఎస్ఆర్.హారికకు మీమ్స్ అంటే ఇష్టం. తాను కూడా వాటిని చేయాలనుకుంటోంది. ఎలీన్ బ్రౌన్ అనే జర్నలిస్ట్ రాసిన 'ది మ్యాథ్స్ బిహైండ్ ది మీమ్స్' అనే వ్యాసాన్ని మిత్రులకు షేర్ చేయడం అంటే తనకు ఇష్టం. మీమ్స్ తయారీలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇష్టమైన వ్యాసాల్లో ఒకటి అంజలి వేణుగోపాలన్ రాసిన 'ది సైన్స్ బిహైండ్ మీమ్ మార్కెట్'

'ఒకరు ఒక మీమ్‌ను క్రియేట్ చేయడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నకు జవాబు మోటివేషనల్ అండ్ ఎమోషనల్ రెస్పాన్స్' అంటుంది ఎలీన్ బ్రౌన్. అయితే ఇప్పటి విషయానికి వస్తే మీమ్‌ను రూపొందించడంలో మోటివేషనల్, ఎమోషనల్ కంటే వినోదం, వ్యంగ్యం పాలే ఎక్కువ. దీన్ని దృష్టిలో పెట్టుకొనే కావచ్చు...'మీమ్ నిర్వచనం కాలంతోపాటు మారుతూ వస్తుంది' అంటుంటారు.

'మీమ్స్ అనేవి మన నిత్యజీవితంలో భాగం అయ్యాయి. పాత సినిమాల నుంచి కొత్త సినిమాల వరకు కొత్త న్యూస్ క్లిప్‌ల నుంచి పాత న్యూస్ క్లిప్‌ల వరకు ఏదైనా మీమ్ చేయవచ్చు. అయితే దాన్ని ఎలా హిట్ చేస్తాం అనేదే ముఖ్యం. యువతరం ఈ విద్యలో ఆరితేరింది' అంటున్నారు మీమ్ మార్కెటింగ్ ఏజెన్సీ 'యంగ్‌గన్' ఫౌండర్ సాక్ష్యమ్ జాదవ్.

'మీమ్'ల రూపకల్పనలో ఎన్నో వెబ్‌సైట్లు యూత్‌కు ఉపయోగపడుతున్నాయి. అందులో ఒకటి... సూపర్‌మీమ్. మీమ్‌కు అవసరమైన కంటెంట్ ఇస్తే ఈ ఏఐ ఆధారిత వెబ్‌సైట్ మనకు అవసరమైన మీమ్ తయారు చేసి ఇస్తుంది. టెక్స్ట్‌ను మీమ్‌గా కన్వర్ట్ చేయడమే కాదు మీమ్ సెర్చ్ ఇంజిన్‌గా కూడా ఉపయోగపడుతుంది.

పాకెట్‌మనీ కంటే కాస్త ఎక్కువే!

'మీమ్స్'కు డిమాండ్ ఏర్పడడానికి కారణం సంప్రదాయ అడ్వర్‌టైజింగ్‌లతో పోల్చితే తక్కువ ఖర్చు కావడం. క్రియేటర్‌లలో వైట్-కాలర్ ఎంప్లాయీస్ కంటే హైస్కూల్, కాలేజీ స్టూడెంట్స్ ఎక్కువమంది ఉండడం! తమ క్రియేటివ్ టాలెంట్‌తో తల్లిదండ్రులపై ఆధారపడకుండా పాకెట్ మనీ, కొన్ని సందర్భాలలో అంతకంటే ఎక్కువ సంపాదించుకోగలుగుతున్నారు. మీమ్ క్రియేటింగ్ అండ్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్'మీమ్ చాట్' 1,50,000 క్రియేటర్స్‌కు ఒక్కో మీమ్‌కు 20 నుంచి 30 రూపాయల వరకు చెల్లిస్తుంది. అయితే ప్లాట్‌ఫామ్‌ను బట్టి ఈ రెమ్యునరేషన్ మారుతూ ఉండవచ్చు.

ఇంటిప్

కిటికీ... క్లీనింగ్



గాలి, వెలుతురు కోసం కిటికీలను రోజంతా తెరిచి ఉంచడం సాధారణమే. అందుకే, కిటికీలను ప్రతిరోజూ తుడవడం మంచిది. తెరిచిన కిటికీలు గాలిలో వచ్చే దుమ్ముతోపాటు పుప్పొడిని, వాటిని ఆశ్రయించే బాక్టీరియాని పట్టుకుని ఉంటాయి. ఇలా పర్యావరణ అలెర్జీల కారణంగా ఉబ్బసం సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కిటికీలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవచ్చు.

తడిబట్టతో కనీసం రెండు రోజులకోసారి తుడవడం వల్ల కిటికీలు శుభ్రంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది.

బ్యూటిప్

టేబుల్ స్పూను తేనె, పండిన అవకాడో గుజ్జు, టేబుల్ స్పూను పచ్చిపాలు, టేబుల్ స్పూన్ ఓట్స్‌ను మిక్సీజార్‌లో వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టును పదిహేను నిమిషాలు నానబెట్టి తరువాత ముఖానికి అప్లై చేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత సాధారణ నీళ్లతో కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ అంది పొడిబారకుండా ఉంటుంది. ప్యాక్‌లో ఉన్న విటమిన్ ఈ, ఫ్యాటీ యాసిడ్‌లు ముఖచర్మానికి పోషణ అందిస్తాయి. ఈ ప్యాక్ వేసుకోవడం కుదరని వాళ్లు ఆవకాడో ఆయిల్‌ను ముఖానికి రాసి మర్దనా చేసుకుంటే ముఖచర్మం పొడిబారకుండా ఉంటుంది.





సెమీఫైనల్లో హైదరాబాద్ ఎఫ్‌సీ

ఈ సీజన్ ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు లీగ్ దశలో రెండో స్థానంతోపాటు సెమీఫైనల్ బెర్త్ కూడా ఖరారైంది. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–0తో ఏటీకే మోహన్ బగాన్ జట్టుపై నెగ్గింది. ఆట 86వ నిమిషంలో ఒగ్‌బెచె గోల్ చేసి హైదరాబాద్‌ను గెలిపించాడు. 18 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

రెండో టెస్టు కోసం టీమిండియాలో శ్రేయస్



భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. బీసీసీఐ వైద్య బృందం నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో శ్రేయస్ పాస్ అయ్యాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. దాంతో శుక్రవారం నుంచి న్యూఢిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టు కోసం అతను భారత బృందంతో కలుస్తాడు. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌తో చివరిసారి టెస్టుల్లో శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగాడు.

మరో విజయమే లక్ష్యంగా...

నేడు వెస్టిండీస్‌తో భారత్ పోరు

సాయంత్రం గం. 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



12 ఇప్పటి వరకు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 20 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 12 మ్యాచ్‌ల్లో, వెస్టిండీస్ 8 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇక టి20 ప్రపంచకప్ చరిత్రలో రెండు జట్లు రెండుసార్లు తలపడగా...ఇరు జట్లకు ఒక్కో మ్యాచ్‌లో విజయం దక్కింది.

కేప్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు వరుసగా మరో విజయంపై దృష్టి సారించింది. బుధవారం గ్రూప్ 'బి'లో జరిగే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన... వెస్టిండీస్‌తో తలపడుతుంది. మరోవైపు ఇంగ్లండ్ చేతిలో ఓడిన కరీబియన్ అమ్మాయిలు బోణీ కొట్టేందుకు చూస్తున్నారు. చిరకాల ప్రత్యర్థి పాక్ ఎదురైన గత మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభంలో తడబడినా... తర్వాత పుంజుకుంది. డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన గాయంతో అందుబాటులో లేకపోయినా... లక్ష్యఛేదనలో భారత్ ఆడిన తీరు బాగుంది. ఇప్పుడైతే స్టార్ ఓపెనర్ స్మృతి తుది జట్టులోకి రావడంతో బ్యాటింగ్ దళం మరింత పటిష్టమైంది. గత జనవరిలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత జట్టు వెస్టిండీస్‌తో తలపడిన రెండుసార్లు విజయం సాధించింది. ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ, వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఫామ్‌లో ఉండటంతో భారత టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్‌లు కూడా బ్యాట్ ఝుళిపించగలరు. దీంతో భారీస్కోర్లు సాధించే సత్తా మన జట్టుకుంది. బౌలింగ్‌లో రేణుక సింగ్ తన పదును చూపాల్సి ఉంది. పాక్‌తో పోరులో తొలి పది ఓవర్ల పాటు బౌలర్లు చక్కగానే కట్టడి చేశారు. కానీ తర్వాతి 10 ఓవర్లే కట్టుదిట్టంగా వేయలేకపోయారు. ఈ మ్యాచ్‌లో అలాంటి తడబాటుకు అవకాశమివ్వకుండా రాణిస్తే భారత్‌కు వరుస విజయం కష్టమేం కాదు. మరోవైపు విండీస్ జట్టు వరుస వైఫల్యాలతో సతమతమవుతోంది. వరుసగా 14 మ్యాచ్‌ల్లో హేలీ మాథ్యూస్ సేన గెలుపొందలేకపోయింది. ఇందులో ఒక మ్యాచ్ 'టై'కాగా... 13 మ్యాచ్‌ల్లో ఓటమి పాలవడం జట్టును కుంగదీస్తోంది. మెగా ఈవెంట్‌లో ముందంజ వేయాలంటే కరీబియన్ జట్టుకు ప్రతీ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి లీగ్ మ్యాచ్‌లో విండీస్ ఏడు వికెట్లతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది.

అజహర్ ఆట ముగిసింది!

హెచ్‌సీఏ పర్యవేక్షణకు ఏకసభ్య కమిటీ • రిటైర్డ్ జడ్జి ఎల్.నాగేశ్వరరావును నియమించిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా మొహమ్మద్ అజహరుద్దీన్ ఎట్టకేలకు తప్పుకోనున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 26నే పదవీ కాలం ముగిసినా, తనతో పాటే ఎన్నికైన అపెక్స్ కమిటీ సభ్యులను పక్కన పెట్టి మరీ అజహర్ హెచ్‌సీఏను నడిపిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఆ అధికారాన్ని సుప్రీంకోర్టు తొలగించింది. ఇకపై హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ, త్వరలోనే ఎన్నికల నిర్వహణకు కొత్తగా ఏకసభ్య కమిటీని ఎంపిక చేసింది. ఇందు కోసం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. దీంతో ఇప్పటి వరకు నలుగురు సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీ కూడా రద్దయింది. ఇందులో మాజీ న్యాయమూర్తి నిసార్ అహ్మద్ కక్రూ, డీజీపీ అంజనీ కుమార్‌లతోపాటు మాజీ క్రికెటర్లు వంకా ప్రతాప్, వెంకటపతిరాజు ఉన్నారు. పేరుకే ఈ కమిటీ ఉన్నా... అన్నీ తానై అజహర్ వ్యవహరిస్తున్నాడని, సమయం ముగిసిపోయినా ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రత్యర్థి వర్గం చెబుతూ వచ్చింది. ఇకపై 'అన్ని రకాల సంతకాల అధికారం' కూడా తాజాగా నియమించిన నాగేశ్వరరావుకే కట్టబెడుతున్నట్లు సుప్రీం ఉత్తర్వుల్లో ఉంది. దాంతో హెచ్‌సీఏ నుంచి అజహర్ బయటకు వెళ్లడం ఖాయమైంది. హెచ్‌సీఏపై చార్మినార్ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీనిని మంగళవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, మనోజ్ మిశ్రా, జస్టిస్ అరవింద కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నందున ప్రతిష్టంభన తొలగించాలని, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ జరగాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును నియమించాలని ప్రతివాదుల తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే కోర్టుకు సూచించారు. 'ప్రతిష్టంభనకు ముగింపు పలికి, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ సాగాలని భావిస్తున్నాం. ఈ గందరగోళానికి తెర పడాలంటే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ఏకసభ్య నాయకత్వం తగినదని అభిప్రాయపడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. 'జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు హైదరాబాద్‌కు చెందిన వారు. ఎలక్టోరల్ సమస్యలు పరిష్కరించగలరు' అని తెలిపింది. జస్టిస్ ఎల్.నాగేశ్వరరావుకు అన్ని విధాలా సహకరించాలని హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని ఆదేశించింది. పూర్తి ఖర్చులు హెచ్‌సీఏనే భరించాలని కోర్టు నుంచి ఇతరత్రా ఆదేశాలు అవసరమైతే జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ధర్మాసనం దృష్టికి తీసుకురావచ్చని ఆదేశాల్లో పేర్కొంది. హెచ్‌సీఏలోని ఇతర పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.



భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా తన భార్య పూజతో కలిసి మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశాడు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య శుక్రవారం న్యూఢిల్లీలో రెండో టెస్టు మొదలవుతుంది. పుజారా కెరీర్‌లో ఇది 100వ టెస్టు కానుంది.

భారత్ శుభారంభం



సింధు

దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–0తో కజకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఇషాన్–తనీషా ద్వయం 21–5, 21–11తో మక్సుత్–నర్గీజా జోడీపై నెగ్గింది. రెండో మ్యాచ్‌లో ప్రణయ్ 21–9, 21–11తో పనారిన్‌ను ఓడించాడు. మూడో మ్యాచ్‌లో సింధు 21–4, 21–12తో కామిలాపై నెగ్గడంతో భారత విజయం ఖరారైంది. తర్వాతి మ్యాచ్‌ల్లో గరగ కృష్ణ ప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ 21–10, 21–6 తో కుల్మతోవ్–నియాజోవ్‌లను ఓడించగా.. పుల్లెల గాయత్రి –ట్రెసా జాలీ 21–5, 21–7తో నర్గీజా–ఐషా జుమ్‌బేక్‌లపై విజయం సాధించారు.

తొలి పోరులో ముంబైతో గుజరాత్ ఢీ

డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ విడుదల

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్రారంభ సీజన్‌కు సర్వం సిద్ధమైంది. ఐదు ఫ్రాంచైజీ జట్ల మధ్య వచ్చే నెల 4 నుంచి అమ్మాయిల మెరుపులు మొదలవుతాయి. దీనికి సంబంధించిన మొత్తం 22 మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. డీవై పాటిల్ స్టేడియంలో మార్చి 4న జరిగే తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది. ఫైనల్ 26న జరుగుతుంది. ఈ సీజన్‌లో నాలుగు రోజులు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు, రెండో మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మొదలవుతాయి. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 11 చొప్పున బ్రబౌర్న్ స్టేడియం, డీవై పాటిల్ స్టేడియాల్లో నిర్వహిస్తారు.

హైదరాబాద్‌లో ప్రైమ్ వాలీబాల్ లీగ్ సందడి



మాదాపూర్: వాలీబాల్ ప్రేమికులకు ఉత్కంఠతోపాటు ఉల్లాసాన్ని నింపేందుకు ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో హైదరాబాద్ అంచె మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం సిద్ధమైంది. నేటి నుంచి హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. ఈనెల 21 వరకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. నేటి మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తలపడుతుంది. బెంగళూరులో తొలి అంచె మ్యాచ్‌లు ఈనెల 4 నుంచి 12 వరకు జరిగాయి.

పారిస్ ఒలింపిక్స్‌కు ఆకాశ్‌దీప్, ప్రియాంక అర్హత



రాంచీ: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 20 కిలోమీటర్ల విభాగంలో పంజాబ్‌కు చెందిన ఆకాశ్‌దీప్ సింగ్... మహిళల 20 కిలోమీటర్ల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాంక గోస్వామి విజేతలుగా నిలిచారు. ఈ ఏడాది ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలకు... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించారు. ఆకాశ్‌దీప్ 20 కిలోమీటర్ల దూరాన్ని 1 గంట 19 నిమిషాల 55 సెకన్లలో పూర్తి చేసి కొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:20ని:10 సెకన్లు) అధిగమించాడు. ప్రియాంక 1 గంట 28 నిమిషాల 50 సెకన్లలో లక్ష్యానికి చేరి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:29ని:20 సెకన్లు) అధిగమించింది.

విండీస్‌దే టెస్టు సిరీస్



మోతీ

బులవాయో: జింబాబ్వే పర్యటనలో వెస్టిండీస్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌ను 1–0తో కైవసం చేసుకుంది. మంగళవారం ముగిసిన ఆఖరి టెస్టులో కరీబియన్ జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఓవర్‌నైట్ స్కోరు 290/8తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ కేవలం 2 పరుగులే జతచేసి 292 వద్ద ఆలౌటైంది. విండీస్‌కు 177 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 47.3 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (72; 4 ఫోర్లు), ఓపెనర్ ఇన్నోసెంట్ కైయా (43; 7 ఫోర్లు) రాణించారు. మిగతా 9 మంది క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీసిన గుడకేశ్ మోతీ రెండో ఇన్నింగ్స్‌లోనూ 6 వికెట్లు పడగొట్టాడు. ఇక్కడే జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది.

సినిమా



చంద్రబోస్, స్పీల్‌బర్గ్, కీరవాణి

ఆస్కార్ సంబరాలు ఆరంభం

ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి దాదాపు నెల రోజులు ఉంది. ఈలోపు ఎప్పటిలానే ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్నవారికి 'లంచ్ మీట్' ఏర్పాటు చేసింది అవార్డ్ కమిటీ. ఈ విందుకి సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్ హాజరయ్యారు. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ నామినేషన్ దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అవార్డు కమిటీ నుంచి విందు కార్యక్రమానికి ఆహ్వానం అందగా ఈ ఇద్దరూ వెళ్లారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించారు. ఇక 'లంచ్ మీట్' విషయానికొస్తే..

అమెరికాలోని కాలిఫోర్నియాలో గల ది బెవర్లీ హిల్టన్ బాల్ రూమ్‌లో విందు కార్యక్రమం జరిగింది. ఈ విందులో దాదాపు 200మంది పాల్గొన్నారని సమాచారం. అక్కడ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను కలిశారు కీరవాణి, చంద్రబోస్. ఆ ఫోటోలను చంద్రబోస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

హుందాగా ఉందాం: జానెట్ యాంగ్

గత ఏడాది జరిగిన ఆస్కార్ అవార్డుల వేడుకకు ఓ హోస్ట్‌గా వ్యవహరించిన క్రిస్ రాక్ ఆ వేదికపై నటుడు విల్ స్మిత్ భార్య జాన్ పిన్‌కెట్ హెయిర్ స్టయిల్ గురించి కామెడీగా మాట్లాడారు. అది నచ్చక విల్ స్మిత్ అతన్ని చెంపదెబ్బ కొట్టిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రపంచం మొత్తం చూస్తున్న వేడుకలో విల్ స్మిత్ ఇలా చేయడం సరికాదని అవార్డు కమిటీ భావించింది. ఇదే విషయం గురించి తాజాగా 'లంచ్ మీట్'లో అకాడమీ చైర్మన్ జానెట్ యాంగ్ మాట్లాడుతూ – ''ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు. గత ఏడాది ఆస్కార్ వేడుకలో జరిగిన ఘటన (క్రిస్‌ని విల్ చెంప చెళ్లుమనిపించడం) సరైనది కాదు. అందరం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. ఇలాంటి ఘటనలను ఆస్కార్ కమిటీ ఉపేక్షించదు'' అన్నారు.



జోనాథన్ మేజర్స్

'ఆర్ఆర్ఆర్'ని ఆస్వాదించా!

ఈ నెల 17న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానున్న 'యాంట్–మ్యాన్ మరియు ది వాస్ప్: క్వాంటుమేనియా'లో సూపర్ విలన్ కాంగ్ ది కాంకరర్ పాత్ర చేసిన జోనాథన్ మేజర్స్ 'ఆర్ఆర్ఆర్' గురించి మాట్లాడుతూ– ''నేను భారతీయ చిత్రానికి అభిమానిని. 'ఆర్ఆర్ఆర్'ని చాలాసార్లు చూశాను. మూడు గంటల ఈ సినిమాని ఆస్వాదించాను. ఇద్దరు నటులను (ఎన్టీఆర్, రామ్‌చరణ్) తెరపై చూడటం నాకు చాలా నచ్చింది. మరిన్ని ఇండియన్ సినిమాలు చూడాలనుకుంటున్నాను'' అన్నారు.

జైసల్మేర్ టు మంగళూరు



రజనీకాంత్

మంగళూరుకు షిఫ్ట్ అయ్యారు జైలర్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం ఇది. ఇటీవల ఈ సినిమా షూటింగ్ రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో జరిగింది. ఈ షెడ్యూల్‌లో రజనీ, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్‌ల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇప్పుడు 'జైలర్' షూటింగ్ మంగళూరులో జరుగుతోంది. రజనీ, శివరాజ్‌కుమార్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్‌ను చెన్నైలో ప్లాన్ చేశారట.

పోలీసాఫీసర్...



లక్ష్మీ మంచు

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వంలో లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న నిర్మించారు. మంగళవారం ఈ సినిమా గ్లింప్స్‌ని హీరో రానా రిలీజ్ చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో లక్ష్మీప్రసన్న పోలీసాఫీసర్ పాత్ర చేశారు. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'అగ్ని నక్షత్రం'. రానా విడుదల చేసిన గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజామణి, కెమెరా: గోకుల్ భారతి.

ధైర్యం కోల్పోకూడదు



రేణూ దేశాయ్

కొన్నేళ్లుగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు నటి–దర్శకురాలు రేణూ దేశాయ్. తన అనారోగ్యం గురించి రేణు ఓ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''నా అనారోగ్య సమస్యల గురించి నా సన్నిహితులకు తెలుసు. కానీ ఇప్పుడు నేనే అందరికీ చెప్పాలనుకున్నాను. ఎందుకంటే నాలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారు ధైర్యంగా ఉండాలని చెప్పడం కోసం ... వారిలో జీవితం పట్ల సానుకూలమైన ఆలోచనలను రేకెత్తించడం కోసం. మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనలోని ధైర్యాన్ని, జీవితం పట్ల ఆశను కోల్పోకూడదు. ఎందుకంటే మన కోసం ఎన్నో స్వీట్ సర్‌ప్రైజెస్‌ను కాలం ప్లాన్ చేసి ఉండొచ్చు'' అన్నారు రేణు. ప్రస్తుతం చికిత్స చేయించుకుంటున్నానని, త్వరలోనే కోలుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతూ, సినిమా షూటింగ్స్‌లో పాల్గొంటాననే నమ్మకం ఉందని రేణుదేశాయ్ పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న సమంత

తమిళనాడులోని దిండిక్కల్ జిల్లాలో గల పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు సమంత. కొంతకాలంగా మయోసైటిస్ (కండరాలకు సంబంధించిన వ్యాధి...)తో సమంత బాధపడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యాధి నుంచి కోలుకునేందుకు సమంత వైద్య చికిత్స తీసుకుంటున్నారు. కాగా, అనారోగ్యం నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని కోరుతూ, పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సమంత పూజలు చేశారు. అలాగే ఈ ఆలయ దర్శనానికి సమంత దాదాపు 600 మెట్లు ఎక్కి వెళ్లారని, ప్రతి మెట్టుపై ఓ కర్పూరాన్ని వెలిగించారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే... సమంత నటించిన 'శాకుంతలం' ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషి'లో హీరోయిన్‌గా, హిందీ వెబ్ సిరీస్ 'సిటాడెల్'లో నటిస్తున్నారు సమంత.

జీవితగా...



రాధిక

రక్షిత్ అట్లూరి హీరోగా, సంకీర్తనా విపిన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకత్వంలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రంలో జీవిత పాత్ర చేస్తున్న రాధికా శరత్‌కుమార్ లుక్‌ని విడుదల చేశారు. ''స్వాతిముత్యం, స్వాతి కిరణం' లాంటి ప్రజాదరణ పొందిన చిత్రాల తర్వాత 'ఆపరేషన్ రావణ్'లో నటనకి ప్రాధాన్యం ఉన్న జీవిత పాత్ర చేశాను. తెలుగుతో పాటు తమిళంలో ఏక కాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది'' అన్నారు రాధిక.

అందువల్లే ఆ హీరోలు క్లిక్ అవుతున్నారు - నిర్మాత బన్నీ వాసు



బన్నీ వాసు, కిరణ్ అబ్బవరం, కశ్మీర

''ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా లేకున్నా కష్టపడాలి. అల్లు అర్జున్, నాని, కిరణ్ అబ్బవరం, నిఖిల్‌లకు సినిమా అంటే తపన.. అందువల్లే వారు క్లిక్ అవుతున్నారు. సినిమా కోసం నిద్ర పోకుండా బాగా కష్టపడతారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''వినరో భాగ్యము విష్ణు కథ'లో వినోదం, ప్రేమ, థ్రిల్లింగ్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఈ చిత్రంలో సిగరెట్, మందు తాగే సీన్లు లేవు.. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రంతో కిరణ్ అబ్బవరం కెరీర్ మరో మెట్టు పైకి ఎక్కుతుంది'' అన్నారు. ''ఈ సినిమా రషెస్ చూశాక అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే మా నమ్మకం రెట్టింపు అయ్యింది. నా కెరీర్‌లో గుర్తు పెట్టుకునే చిత్రం అవుతుంది'' అన్నారు కిరణ్ అబ్బవరం.

వేసవిలో సామజవరగమన



శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు డైరెక్టర్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'సామజవరగమన' అనే టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ ఏడాది వేసవిలో మా సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.

కష్టపడితే ఆదరణ లభిస్తుంది - శర్వానంద్



శ్రీకాంత్, మౌర్య సిద్ధవరం, శర్వానంద్

ప్రియాంకా శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను శర్వానంద్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''మేము (నటీనటులు) ప్యాషన్‌తో, నమ్మకంతో, ఆశతో సినిమా చేస్తాం. కష్టపడి మంచి సినిమా చేస్తే ప్రేక్షకాదరణ లభిస్తుందని నేను నమ్ముతా. మంచి కథతో రూపొందిన 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో శర్వానంద్ అన్నారు. నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, రియా సుమన్, ''నేను, మౌర్య 'రణరంగం' సినిమాలో నటించాం. 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' కథ నచ్చి, నిర్మించానని మౌర్య చెప్పినప్పుడు హ్యాపీగా అనిపించింది'' అన్నారు. ''నన్ను, కథని నమ్మి ఈ సినిమా నిర్మించిన మౌర్యకి థ్యాంక్స్'' అన్నారు శ్రీకాంత్ జి. రెడ్డి. ''పురుషుల బాధలను చూపించే చిత్రమిది. మహిళలకూ నచ్చు తుంది'' అన్నారు బ్రహ్మాజీ. ''యంగ్ టీమ్‌తో మంచి సినిమా చేశాను'' అన్నారు మౌర్య సిద్ధవరం.

వెళ్లిపోయే.. వెళ్లిపోయే...



దివ్య, క్రిష్, ఆర్యన్ గౌర

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి హీరో హీరోయిన్లుగా దివ్యా భావన దర్శకత్వంలో కట్టా చందన నిర్మించిన ఫీల్ గుడ్ లవ్ స్టోరీ ఫిల్మ్ 'ఓ సాథియా'. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాలోని బ్రేకప్ సాంగ్ 'వెళ్లిపోయే పాపా వెళ్లిపోయే..'ను దర్శకుడు క్రిష్ విడుదల చేసి, సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. మ్యూజిక్ డైరెక్టర్ వినోద్‌కుమార్ (విన్ను) స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ చేశారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	600	61,032
నిఫ్టీ ▲	159	17,930

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్‌	11,845	▽ 47
డోజోన్స్‌	34,006	▽ 240
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,954	▲ 6
డాక్స్‌	15,381	▽ 17
షాంఘై	3,293	▲ 9
నికాయ్‌	27,603	▲ 175


•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్‌)	57,018	▽ 1
బంగారం (22 క్యారట్‌)	56,790	▽ 42
వెండి (కిలో)	65,842	▽ 529

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	80.93	84.61
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	86.82	91.33
€	యూరో	ఎస్‌బీఐ	98.66	103.50
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	50.00	75.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	55.29	60.12
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	60.09	64.62
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.07	22.75
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.63	23.43
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	11.02	13.10



టోకు ధరల ఊరట!

జనవరి ద్రవ్యోల్బణం 4.73% • రెండేళ్ల కనిష్టం • ఫుడ్‌ బాస్కెట్‌ భారమే!

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 జనవరిలో 4.73 శాతంగా (2022 ఇదే నెలతో ధరతో పోల్చి) నమోదయ్యింది. గడచిన రెండు సంవత్సరాల్లో ఇంత తక్కువ స్థాయి టోకు ధరల స్పీడ్‌ నమోదుకావడం ఇదే తొలిసారి. సూచీలో మెజారిటీ వెయిటేజ్‌ కలిగిన తయారీ, ఇంధనం, విద్యుత్‌ ధరలు తగ్గినా, ఫుడ్‌ ఆర్టికల్స్‌ బాస్కెట్‌ మాత్రం పెరిగింది. టోకు ధరల సూచీ వరుసగా ఎనిమిది నెలల నుంచి తగ్గుతూనే వస్తుండడం సానుకూల అంశమైనా, ఆహార ధరల తీవ్రతపై జాగరూకత వహించాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరించారు. 10 నెలల అప్‌ట్రెండ్‌ తర్వాత నవంబర్, డిసెంబర్‌లో ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం లోపు ఉన్న రిటైల్‌ ద్రవ్యోల్బణం జనవరిలో మళ్లీ 6.52 శాతం పైబడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు. ఈ సూచీలో ఒక్క ఫుడ్‌ బాస్కెట్‌ ధరల స్పీడ్‌ 5.94 శాతంగా ఉంది. రెపోపై ఆర్‌బీఐ నిర్ణయానికి రిటైల్‌ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక అయిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, క్రూడ్‌ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్‌ 8, ఆగస్టు 5, సెప్టెంబర్‌ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్‌ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఈ నెల మొదట్లో మరో పావు శాతం పెరిగి, 6.50 శాతానికి చేరింది.

తయారీ: తయారీ ఉత్పత్తులకు సంబంధించి ధరల స్పీడ్‌ జనవరిలో 2.99 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్‌ 2022లో ఈ రేటు 3.37 శాతం.

ఇంధనం, విద్యుత్‌ నెలల వారీగా ఈ రేటు 18.09 శాతం నుంచి 15.15 శాతానికి తగ్గింది.

ఫుడ్‌ బాస్కెట్‌: ఈ విభాగంలో రేటు జనవరిలో 2.38 శాతంగా ఉంది. 2022 డిసెంబర్‌లో ఈ రేటు 1.25 శాతం క్షీణత (మైనస్‌)లో ఉంది. పప్పు దినుసుల ధర స్పీడ్‌ 2.41 శాతంగా ఉంటే, కూరగాయల ధరలు మాత్రం 26.48 శాతం తగ్గాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

15-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	414-00
విజయవాడ	414-00
14-2-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	386-00
వరంగల్‌	388-00

అదానీ గ్రూప్‌ కంపెనీల ఆడిటింగ్‌

- అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్‌ థార్న్‌టన్‌ నియామకం
- ఇన్వెస్టర్ల భరోసాకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ: అమెరికన్‌ షార్ట్‌సెల్లర్‌ హిండెన్‌బర్గ్‌ రీసెర్చ్‌ ఆరోపణలతో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు, నియంత్రణ సంస్థలకు భరోసా కల్పించే చర్యలపై అదానీ గ్రూప్‌ మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా కొన్ని గ్రూప్‌ కంపెనీల ఖాతాలను స్వతంత్ర సంస్థతో ఆడిట్‌ చేయించాలని నిర్ణయించింది. దీని కోసం అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్‌ థార్న్‌టన్‌ను నియమించుకుంది. తాము ఏమీ దాచడం లేదని, చట్టాలన్నింటినీ పాటిస్తున్నామని నియంత్రణ సంస్థలకు తెలియజేయడమే ఈ ఆడిట్‌ ప్రధాన ఉద్దేశమని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆర్థిక సంస్థలపై ప్రభావం నిల్‌: ఎస్‌అండ్‌పీ

అదానీ గ్రూప్‌ సంక్షోభ ప్రభావాలు ఇతర ఆర్థిక సంస్థలపై భారీగా ఉండబోవని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్‌ ఒక నివేదికలో విశ్లేషించింది.

లాభాల్లోకి అదానీ ఎంటర్‌ప్రైజెస్‌

క్యూ3లో రూ. 820 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్‌ రంగ డైవర్సిఫైడ్‌ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అక్టోబర్‌-డిసెంబర్‌(క్యూ3)లో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 820 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 12 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 42 శాతం జంప్‌చేసి రూ. 26,612 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 37 శాతం పెరిగి రూ. 26,171 కోట్లను దాటాయి. కంపెనీకి ప్రధానమైన ఇంటిగ్రేటెడ్‌ రీసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం పన్నుకుముందు లాభం 370 శాతం దూసుకెళ్లి రూ. 669 కోట్లను తాకింది. ఈ బాటలో మైనింగ్, న్యూఎనర్జీ లాభాలు 3 రెట్లు ఎగసినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 1,750 వద్ద ముగిసింది.

బోయింగ్‌ విమానానికి టాటా 'ఫిన్‌' డెలివరీ

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: హైదరాబాద్‌ ప్లాంటులో తయారు చేసిన తొలి 'వర్టికల్‌ ఫిన్‌' భాగాన్ని అమెరికాలోని బోయింగ్‌ విమానాల తయారీ కేంద్రానికి పంపించినట్లు టాటా బోయింగ్‌ ఏరోస్పేస్‌ లిమిటెడ్‌ (టీబీఏ) వెల్లడించింది. దీన్ని అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉన్న బోయింగ్‌ ప్లాంటుకు డెలివరీ చేస్తారు. అక్కడ బోయింగ్‌ 737 విమానానికి అమరుస్తారు. నిట్టనిలువుగా ఉండే వర్టికల్‌ ఫిన్‌ భాగాన్ని విమానానికి స్థిరత్వాన్నిచ్చేలా ఎయిర్‌క్రాఫ్ట్‌ తోకపై ఏర్పాటు చేస్తారు. టాటా అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్స్, బోయింగ్‌ కలిసి టీబీఏను జాయింట్‌ వెంచర్‌ సంస్థగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సంక్లిష్టమైన వర్టికల్‌ ఫిన్‌ భాగాల తయారీ కోసం టీబీఏ గతేడాదే కొత్త లైన్‌ను ప్రారంభించింది. 14,000 చ.మీ. విస్తీర్ణంలోని టీబీఏ ప్లాంటులో బోయింగ్‌ ఏహెచ్‌-64 అపాచీ హెలికాప్టర్లకు కావాల్సిన ఏరో-స్ట్రక్చర్స్‌ మొదలైన వాటిని తయారు చేస్తున్నారు.



సెన్సెక్స్‌ లాభం 600 పాయింట్లు

- ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- రెండు రోజుల నష్టాలకు చెక్‌
- 17,900 పైకి నిఫ్టీ

ముంబై: స్టాక్‌ మార్కెట్‌ రెండు రోజుల నష్టాలకు మంగళవారం బ్రేక్‌ పడింది. బ్యాంకింగ్, ఐటీ, ఫైనాన్స్‌ షేర్లకు డిమాండ్‌ నెలకొంది. అధిక వెయిటేజీ రిలయన్స్‌(2.35%), ఐటీసీ(2.30%) షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. విదేశీ ఇన్వెస్టర్లు మూడోరోజూ కొనుగోళ్లకే మొగ్గుచూపారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధరలు దిగివచ్చాయి. ఈ అంశాలు దేశీయ మార్కెట్‌ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆరంభంలో కాస్త తడబడ్డాయి. ఆపై వెంటనే తేరుకొని మార్కెట్‌ ముగిసే వరకు ఎలాంటి తడబాటు లేకుండా స్థిరమైన ర్యాలీ చేశాయి. ఫలితంగా సెన్సెక్స్‌ 600 పాయింట్లు పెరిగి 61,032 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 671 పాయింట్లు బలపడి 61,103 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్లు బలపడి 17,930 వద్ద నిలిచింది. ఒక దశలో 185 పాయింట్లు దూసుకెళ్లి 17,956 వద్ద గరిష్టాన్ని అందుకుంది. విస్తృత స్థాయి మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఆటో, ఫార్మా, రియల్టీ, మీడియా షేర్లు నష్టాలను చవిచూశాయి.





ప్రకటనలపై వ్యయాలు 15 శాతం అప్‌

- 2023లో రూ. 1.46 లక్షల కోట్లు
- గ్రూప్‌ఎం అంచనాలు



ప్రశాంత్‌ కుమార్, సీఈఓ (దక్షిణాసియా), గ్రూప్‌ఎం

ముంబై: దేశీయంగా ఈ ఏడాది ప్రకటనలపై వ్యయాలు 15.5% పెరిగి రూ. 1.46 లక్షల కోట్లకు చేరనున్నాయి. 2021తో పోలిస్తే 2022లో పరిశ్రమ 15.7 శాతం వృద్ధి చెందిందని అంచనాలు నెలకొన్నాయి. మీడియా ఏజెన్సీ గ్రూప్‌ ఎం ఈ అంచనాలను వెలువరించింది. అత్యంత వేగంగా ఎదుగుతున్న టాప్‌ 10 మార్కెట్లలో భారత్‌ కూడా ఒకటిగా ఉండనుందని, అడ్వర్టైజింగ్‌పై వెచ్చించే వ్యయాల విషయంలో ప్రపంచంలోనే ఎనిమిదో స్థానంలో ఉంటుందని గ్రూప్‌ఎం వివరించింది. స్థూల ఆర్థిక అస్థిరతలు, అంతర్జాతీయ పరిణామాలు గత మూడేళ్లుగా ప్రకటనకర్తల వ్యాపారాలు, అడ్వర్టైజింగ్‌ వ్యయాలపై ప్రభావం చూపాయని సంస్థ సీఈఓ (దక్షిణాసియా) ప్రశాంత్‌ కుమార్‌ పేర్కొన్నారు. 2023లో ప్రకటనల వ్యయాలకు టెలికం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు.. బీమా, రిటైల్, ఫిన్‌టెక్, గేమింగ్, ట్రావెల్, పర్యాటకం మొదలైన విభాగాల నుంచి ఊతం లభిస్తుందని గ్రూప్‌ఎం బిజినెస్‌ ఇంటెలిజెన్స్‌ హెడ్‌ పర్వీన్‌ షేక్‌ చెప్పారు. ఈ ఏడాది గ్రామీణ ఎకానమీ కూడా పుంజుకోగలదన్నారు. టాప్‌ మెట్రోలను దాటి ఇతర ప్రాంతాలకూ 5జీ సేవలు విస్తరిస్తుండటం, స్మార్ట్‌ఫోన్లు చౌకగా లభిస్తుండటం తదితర అంశాలూ ప్రకటనకర్తలు అడ్వర్టైజింగ్‌పై మరింతగా వెచ్చించేందుకు దోహదపడగలవన్నారు.

డిజిటల్‌దే పైచేయి..

గ్రూప్‌ఎం అంచనాల ప్రకారం మొత్తం ప్రకటన వ్యయాల్లో సింహభాగం వాటా డిజిటల్‌ మీడియాదే ఉండనుంది. అత్యంత వేగంగా 20 శాతం వృద్ధితో ఏకంగా 56 శాతానికి చేరనుంది. టీవీ మాధ్యమం వాటా మాత్రం స్వల్పంగా 31 శాతం నుంచి 30 శాతానికి తగ్గనుంది. ప్రింట్‌ మాధ్యమంలో ప్రకటనలపై వ్యయాలు మరింతగా తగ్గి 11 శాతం (2022లో) నుంచి ఈ ఏడాది 10 శాతానికి పరిమితం కానున్నాయి. విలువపరంగా మాత్రం ప్రింట్‌లో ప్రకటనలు రూ. 13,519 కోట్ల నుంచి రూ. 14,520 కోట్లకు పెరగనున్నాయి.

భవిత

• ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్‌ పాయింట్‌ కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

ఆంధ్రప్రదేశ్‌ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్‌ పేపర్స్, మోడల్‌ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్‌ అఫైర్స్, ఆన్‌లైన్‌ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

జాబ్‌ పాయింట్‌

డీఎంహెచ్‌వో రంగారెడ్డి జిల్లాలో 49 మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టులు

రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. జాతీయ ఆరోగ్య మిషన్‌ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 49
» **అర్హత:** ఎంబీబీఎస్‌ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.52,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఎంబీబీఎస్‌ మార్కులు, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తును రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయానికి వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.02.2023.
» **వెబ్‌సైట్‌:** rangareddy.telangana.gov.in

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో వివిధ ఉద్యోగాలు

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్‌ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 3
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్‌ గ్రేడ్‌ 2-1, ల్యాబ్‌ టెక్నీషియన్‌ గ్రేడ్‌ 2-1, మేల్‌ నర్సింగ్‌ ఆర్డర్లీ-1.
» **అర్హత:** పదో తరగతి,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,500(ఎంఎన్‌వో ఖాళీలకు రూ.12,000)చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్‌ కార్యాలయం, జిల్లా జైలు, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
» **వెబ్‌సైట్‌:** guntur.ap.gov.in

సూర్యాపేట జిల్లాలో మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టులు

సూర్యాపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్‌ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **అర్హత:** బీహెచ్‌ఎంఎస్,బీఏఎంఎస్‌ ఉత్తీర్ణులై ఉండాలి. **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కులు, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.02.2023.
» **వెబ్‌సైట్‌:** suryapet.telangana.gov.in

మెరుగైన ఇంజనీరింగ్‌కు మార్గం.. బిట్‌శాట్‌

» బిట్స్‌ క్యాంపస్‌ల్లో బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీల్లో ప్రవేశాలకు బిట్‌శాట్‌
» 2023 విద్యాసంవత్సరానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» రెండు సెషన్లలో బిట్‌శాట్‌-2023



దేశంలో నాణ్యమైన ఇంజనీరింగ్‌ విద్యను అందించడంలో బిర్లా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌(బిట్స్‌) క్యాంపస్‌లకు మంచి పేరుంది. వీటిలో ఇంటిగ్రేటెడ్‌ ఫస్ట్‌ డిగ్రీ ప్రోగ్రామ్‌ల పేరిట బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా బిట్‌శాట్‌ నిర్వహిస్తున్నారు. ఇందులో సాధించిన స్కోర్‌ ఆధారంగా బిట్స్‌ క్యాంపస్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. 2023-24 ప్రవేశాలకు సంబంధించి బిట్‌శాట్‌-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. బిట్‌శాట్‌తో ప్రవేశం లభించే కోర్సులు, ప్రవేశ పరీక్ష ప్యాట్రన్, బెస్ట్‌ స్కోర్‌కు మార్గాలు..

దేశంలో ఇంజనీరింగ్‌ విద్యను అందించే ప్రసిద్ధ ఇన్‌స్టిట్యూట్‌ల్లో బిట్స్‌ ముందు వరుసలో నిలుస్తుంది. ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఎమినెన్స్, డీమ్డ్‌ యూనివర్సిటీ హోదా కలిగిన ఈ విద్యాసంస్థలో బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీ వంటి కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్‌ అవకాశాలు అందుకోవచ్చు. అందుకే వీటిల్లో ప్రవేశానికి నిర్వహించే బిట్‌శాట్‌కు పోటీ కూడా ఎక్కువగానే ఉంటోంది.

అర్హతలు

- బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 10+2/ఇంటర్మీడియెట్‌ ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌ సబ్జెక్టులలో ఒక్కో సబ్జెక్ట్‌లో 60 శాతం మార్కులతో.. మొత్తం గ్రూప్‌ సబ్జెక్ట్‌లలో కలిపి సగటున 75 శాతం మార్కులు సాధించాలి.
- 10+2/ఇంటర్మీడియెట్‌ 2022లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే వారు కూడా బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్‌ ఫస్ట్‌ డిగ్రీ

- బిట్స్‌ నిర్వహించే బిట్‌శాట్‌లో స్కోర్‌ ఆధారంగా.. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న మూడు క్యాంపస్‌లు(పిలానీ, గోవా, హైదరాబాద్‌)ల్లో ఇంటిగ్రేటెడ్‌ ఫస్ట్‌ డిగ్రీ కోర్సులుగా పేర్కొనే బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీల్లో ప్రవేశం కల్పిస్తారు.
- పిలానీ క్యాంపస్‌లో..కెమికల్, సివిల్, కంప్యూటర్‌ సైన్స్, ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్‌ ఇంజనీరింగ్‌ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- గోవా క్యాంపస్‌లో.. కెమికల్, సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్‌ బ్రాంచ్‌లు ఉన్నాయి.
- హైదరాబాద్‌ క్యాంపస్‌లో.. కెమికల్, సివిల్, కంప్యూటర్‌ సైన్స్, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్‌ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- వీటితోపాటు బీఫార్మ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో కూడా బిట్స్‌ క్యాంపస్‌లు ప్రవేశం కల్పిస్తున్నాయి.

నాలుగు విభాగాలు..130 మార్కులు

- బిట్‌శాట్‌ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌ విధానంలో నాలుగు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో జరుగుతుంది.
- పార్ట్‌-1లో ఫిజిక్స్‌-30, పార్ట్‌-2లో కెమిస్ట్రీ-30, పార్ట్‌-3లో ఎ)ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ 10, బి)లాజికల్‌ రీజనింగ్‌ 20, పార్ట్‌-4లో మ్యాథమెటిక్స్‌/బయాలజీలో 40 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 130 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది.
- నాలుగో విభాగంలో పేర్కొన్న మ్యాథమెటిక్స్‌ లేదా బయాలజీ సబ్జెక్టుల్లో బీఫార్మసీ విద్యార్థులు ఏదో ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు.
- బీఈ కోర్సుల అభ్యర్థులు మాత్రం తప్పనిసరిగా మ్యాథమెటిక్స్‌ సబ్జెక్టుతోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 130 ప్రశ్నలతో 390 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్‌ మార్కింగ్‌ విధానం కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.

అదనంగా 12 ప్రశ్నలు

బిట్‌శాట్‌లో మరో ప్రత్యేకత.. పరీక్షకు కేటాయించిన మూడు గంటల వ్యవధిలో అన్ని ప్రశ్నలను పూర్తిచేసిన అభ్యర్థులకు..అదనంగా మరో 12 ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ లేదా బయాలజీ, లాజికల్‌ రీజనింగ్‌ నుంచి మూడు ప్రశ్నలు చొప్పున ఇస్తారు.

రెండు సెషన్లు

బిట్‌శాట్‌ను రెండు దశలుగా(సెషన్లు)నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు సెషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితంగా విద్యార్థులకు ఏ సెషన్‌లో మంచి స్కోర్‌ వస్తుందో..దాన్ని మెరిట్‌ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా రెండు సెషన్లకు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు కచ్చితంగా తొలి సెషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందే.

మెరిట్‌ జాబితా ఇలా

మెరిట్‌ జాబితా రూపకల్పనలో బిట్‌శాట్‌లో పొందిన స్కోర్‌ను.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న క్యాంపస్‌ ప్రాథమ్యాలను, ఇంజనీరింగ్‌ బ్రాంచ్‌ ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుంటారు. దానికి అనుగుణంగా సీట్ల కేటాయింపు చేస్తారు.

బోర్డ్‌ టాపర్స్‌కు నేరుగా ప్రవేశం

బిట్స్‌ ప్రవేశాల పరంగా మరో ప్రత్యేకత.. ఆయా రాష్ట్రాల బోర్డ్‌ల పరిధిలో ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సుల్లో స్టేట్‌ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బిట్‌శాట్‌కు హాజరు నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ బోర్డ్‌ టాపర్స్‌ నేరుగా ఇంటిగ్రేటెడ్‌ ఫస్ట్‌ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంది. ఈ విధానానికి కూడా విద్యార్థుల నుంచి ఎంతో ఆదరణ లభిస్తోంది.

బోధన విధానం

బిట్స్‌ క్యాంపస్‌లలో అడ్మిషన్‌ పొందిన విద్యార్థులకు కోర్సు కాల వ్యవధిలో విస్తృత నైపుణ్యాలు అందుకునే అవకాశం లభిస్తుంది. ఆయా కోర్సులకు సంబంధించి బిట్స్‌ ప్రత్యేక కరిక్యులంను రూపొందించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్‌ అప్రోచ్‌ పెరిగే విధంగా దీన్ని సిద్ధం చేశారు. బీఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు.. కోర్సు వ్యవధిలో రెండుసార్లు ప్రాక్టీస్‌ స్కూల్‌-1,ప్రాక్టీస్‌ స్కూల్‌-2 పేరుతో.. పరిశ్రమల్లో రీసెర్చ్‌ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

మైనర్‌ ప్రోగ్రామ్స్‌

కోర్‌ సబ్జెక్ట్‌లే కాకుండా.. విద్యార్థులకు ఇతర అంశాల్లోనూ అవగాహన కల్పించే విధంగా మైనర్‌ ప్రోగ్రామ్స్‌ విధానాన్ని బిట్స్‌ అమలు చేస్తోంది. ఫైనాన్స్, అకౌంటింగ్, లిటరేచర్, హ్యూమానిటీస్‌ వంటి పలు సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌ ఇవ్వడం మరో విశేషం.

300కు పైగా స్కోర్‌

బిట్‌శాట్‌ ద్వారా దేశంలోని మూడు బిట్స్‌ క్యాంపస్‌లలో మూడు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఏటా దాదాపు 60 వేల మంది పోటీ పడుతున్నట్లు సమాచారం. దీంతో..పరీక్షలో 300కు పైగా మార్కులు సాధిస్తేనే తుది విజేతల జాబితాలో నిలిచే అవకాశం ఉంటుంది.

ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు

బిట్‌శాట్‌ స్కోర్‌ ఆధారంగా దేశంలోని పలు ప్రైవేటు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు కూడా బీటెక్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఇప్పటికే ఎస్‌ఐటీ యూనివర్సిటీ, బిట్స్‌తో ఒప్పందం చేసుకుంది. ఇది కాకుండా దాదాపు వంద వరకు ప్రముఖ ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు తమ ప్రవేశ ప్రక్రియకు బిట్‌శాట్‌ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

బెస్ట్‌ స్కోర్‌కు మార్గాలు

జాతీయ స్థాయిలో వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడే బిట్‌శాట్‌లో బెస్ట్‌ స్కోర్‌ సాధించేందుకు దృష్టి సారించాల్సిన అంశాలు..

బేసిక్‌ కాన్సెప్ట్స్‌..ఫస్ట్‌

- బిట్‌శాట్‌ అభ్యర్థులు తొలుత బేసిక్‌ కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఈ పరీక్ష కూడా జేఈఈ స్థాయి క్లిష్టతతో ఉంటోంది. ప్రశ్నలన్నీ దాదాపుగా అప్లికేషన్‌ ఓరియెంటేషన్‌తో ఉంటున్నాయి. దీంతో అభ్యర్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ బేసిక్స్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ.. చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్‌ సాగించొచ్చు. బేసిక్స్‌పై పట్టు సాధించడం తోపాటు విద్యార్థులు నిర్దిష్టంగా కొన్ని వ్యూహాలు అనుసరిస్తే.. బిట్‌శాట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచే అవకాశముంది.
- ప్రతి సబ్జెక్ట్‌లోనూ ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్‌కట్‌ మెథడ్స్‌తో సొంత నోట్స్‌ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌ సమయంలో ఎంతో అనుకూలంగా ఉంటుంది.
- కెమిస్ట్రీలో ముఖ్యంగా ఆర్గానిక్‌ కెమిస్ట్రీలో కెమికల్‌ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి.
- ఫిజిక్స్‌లో.. వర్క్‌ అండ్‌ ఎనర్జీ, న్యూటన్స్‌ లా, కరెంట్‌ ఎలక్ట్రిసిటీ, హీట్‌ అండ్‌ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్‌ మ్యాగ్నటిక్‌ ఎఫెక్ట్‌ ఆఫ్‌ కరెంట్, ఎలక్ట్రిక్‌ కరెంట్‌ యూనిట్లలో ముఖ్య అంశాలతో నోట్స్‌ రూపొందించుకోవాలి.
- మ్యాథమెటిక్స్‌లో.. హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్‌ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటిగ్రల్‌ కాలిక్యులస్‌ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పార్ట్‌-3కి ప్రత్యేకంగా

- ఇతర ఇంజనీరింగ్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌లతో పోలిస్తే.. బిట్‌శాట్‌ ప్రత్యేకం పార్ట్‌-3 అని చెప్పొచ్చు. ఈ విభాగంలో ఇంగ్లిష్‌ ప్రొఫిషియన్సీ, లాజికల్‌ రీజనింగ్‌ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. కేవలం అభ్యర్థుల్లోని సబ్జెక్ట్‌ నైపుణ్యాలను పరీక్షించడమే కాకుండా.. లాంగ్వేజ్, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఈ విభాగాన్ని పొందుపర్చారు. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్‌ గ్రామర్, వొకాబ్యులరీపై పట్టుంటే.. 25 ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇవ్వొచ్చు.

బిట్‌శాట్‌-2023 ముఖ్య సమాచారం

సెషన్‌ 1 ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్‌ 9, 2023
- టెస్ట్‌ సెంటర్‌ కేటాయింపు: ఏప్రిల్‌ 26, 2023
- టెస్ట్‌ తేదీ, స్లాట్‌ బుకింగ్‌ సదుపాయం: ఏప్రిల్‌ 27- మే 8, 2023
- హాల్‌టికెట్‌ డౌన్‌లోడ్‌ సదుపాయం: మే 10 నుంచి పరీక్ష తేదీ వరకు
- బిట్‌శాట్‌-2023 సెషన్‌-1 పరీక్ష తేదీలు: మే 21 -మే 26, 2023

సెషన్‌ 2 ముఖ్య తేదీలు

- బిట్‌శాట్‌-2023 సెషన్‌-2 దరఖాస్తు తేదీ: మే 22 - జూన్‌ 12, 2023
- బిట్‌శాట్‌-2023 సెషన్‌-2 పరీక్ష తేదీలు: జూన్‌ 18 - జూన్‌ 22, 2023
- అడ్మిషన్‌ జాబితా ప్రకటన: జూలై 1, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: బిట్స్‌ పిలానీ-హైదరాబాద్‌ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: https://www.bitsadmission.com/fdmain.aspx

ఊస్టింగ్ అయినా పోస్టింగ్‌లున్నాయి..

అమెరికాలో వివిధ రంగాల్లో జాబ్ ఓపెనింగ్స్

- టెక్ కంపెనీల్లో కూడా..
- గత మూడేళ్లలో టాప్–20 లేఆఫ్స్‌లో లక్ష మందిని తొలగించారు
- లేఆఫ్ ప్రకటించిన రోజు 1000 జాబ్ ఓపెనింగ్స్ ప్రకటించిన గూగుల్
- 1.10 కోట్ల ఉద్యోగాలు భర్తీ కోసం ఉన్నట్లు అమెరికా లేబర్ బ్యూరో వెల్లడి
- 'హైస్కిల్' వర్కర్స్‌కి ఉద్యోగాలు దొరకడం కష్టంకాదు
- 'లేఆఫ్స్' తాత్కాలికమే.. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొంటాయి
- అప్పటివరకు కొత్త స్కిల్స్‌తో ఇతర రంగాల్లో ఉద్యోగాలు పొందొచ్చు



(ఎం. విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

అమెరికా టెక్ ఉద్యోగులకు ఈ మూడేళ్లు గడ్డుకాలమే. 2023 అయితే పీడకల లాంటిది. లేఆఫ్స్‌ను ట్రాక్ చేస్తున్న 'ట్రూఅప్' వెబ్‌సైట్ గణాంకాల ప్రకారం.. కేవలం 40 రోజుల వ్యవధిలో (ఫిబ్రవరి 9 వరకు) 1,26,879 మందిని.. 2022లో 2,41,176 మందిని తొలగించారు. అయితే.. తొలగిస్తున్న కంపెనీల్లో అతికొద్ది కంపెనీలు మాత్రమే రిక్రూట్‌మెంట్ల మీద 'ఫ్రీజింగ్' విధించాయి. భారీ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, యూనికార్న్‌ల్లో ఉద్యోగాల భర్తీ కొనసాగుతూనే ఉంది. ఫిబ్రవరి 3 నాటికి 1,69,676 జాబ్ ఓపెనింగ్స్ ఉండటం గమనార్హం. లేఆఫ్స్‌లో ఉద్యోగాలు పోగొట్టుకున్న వారిలో కొందరికి మళ్లీ వేగంగా ఉద్యోగాలు దొరుకుతున్నాయి. అయితే, అంతకుముందు కంపెనీతో పోలిస్తే జీతంలో వ్యత్యాసం, ఎక్కువ గంటలు పనిచేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అమెరికా టెక్ కంపెనీల్లో పనిచేస్తున్న భారతీయుల్లో చాలామంది 'హెచ్1బి' వీసా మీద ఉంటారు. ఉద్యోగంపోతే.. 60 రోజుల్లోగా మరో ఉద్యోగం సంపాదించని పక్షంలో అమెరికాను వదిలి తిరిగి మాతృదేశానికి వెళ్లాల్సి ఉంటుంది. టెక్ కంపెనీల్లో ఉద్యోగంపోతే ఆందోళన చెందకుండా మరో ఉద్యోగానికి ప్రయత్నించాలని.. చాలా టెక్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పూర్తిగా మూసుకుపోలేదని నిపుణులు సూచిస్తున్నారు.

అటు లేఆఫ్స్.. ఇటు ఓపెనింగ్స్..

గత మూడేళ్లలో టాప్–20 లేఆఫ్స్‌లో లక్ష మందిని తొలగించారు. అందులో టాప్–1 లేఆఫ్ గూగుల్‌ది. ఈ సంస్థ 12 వేల మందిని ఒకేసారి తొలగించింది. కానీ, అదే రోజు దాదాపు 1,000 జాబ్ ఓపెనింగ్స్ ప్రకటించింది. భారీ టెక్ కంపెనీల్లో రెండుమూడు మినహా మిగతా కంపెనీలదీ అదేబాట. భారతీయ టెకీలు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అవసరమైతే కొత్త స్కిల్స్‌ను వేగంగా నేర్చుకునే సామర్థ్యం మన టెకీల సొంతం.

యూఎస్‌లో భారీగా ఉద్యోగావకాశాలు

టెక్ కంపెనీల్లో లేఆఫ్స్ ప్రకటిస్తుంటే.. మిగతా రంగాల్లో భారీ సంఖ్యలో జాబ్ ఓపెనింగ్స్ ఉన్నాయి. యూఎస్ఏ బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బీఎల్ఎస్) డేటా ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో 1.10 కోట్ల ఉద్యోగాలు భర్తీకి ఎదురుచూస్తున్నాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఏడుశాతం అధికంగా జాబ్ ఓపెనింగ్స్ ఉన్నాయి. అమెరికాలో ప్రతి నిరుద్యోగికి 1.9 ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయని.. జనవరిలో వివిధ రంగాల్లో 5.17 లక్షల ఖాళీలు భర్తీ అయ్యాయని బీఎల్ఎస్ పేర్కొంది. టెక్ కంపెనీల్లో ఓపెనింగ్స్ గతంలో పోలిస్తే తగ్గాయని, పూర్తిగా నిలిచిపోలేదని వెల్లడించింది.

మళ్లీ స్టార్టప్ రోజులకు..

మరోవైపు.. ఉద్యోగులను తొలగిస్తున్న కంపెనీలు మిగిలిన సిబ్బందికి పంపిస్తున్న అంతర్గత కమ్యూనికేషన్లలో.. 'మనం ఇంకాస్త ఎక్కువ కష్టపడి పనిచేయాల్సిన అవసరం వచ్చింది. స్టార్టప్ రోజుల్లో మాదిరిగా పనిచేస్తే విజయం మన సొంతమవుతుంది' అని యాజమాన్యాలు ఉద్బోదిస్తున్నాయి. అమెరికా భారీ టెక్ కంపెనీలు ఇలా భావించడం నూతన పోకడే.

ఉద్యోగాలు కోల్పోయిన టెకీల పయనం ఎటు?

ఇక ఉద్యోగాలు కోల్పోయిన టెకీల పయనం మీద 'వోక్స్ మీడియా'లో టెక్నాలజీ బిజినెస్ వ్యవహారాలు కవర్ చేస్తున్న రాణి మొల్ల ఆసక్తికర కథనం రాశారు. అందులోని అంశాలు ఏమిటంటే..

- హెచ్1బీ వీసాల మీద ఉన్న భారతీయ టెకీలు సాధారణంగా మరో ఉద్యోగం కోసం వెతుకుతారు. టెక్ కంపెనీల్లో దొరక్కపోతే.. అమెరికా నుంచి మాతృదేశానికి వెళ్లిపోకుండా, ఇతర రంగాల్లో ఏదో ఒక ఉద్యోగం సంపాదిస్తున్నారు.
- టెక్ కంపెనీల్లో ఆకర్షణీయ వేతనాలు, భారీ పెర్క్‌ల మైమరపు నుంచి టెకీలు వాస్తవ ప్రపంచంలోకి వస్తున్నారు. కరోనా విపత్తు సమయంలో భారీగా లాభాలు ఆర్జించిన టెక్ కంపెనీలు.. ఇప్పుడు పొదుపు చర్యల గురించి మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉద్యోగాల తొలగింపువల్ల తాత్కాలికంగా ఇబ్బంది ఉంటుంది. కానీ, అంతకంటే ఎక్కువ నష్టం కంపెనీలకే ఉంటుంది. ఉద్యోగాల తొలగింపుల్లో 'టాలెంట్'ను కూడా కంపెనీలు కోల్పోతున్నాయనే విషయాన్ని గుర్తించడం లేదు. ఇంకొంత కాలానికైనా గుర్తిస్తాయి.
- ఉద్యోగాలు కోల్పోయిన వారు కొత్తగా వ్యాపారాలు ప్రారంభించి ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. తమ ప్రతిభతో వ్యాపారాల్లోనూ విజయం సాధించే అవకాశాలు ఎక్కువే. ఆ ప్రయత్నాలు ఫలిస్తే, వారికి మంచి రోజులు వచ్చినట్లే.
- అలాగే, ఒకవైపు లేఆఫ్స్ ప్రకటిస్తున్న గూగుల్, ఆపిల్ లాంటి భారీ కంపెనీలు వరుసగా 25 నెలలుగా జాబ్ ఓపెనింగ్స్ ప్రకటిస్తూనే ఉన్నాయని 'ది కంప్యూటింగ్ టెక్నాలజీ ఇండస్ట్రీ అసోసియేషన్' (కంప్‌టీఐఏ) ప్రకటించింది.
- టెక్ కంపెనీలు తొలగిస్తున్నది కేవలం టెక్ ఉద్యోగాలు మాత్రమే కాదు. హెచ్ఆర్, సేల్స్, ఫైనాన్స్ విభాగాల ఉద్యోగాలూ ఉన్నాయి. వాళ్లకు నాన్–టెక్ కంపెనీల్లోనూ ఉద్యోగాలుంటాయి. గూగుల్ కాలిఫోర్నియా కార్యాలయం నుంచి తొలగించిన ఉద్యోగుల్లో అన్ని విభాగాల వారున్నారు. అందులో 30 మంది మసాజ్ థెరపిస్టులూ ఉన్నారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి



సదస్సులో పాల్గొన్న మంత్రులు రాజేంద్రనాథ్, అమర్‌నాథ్ తదితరులు

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో పాల్గొనండి
- బెంగళూరు రోడ్ షోలో పారిశ్రామికవేత్తలకు మంత్రులు అమర్‌నాథ్, బుగ్గన రాజేంద్రనాథ్ ఆహ్వానం

సాక్షి బెంగళూరు: ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా సహజ, మానవ వనరులు, మౌలిక వసతులున్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆహ్వానించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం మంగళవారం బెంగళూరులో రోడ్ షో నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు. అనేక దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు ఇందులో పాల్గొనబోతున్నారని చెప్పారు. అన్ని రంగాల్లోనూ ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిందని వివరించారు. దేశంలోనే సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో ఏపీ అగ్రస్థానంలో కొనసాగుతోందని వెల్లడించారు. సుమారు 13 రంగాల్లో దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో మొత్తం 11 పారిశ్రామిక కారిడార్లు ఉండగా, అందులో మూడు ఒక్క ఏపీలోనే అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ.. గత మూడున్నరేళ్లలో ఏపీ స్థిరమైన అభివృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని వివరించారు. గతేడాది లాజిస్టిక్స్, విద్యుత్, పోర్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో జాతీయ స్థాయిలో పలు అవార్డులను సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఏపీలోని అవకాశాలను ఉపయోగించుకొని.. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి మరింతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి , ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి, చేనేతవృత్తులు, టెక్స్‌టైల్స్ ముఖ్య కార్యదర్శి కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించండి

కేంద్ర అటవీశాఖ ఏడీజీని కోరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి,న్యూఢిల్లీ: పల్నాడు వాసుల ఏడు దశాబ్దాల కల వరికపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) బివాష్ రంజన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. నిర్మాణానికి కావాల్సిన అనుమతులు జారీ చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్లియరెన్స్‌లు పొందడానికి అవసరమైన డీపీఆర్ సహా, అన్ని ప్రక్రియలను పూర్తి చేసి నివేదికలను కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిందని తెలిపారు. 19.13 హెక్టార్ల భూమి మళ్లింపును వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఏడీజీకి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వివరించారు.

దేశాన్ని ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత మోదీదే



మోదీ@ 20 ఏళ్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ప్రకాష్ జవదేకర్, సునీల్ దేవధర్, సోము వీర్రాజు, ఐవైఆర్ కృష్ణారావు తదితరులు.

- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- 'మోదీ@20 ఏళ్లు' సృష్టించారు...సాధించారు పుస్తకావిష్కరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కరోనా వంటి సంక్షోభాలు వెంటాడుతున్నా దేశాన్ని ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎమెస్కో పబ్లిషర్స్ అనువాద ముద్రణ 'మోదీ@20 ఏళ్లు– సృష్టించారు....సాధించారు' పుస్తకావిష్కరణ కార్యక్రమం 33వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై మంగళవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యూకే వంటి అభివృద్ధి చెందిన దేశాన్ని పక్కకునెట్టి భారత్ ఐదో పెద్ద ఆర్థికశక్తిగా ఎదగటంలో ప్రధాని మోదీ నాయకత్వ పటిమ దాగుందన్నారు. ప్రతి రోజూ ఒక్కో సవాల్ ఎదురవుతున్నా అద్భుతమైన పరిపాలనను అందిస్తున్న మోదీ నాయకత్వం దేశానికి మరింత అవసరమన్నారు. మోదీ ప్రధాని అయిన తరువాత మతకలహాలు, కర్ఫ్యూ, ఉగ్రవాద దుశ్చర్యలు వంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. మోదీ నాయకత్వంలో అవినీతి, ఉగ్రవాదాలను పూర్తిగా తరిమికొట్టడంలో విజయం సాధించామన్నారు. ఉపాధి అవకాశాలను అందిస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలుచేస్తున్న మోదీ నాయకత్వం రానున్న కాలంలో మరింత అవసరమన్నారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య శతజయంతి రోజున ఈ పుస్తకం తెలుగులో అనువాదం కావటం ఆనందంగా ఉందన్నారు. మోదీ పరిపాలన, నాయకత్వ పటిమలపై 20 మంది ప్రముఖులు రాసిన వ్యాసాల సంకలనాన్ని తెలుగులో అనువదించటం అభినందనీయమన్నారు. మాజీ కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ వినూత్న పాలనావిధానాలతో మోదీ దేశాభ్యున్నతిని పరుగులుపెట్టిస్తున్నారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశంలో అపూర్వమైన ఫలితాలను తీసుకొస్తున్నాయన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు మాట్లాడుతూ మోదీ నాయకత్వం దేశంలో అనేక అద్భుతాలు చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమెస్కో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

*ఫైనాన్స్ స్కీం ఆఫర్ తమ స్వంత నిర్ణయాధికారం మేరకు ఎంపిక చేసిన కస్టమర్స్ ప్రొఫైల్స్ కోసం ఎంపిక చేసిన మోడల్స్ పై ప్రాధాన్యతనిచ్చిన ఎంపిక చేయబడిన ఫైనాన్స్ భాగస్వాముల ద్వారా లభ్యం మరియు ఫైనాన్స్ కంపెనీ పాలసీకి ఇది లోబడి ఉంది. ఫైనాన్స్ స్కీంఎంపిక చేసిన కొన్ని డీలర్ షిప్స్ వద్ద 28 ఫిబ్రవరి 2023 వరకు మాత్రమే లభిస్తాయి & ముందుగా నోటీసు ఇవ్వకుండా ఏ సమయంలోనైనా ఉపసంహరించవచ్చు. రెండు ఆఫర్స్ కలపబడవు. చిత్రంలో చూపించిన ఉత్పత్తి మార్కెట్‌లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. ఉత్పత్తిలో చూపించిన యాక్సెసరీస్ ప్రామాణిక సామగ్రిలో భాగం కాదు.

Honda Exclusive Authorised Dealerships: CHENNAI: ADAYAR: Kun Honda - 9841439103, 9884014555; AMBATUR: JSP Honda - 7299951888, 9841644333; ANNA NAGAR: J.S.P. Honda - 9841648574, 9841633085; ANNA SALAI: Didar Honda - 9840790781, 8056015200; ARUMBAKKAM: J.S.P. Honda - 8144841707; ASHOK NAGAR: Kun Honda - 9841439104, 9884014555; AVADI: SVM Honda - 7200022052, 9003222022; AYANAVARAM: SVM Honda - 8754043556, 8754598556; AYYAPAKKAM: SVM Honda - 7200033369, 8754598565; BROADWAY: Balaji Honda - 7904884055, 044-42102110; CHETPET: Didar Honda - 9384012023; CHENGALPET: Abhiram Honda - 8870013733, 9884254345; CHROMEPET: Lodha Honda - 7299911346, 7299911347; EGMORE: Didar Honda - 9003130005, 9500095176; EKATTUTHANGAL: KSN Honda - 7299057001, 7299057002; ELDAMS ROAD: Red Honda - 7530078300, 7530079300; ERUKKENCHERY: Balaji Honda - 7550220950, 9566250506; GUDUVANCHERI: Om Prakash Honda - 27462199, 9840772970; GUMMIDIPOONDI: Veera Honda - 9600687999, 9600587999; KANCHIPURAM: Sri Lingam Honda - 9280255956, 9940031233, 27269933; KALPAKKAM: Abhiram Honda - 8870007965, 9884254345; KEELKATTALAI: Maanasarovar Honda- 8939874083, 9566281468; KELAMBAKKAM: Vijaya Honda - 9940653255; KOLATHUR: SVM Honda - 8754598557, 8754598563; KUNDRATHUR: JK Honda - 8148143777, 8148146777; MANALI: BM Honda - 7824025599, 42803004; MADIPAKKAM: Maansarovar Honda - 8939781272, 8939781273; MANDAVELI: Red Honda - 7530076300, 7530074300; MEDAVAKKAM: Maansarovar Honda - 9566281465, 8939890408; MUGHCHUR: Shabeel Honda - 9551024000, 9003049596; MUGAPAIR: JSP Honda - 98416 48546; NAVALUR: Vijaya Honda - 8870971555; NEELANKARAI: Suryabala Honda - 9789444914, 9789444935; NERKUNDRAM: KKG Honda - 8754580009, 9445353333; SRIPERUMBUDUR: Shabeel Honda - 9551511142; OLD WASHERMAN PET: Balaji Honda - 044-45985588, 9566044634; PADI: J.S.P Honda - 9841648563, 9841648513; PALLIKARANI: Maansarovar Honda - 8939874290, 8939874291; PAMMAL: Lodha Honda - 9841688688, 9841015416; PERAMBUR: JSP Honda - 9841810779, 9941080111; PERUNGALATHUR: Om Prakash Honda - 7358397962, 7448802355; PONNERI: Akshaya Honda - 9841364455, 27974001; POONAMALLEE: Surya Honda - 42821242, 42821244; PORUR: Surya Honda - 7823944301; PUDUR: JSP Honda - 9841648579, 8144841633; REDHILLS: Balaji Honda - 044-26321188, 7397719545; SHOLINGANALLUR: Suryabala Honda - 9789444914, 9789777270; ST. THOMAS MOUNT: Maansarovar Honda - 8939781693, 8939781694; SOWCARPET: Balaji Honda - 7397222615; T. NAGAR: Didar Honda - 9952960781, 9500035460; TAMBARAM: Lodha Honda - 7299911347, 9841688488; THIRUMAZHISAI: Surya Honda - 9345544542; THIRUVALLUR: Shubham Honda - 78258 88301, 95000 92326; THIRUPORUR: Vijaya Honda - 9789358555; THIRAIPAKKAM: KUN Honda - 9841439105, 9884014555; TIRUTHANI: Global Honda - 9444988446, 9488423089; VALASARAVAKKAM: KSN Honda - 7299057019, 7299057013; VELACHERI: Maansarovar Honda - 8939890235, 8939871596; WEST TAMBARAM: Lodha Honda - 9087377444; KANCHIPURAM: Badni Honda – 9169163050, 9169162024.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.